
ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 46 సంచిక : 6 అభివృద్ధి మాసపత్రిక ఏప్రిల్, 2018 ₹ 22

## ఈశాన్య రాష్ట్రాలు




ఈశాన్య రాష్ట్రాలు - సమ్మిళిత అభివృద్ధి, సవాళ్లు
సి.కె. దాస్

ఈశాన్య రాష్ట్రాలు - ఆర్థిక విశ్లేషణ
మంజుల వాధ్వా

ఈశాన్యంలో వ్యవసాయాభి వృద్ధి....
ఆర్థికాభివృద్ధికి వెదురు మిషన్ ఒక సాధనం
నీరేంద్ర దేవ్

ప్రత్యేక వ్యాసం
ఈశాన్య రాష్ట్రాల్లో పరిపాలనాపరమైన సవాళ్లు
నరేష్ చంద్ర సక్సేనా

విశిష్ట వ్యాసం
ఈశాన్యంలో నైపుణ్యాభివృద్ధి
ఇబూ సంజీబ్ గార్గ్

భారతదేశ అభివృద్ధికి దోహద పడుతున్న కృత్రిమ మేధస్సు
డాక్టర్ అవిక్ సర్కార్

## అభివృద్ధి మార్గ సూచి:




### జాతీయ పౌష్టికాహార పథకం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మార్చి 08న ప్రధానమంత్రి జాతీయ పౌష్టికాహార పథకాన్నీ, బేటీ బచావో, బేటీ పఢావో విస్తృత పథకాన్ని (బిబిబిపి) ప్రారంభించారు. ఈ బిబిబిపి పథకం ఇప్పుడు దేశంలోని మొత్తం 640 జిల్లాలకూ వర్తిస్తుంది. రాజస్థాన్‌లోని ఝున్ ఝును జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని సమర్థంగా అమలుచేసిన పది జిల్లాల అధికారులను సత్కరించారు.



బాలికలకు బాలురతో సమానంగా నాణ్యమైన విద్యను అందించడం, బాలికలు కుటుంబానికి భారం కాదనే భావనను పెంపొందించడం వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తూ, బాలికలు కుటుంబానికీ, సమాజానికీ కూడ గర్వకారణమన్నారు. బిబిబిపి మూడవ వార్షికోత్సవ సందర్భంగా ఒక ఫొటో ఆల్బంను ఆవిష్కరించారు. కార్యక్రమానంతరం, బిబిబిపి పథకం ఆరంభానంతరం జన్మించిన 200 మంది స్థానిక బాలికలతోనూ, వారి తల్లులతోనూ ఆయన సంభాషించారు. ప్రజలు, ప్రభుత్వాలు ఉమ్మడిగా చేసిన కృషి ఫలితంగా 2014-15లో 918గా ఉన్న బాలికల నిష్పత్తి, 2016-17 నాటికి 926కు పెరిగింది. 2017-18 నుండి, 2019-20 వరకు బిబిబిపి పథక కేటాయింపు రూ. 1132.5 కోట్లు. ■

ISSN : 0971-8729

**మమ్మల్ని కలవండి:** https://www.facebook.com/pages/Yojana-journal

e-mail : yojana_telugu@yahoo.co.in e-mail : yojana.telugu@nic.in

**ఏప్రిల్, 2018** **సంపుటి : 46** **సంచిక : 6**

# యోజన

**1973 నుండి**

ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వత:

(ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)

ముఖ్య సంపాదకులు : **దీపికా కచ్చల్**

సీనియర్ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**

సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విస్తృత చర్చకు యోజన ఒక వేదిక. దీనికోసం ప్రభుత్వ విధానాలపై పరిశీలనకు వ్యాసాల రూపంలో వెసులుబాటు కల్పిస్తోంది. యోజన కేవలం ప్రభుత్వ వాణిని వినిపించే బాకా కాదు. ఈ మాస పత్రిక అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు మరియు ఉర్దూ భాషలలో ప్రచురించబడు తున్నది.

ఛీఫ్ ఎడిటర్ కార్యాలయం: రూం నెంబర్-660 సూచనాభవన్; సి.జి.ఓ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003. ఫోన్: 011-24362971.

ఈ-మైల్: yojanace@gmail.com:

వెబ్ సైట్: www.yojana.gov.in;
www.publicationsdivision.nic.in

యోజన ఇంగ్లీష్; రూం నెంబర్ 647; సూచన భవన్; సి.జి.ఒ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003.

సంయుక్త సంచాలకుడు (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

మా ప్రతినిధులు: అహ్మదాబాద్: శ్రీమతి అమిత మారు; బెంగుళూరు: కుమారి ఎస్. పునీత; చెన్నై: ఏ. ఇలంగోవన్; గువహటి: అనుపమ దాస్; హైదరాబాద్: విజయకుమార్ వేదగిరి; కొల్ కత్తా: శ్రీమతి రమా మండల్; ముంబై: ఉమేష్ సదాశివరావు ఉజ్గరె; తిరువనంతపురం: శ్రీమతి కె. ధన్య సన్యాల్; జలంధర్: శ్రీమతి గగన్ దీప్ కౌర్ దేవగన్; భుబనేశ్వర్ గిరీష్ చంద్ర దాస్.

**సూచన:** ఈ పత్రికలోని వివిధ వ్యాసాలలో వెలువరించిన అభిప్రాయాలు ఆయా వ్యాస కర్తలవే గానీ, ప్రభుత్వానివి కావు.

వ్యాసాలలో ఉపయోగించిన ఏ దేశానికి చెందినవైనా జెండాలు, మ్యాపులు కేవలం సూచనప్రాయమేగానీ, అధికార మ్యాపులను ప్రతిఫలించవు. చట్టపరమైన సూచికలు కూడ కావు.

ఈ పత్రికలో వచ్చే ప్రకటనలలోని నిజనిజాలను పాఠకులు ముందుగా నిర్ధారించుకోవలసిందిగా మనవి. వీటిలోని ఏ అంశానికీ యోజన బాధ్యత వహించదు.

**చందా:**

యోజన మాసపత్రిక ఏ భాషదైనా సంవత్సర చందా రూ. 230/- రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ 610/- విదేశాలకైతే ఇవే చందారేట్లతో పాటు, ఇండియా పోస్టు వారు నిర్ణయించిన ఎయిర్ మెయిల్ ఛార్జీలను చెల్లిస్తే చాలు.

**నూతన చందాలు, నవీకరణలు, ఫిర్యాదులకు సంప్రదించండి : యోజన (తెలుగు), రూం.నం. 205, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**

ఫోన్ **040-27546313; 011-24367453** లేదా

**ఈ-మెయిల్: www.yojana_telugu@yahoo.co.in; www.pdjucir@gmail.com**

## ఈ సంచికలో...

1. ఈశాన్య రాష్ట్రాలు - సమ్మిళిత అభివృద్ధి, సవాళ్లు
   - *సి.కె. దాస్*........................5
2. ఈశాన్య రాష్ట్రాలు - ఆర్థిక విశ్లేషణ
   - *మంజుల వాధ్వా*..............9
3. ఈశాన్యంలో అభివృద్ధికి వెదురు మిషన్ ఒక సాధనం
   - *నీరేంద్ర దేవ్*..................13
4. ఈశాన్య రాష్ట్రాల్లో పరిపాలనాపరమైన సవాళ్లు
   - *నరేష్ చంద్ర సక్సేనా*.........16
5. ఈశాన్యంలో నైపుణ్యాభివృద్ధి
   - *ఇబూ సంజీబ్ గార్గ్*...........20
6. దేశాభివృద్ధికి దోహద పడుతున్న కృత్రిమ మేధస్సు
   - *డాక్టర్ అవీక్ సర్కార్*........23
7. మారుతున్న భారతీయ రైల్వేల ముఖ చిత్రం
   - *డాక్టర్ శశికళా పుష్ప*
   - *డాక్టర్ బి.రామస్వామి*.........27
8. విజ్ఞాన విపంచి
   - *ప్రాతూరి పోతయ్య శర్మ*......30
9. గొప్ప దార్శనికుడు, ప్రజాస్వామ్య వాది డా॥ బి.ఆర్. అంబేద్కర్
   - *డొక్కా మాణిక్య వరప్రసాద రావు*.....33
10. రైతే రాజుగా తెలంగాణ బడ్జెట్ ... 2018-19
    - *రాజనాల బాలకృష్ణ*...........36
11. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ - 2018-19 ఒక పరిశీలన
    - *కోటు ప్రసాద్*..................40
12. ప్రధాన స్రవంతిలో ఈశాన్య రాష్ట్రాలు
    - *ఎస్.జే.చిరు*....................42
13. కేంద్ర బడ్జెట్ 2018 - 19 : ఆదాయపన్ను మార్పులు
    - *ప్రొఫెసర్ వి. ఉషా కిరణ్*......46
14. మనసులోని మాట
    - *ఆకాశవాణి*....................49
15. తెలంగానం ..............................51
16. తెలంగాణా రాష్ట్ర బడ్జెట్ - 2018-19: అందరికీ సంక్షేమం
    - *డి. సుప్రశాంతి దేవి*..........52
17. ఈశాన్య రాష్ట్రాల గిరిజన, గిరిజనేతర నృత్యాలు
    - *డా॥ సురభి లక్ష్మీశారద*........56

**పేజీల సంఖ్య 60**

**Sales Emporia:** New Delhi: Soochna Bhawan, CGO Complex, Lodhi Road; New Delhi-110003 (Phone No: 011-24365610). Delhi: Hall No. 196; Old Secretariat; Delhi-110 054(Phone: 01123890205). Navi Mumbai: 701, B Wing, 07th Floor, Kendriya Sadan, Belapur-400 614 (Phone: 022-27570686). Kolkatta: 8, Esplanade East-700 069 (Phone:033-22486696). Chennai: 'A' Wing, Rajaji Bhawan, Basant Nagar-600 090 (Phone: 04424917673). Thiruvananthapuram: Press Road; Near Govt. Press-695 001 (Phone:0471-2330650). **Hyderabad: Room No. 204, Second Floor, CGO Towers, Kavadiguda-500 080 (Phone: 040-27535383).** Bengaluru: First Floor, 'F' Wing, Kendriya Sadan, Koramangala-560 034 (Phone:080-25537244). Patna: Bihar State Co-operative Building, Asoka Rajpath-800 004 (Phone:0612-2675823). Lucknow: Hall No.1, Second Floor, Kendriya Bhawan, Sector-H, Aligunj-226 024 (Phone: 0522-2325455). Ahmadabad: Ambica Complex, First Floor, Above UCO Bank, Paldi-380 007 (Phone: 079-26588669). Guwahati: House No. 4, Pension Para Road-781 003 (Phone:030-2665090).


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### ఈశాన్యానికి నూతనోత్తేజం




మనం ఈశాన్య రాష్ట్రాలను తలుచుకోగానే, కాజీరంగా ఖడ్గమృగాలు, మేఘాలయలోని వర్షపు మేఘాలు, వెదురు బొమ్మలు, చేనేత దుస్తులు, అందమైన పూలతోటలు, తేయాకు తోటలు గుర్తుకు వస్తాయి. మనతో తిరిగి, మనతో చదువుకున్న ఈశాన్య మిత్రులు కూడా జ్ఞప్తికి వస్తారు. నిజానికి ఈశాన్య ప్రాంత మంటే కేవలం పర్యాటక ప్రదేశం మాత్రమేకాదు. వెదురు బొమ్మలు, ఆత్మీయమైన అక్కడి ప్రజలే కాదు, అక్కడి వారికి తమదైన స్వంత వ్యక్తిత్వం ఒకటి ఉన్నది. భౌగోళిక కారణాల దృష్ట్యా, మిగిలిన దేశం నుండి వేరుగా ఉన్నప్పటికీ, ఏడుగురు ఈశాన్య అక్కచెల్లెళ్లు, సిక్కిం కలిసి తమదైన గుర్తింపును ఏర్పరుచుకున్నాయి. అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మణిపూర్, అరుణాచల ప్రదేశ్, సిక్కింల అవసరాలను ప్రణాళికా రచనలో, బడ్జెట్ కేటాయింపులలో, ప్రాథమిక సౌకర్యాలకల్పనలో, అభివృద్ధిపథకాలను/కార్యక్రమాలనుకేటాయించడంలో, సమగ్రంగా చూశారు.

భౌగోళిక ఉనికి వలన ఈ ప్రాంతం వెనుకుబాటుతనంతో కునారిల్లుతోంది. అతి తక్కువ వ్యవసాయ ఉత్పాదకత, బ్యాంకుల నుండి తక్కువ ఋణ సౌకర్యాలు, భారీ పరిశ్రమలు లేకపోవడం, ప్రాథమీక సౌకర్యాలు అరకొరగా ఉండటం వంటి కారణాల వల్ల ఈ ప్రాంతంలో ప్రగతి కొంత కొరవడింది. చాలా కాలంగా కేంద్రంలోని ప్రభుత్వాలు ఈ లోప నివారణకు అనేక చర్యలు చేపట్టాయి. ప్రస్తుత ప్రభుత్వపు, "ఈశాన్యానికి ప్రాధాన్యం (Act East Policy)" విధానం ఆ ప్రాంతానికి మళ్ళీ ఆశలను చిగురింపచేసింది. మేఘాలయలోని మెండిపాతర్ నుండి గౌహతికి మొదటి రైలు మార్గం ప్రారంభం, త్రిపురలోని ONGC రెండవ దశను ప్రజలకు అంకితం చేయడం, దేశంలోనే అతి పెద్ద వంతెన "ధోల-సడియా"ను (9.15 కి.మీ.) ప్రారంభించడం, గౌహతిలో ఐఐఐటి కి పునాది వేయడం వంటి చర్యలు ఈ ప్రాంతంలో అభివృద్ధిని వేగవంతం చేశాయి. ఈ ఎనిమిది రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌ను కూడా రూ. 48,000ల కోట్ల స్థాయికి పెంచారు.

ఈశాన్యంలో ప్రధాన జీవనాధారం ఇప్పటికీ వ్యవసాయమే! పోడు వ్యవసాయం వంటి అలవాట్లవల్ల దిగుబడి అతి తక్కువగా ఉండటమే కాక, అక్కడి పర్యావరణం కూడా ఛిన్నాభిన్నం అవుతున్నది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం జాతీయ వెదురు పథకాన్ని ప్రారంభించింది. అక్కడి ప్రజలకు వెదురు పెంపకం ఒక ప్రధాన జీవనాధారం కావడం, వెదురు అధికంగా పెరగటం వంటి కారణాల వల్ల ఇక్కడి ప్రజలకు ఈ పథకం ఉత్సాహవంతమైన జీవనోపాధిని కల్పిస్తుంది. దీనికోసం కేంద్రం రూ. 1,290 కోట్లు కేటాయించింది. ప్రాంతాల మధ్య అనుసంధానం ఇక్కడి మరో పెద్ద సమస్య. రైలు, బస్సు సౌకర్యాలు అతి తక్కువగావడంవల్ల, రవాణా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఒక పెద్ద సమస్యగా మారింది. ప్రాథమీక సౌకర్యాల మెరుగుకు నేటి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. దీనికోసం గత నాలుగేళ్లలో రూ. 5,886 కోట్లు కేటాయించింది. ఈ ప్రాంతాన్ని మిగతా దేశంతో అనుసంధానం చేయడానికి రోడ్ సేవలకోసం రెండు లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. పౌర విమాన సేవలకోసం 2014-19 సంవత్సరాలకు రూ. 1,014 కోట్లను కేటాయించింది. దీనితో ఈశాన్య ప్రాంతానికి కేవలం మిగిలిన దేశంతోనే కాదు, పొరుగున ఉన్న భూటాన్, మ్యాన్మార్, బంగ్లాదేశ్‌లతో కూడా అనుసంధానం పెరుగుతుంది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రాజెక్టులకు రూ. 1,292 కోట్లు కేటాయించారు. అదనంగా మరో రూ. 234 కోట్లను సౌర విద్యుత్ ఉత్పత్తికి కేటాయించారు.

సరైన విద్యా సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లేకపోవడంతో ఈ ప్రాంతపు యువత చాలా శాతం నిర్వీర్యమైపోతున్నది. ఇతర ప్రాంతాలకు వచ్చి చదువుకోడానికి అధిక శాతం మందికి తగిన ఆర్థిక స్తోమత లేకపోతున్నది. ఇందుకోసం ప్రభుత్వం అస్సాం జీవనోపాధి ప్రణాళిక, మేఘాలయ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రం మొదలైన నూతన అవకాశాలను వీరికి అందించింది. ఇక మహిళల విషయానికి వస్తే, తగినంత ఆర్థిక మద్దతుతో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయడం, మెరక ప్రాంతాలలో సహజ వనరుల అభివృద్ధికి స్థానిక ప్రజలతోనే బృందాలను ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనం కలిగించింది. ఇలాంటి చర్యలవల్ల, ఈశాన్య ప్రాంతం త్వరలోనే మిగిలిన జాతీయ జనజీవన స్రవంతిలో కలిసిపోతుందని ఆశిద్దాం.

■

ఉపాధి అవకాశాలు

# ఈశాన్య రాష్ట్రాలు - సమ్మిళిత అభివృద్ధి, సవాళ్లు

- సి.కె. దాస్



ఈ ప్రాంతంలో దాదాపు 220 జాతులు, 180 భాషలు ఉన్నాయి. వీటికి భారత్‌కు చెందిన ప్రధాన భూభాగంలో ఉన్న భాష, గిరిజన, మత, కుల, సాంస్కృతిక తీరుతెన్నులకు పోలికే ఉండదు. ఇక్కడ సమాజాల్లో వర్గీకరణ కులాలవారీగా కాకుండా జాతులు, తెగల ఆధారంగా ఉంటుంది. ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో చాలా ప్రాంతాలు సర్వేలకు నోచుకోలేదు. అంటే నేటికీ చాలావరకూ అధీకృతమైన భూరికార్డులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఇక్కడి సంస్కృతులు, భూములు, తెగల హక్కులకు భారత రాజ్యాంగంలోని 6 షెడ్యూల్, 371ఏ అధికరణ రక్షణ కల్పిస్తున్నాయి.

దేశంలోని ఈశాన్య దిక్కున ఉన్న రాష్ట్రాలను ఈశాన్య భారత్‌గా పిలుస్తున్నారు. ఇందులో మొత్తం ఎనిమిది రాష్ట్రాలు ఉన్నాయి. అవి అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర. భౌగోళికంగా ఈ ప్రాంతం మొత్తం 2,62,179 చదరపు కిలోమీటర్ల వైశాల్యాన్ని కలిగిఉంది. ఈ మొత్తం ప్రాంతాన్ని దేశంలోని అతి పెద్ద రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలతో పోల్చినప్పుడు అంతకన్నా తక్కువగానే ఉంటుంది. దేశానికి ఈశాన్య దిక్కున ఈ రాష్ట్రాలు భౌగోళికంగా అటు హిమాలయాల కింద ఉన్న దట్టమైన అడవులు, అలాగే పర్వత ప్రాంతాలతో కూడి సంక్లిష్టమైన వాతావరణాన్ని కలిగిఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత అధికమైన వర్షపాతం కలిగిన ప్రాంతాలతో పాటు పలు భౌగోళిక విశిష్టతలు ఈ ప్రాంతం సొంతం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన భారత ఉపఖండానికి, ఈశాన్య రాష్ట్రాలు అత్యంత తక్కువ విస్తీర్ణం కలిగిన ఒక సన్నని కారిడార్ ద్వారా అనుసంధానించబడి ఉంది. దీన్ని వాడుక భాషలో చికెన్ నెక్ అంటారు. సిలిగురి ప్రాంతం ద్వారా దేశ ప్రధాన భూభాగంతో ఈశాన్య రాష్ట్రాలు రాకపోకలు సాగించడం విశేషం. ఈశాన్య రాష్ట్రాలు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాంతాలు. ఈ ప్రాంతం మొత్తం ఐదు దేశాలతో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోంది. బంగ్లాదేశ్, భూటాన్, చైనా, నేపాల్, మయన్మార్ దేశాలు ఈశాన్య రాష్ట్రాలకు సరిహద్దులుగా ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో కేవలం 30 నుంచి 35 శాతం మాత్రమే మైదాన ప్రాంతం ఉండగా, మిగితా ప్రాంతాలన్ని లోయ ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో ప్రధానమైనవి బ్రహ్మపుత్ర, బరాక్, ఇంఫాల్ లోయ ప్రాంతాలు. ఇవన్నీ కూడా కొండప్రాంతాలు కావడం విశేషం. ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో చాలా ప్రాంతాలు సర్వేలకు నోచుకోలేదు. అంటే నేటికీ చాలావరకూ అధీకృతమైన భూరికార్డులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు.

ఈ ప్రాంతంలో దాదాపు 220 జాతులు, 180 భాషలు ఉన్నాయి. వీటికి భారత్‌కు చెందిన ప్రధాన భూభాగంలో ఉన్న భాష, గిరిజన, మత, కుల, సాంస్కృతిక తీరుతెన్నులకు పోలికే ఉండదు. కొండలు, అడవులు వంటి విభిన్న భౌగోళిక ప్రదేశాల్లో ఈశాన్య భారత తెగలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రాంత భాషలు టిబెటో-జర్మన్ కుటుంబానికి చెందినవి. ఇక్కడ సమాజాల్లో వర్గీకరణ కులాలవారీగా కాకుండా జాతులు, తెగల ఆధారంగా ఉంటుంది.

సభ్యులు, ఈశాన్య మండలి, షిల్లాంగ్.
E-mail: ckdas09@gmail.com

ఈశాన్య భారత రాష్ట్రాల్లోని ప్రత్యేకతల దృష్ట్యా.. ఆ ప్రాంతానికే పరిమితయ్యే ప్రత్యేక చట్టాలు, సంస్థలను కేంద్ర సిద్ధం చేసింది. ఇక్కడి సంస్కృతులు, భూములు, తెగల హక్కులకు భారత రాజ్యాంగంలోని 6 షెడ్యూల్, 371ఏ అధికరణ రక్షణ కల్పిస్తున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి 'ఈశాన్య మండలి చట్టం-1971'ని కేంద్రం తీసుకొచ్చింది. ఆర్థికాభివృద్ధికి నోడల్ సంస్థ, ప్రత్యేక సెక్రటేరియట్ ఏర్పాటయ్యాయి. 2001లో వాజ్‌పేయి హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి. కేంద్రంలో ఒక మంత్రిత్వశాఖ ఏర్పాటైంది.

గత కొద్ది దశాబ్దాలుగా ఈ ప్రాంతం జనాభాలో పలు మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. 1901లో భారత దేశ జనాభా 29 కోట్లు కాగా, అదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల జనాభా కేవలం 44లక్షలు. అదే ఈశాన్య రాష్ట్రాలు ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా 4.5 కోట్లకు చేరింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 1901 నుంచి 2011 వరకూ భారత్ దేశ జనాభా 5.4 రెట్లు వృద్ధి చెందగా, అదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల జనాభా 10 రెట్లు వృద్ధి చెందడం గమనార్హం. దీనికి కారణం ప్రధానంగా వలసలు అని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సగటున భూ పంపిణీ చేస్తే కేవలం ఒక హెక్టారు మాత్రమే లభ్యమయ్యే పరిస్థితులు వచ్చాయి.

బ్రహ్మపుత్రా నది పరీవాహిక ప్రాంతాన్ని ఈశాన్య రాష్ట్రాలకు అసలైన అస్తిత్వంగా భావించవచ్చు. ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ఈ పరీవాహక ప్రాంతం ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రధాన భూభాగాలను కలుపుతుంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం సగటు సాలీనా 2500 మిల్లీ మీటర్లు కావడం గమనార్హం. బ్రహ్మపుత్ర నదిలోని నీటి సాంద్రత, సామర్థ్యం కన్నా అది ప్రవహించే నదీ లోయ సామర్థ్యం చాలా చిన్నది. ఫలితంగా ఎక్కువగా వరదలు, కొండచరియలు విరిగిపడటం, నేల క్షయం జరగడం సహజ పరిణామంగా భావించవచ్చు.

1950లో అస్సాం, టిబెట్ ప్రాంతంలో రిక్టార్ స్కేల్‌పై 8.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని కారణంగా సుమారు 780 మంది మరణించారు. అంతేకాదు అస్సాంలో వరదల కారణంగా ఇప్పటి వరకూ సుమారు 5 నుంచి 6 వేల చదరపు కిలోమీటర్ల నేల నదీజలాల ప్రవాహంలో కోసుకుపోయింది. ఫలితంగా లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. ఈ ప్రకృతి వైపత్యాల వల్ల ఈశాన్య ప్రాంతంలో తరచూ ప్రాణ, ఆస్తి నష్టాలు విపరీతంగా సంభవిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతంలో విపత్తు నివారణ సంస్థలు ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి.

ఈశాన్య రాష్ట్రాలను పట్టిపీడిస్తున్న మరో సమస్య అక్రమవలసలు అని చెప్పవచ్చు. వీటి ఫలితంగా ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి పరంగా వెనుకబాటుకు గురవుతున్నాయి. దేశ విభజన జరిగిన 1947 సంవత్సరం నుంచి నేటి వరకూ జరిగిన కొన్ని ప్రధాన ఘట్టాలను బేరీజు వేసుకుంటే ఈశాన్య రాష్ట్రాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రభావితం అయ్యాయనే చెప్పుకోవచ్చు. దీని ఫలితంగా కీలక రంగాల్లో ఈశాన్య రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయి.

### 1) దేశ విభజన

దేశ విభజన కారణంగా తూర్పు బెంగాల్ ప్రాంతం పాకిస్తాన్‌లో కలిసిపోయింది. ఫలితంగా ఈశాన్య రాష్ట్రాలతో రవాణా సౌకర్యాలపై ప్రత్యక్ష ప్రభావం పడింది. ఇది ఈశాన్య రాష్ట్రాల ఆర్థిక పురోభివృద్ధి కుంటుపడేందుకు కారణంగా భావించవచ్చు.

### 2) 1962 చైనా దురాక్రమణ

భారత్ చైనా యుద్ధం సందర్భంగా చైనా దురాక్రమణ ఈశాన్య ప్రాంతాల్లో కల్లోలం సృష్టించింది. చైనా సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లోకి అక్రమంగా చొరబాటు చేసింది. ఫలితంగా ఈ ప్రాంతంలో పెట్టుబడులు ఆకర్షణకు ఈ దురాక్రమణ అడ్డంకిగా మారింది.

### 3) 1971 బంగ్లాదేశ్ అవతరణ

బంగ్లాదేశ్ అవతరణ సందర్భంగా తలెత్తిన యుద్ధం సందర్భంగా కోట్లాది మంది బంగ్లాదేశీయులు ఈశాన్య రాష్ట్రాల్లోకి కాందిశీకులుగా వచ్చి స్థిరపడ్డారు. ఇది ఒక పెద్ద సమస్యగా పరిణమించింది. ఈశాన్య భారతంలో అశాంతి నెలకొనడానికి బంగ్లాదేశ్ నుంచి కొనసాగుతున్న అక్రమ వలసలు కూడా కారణంగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా అస్సాం, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో ఈ వలసలు అధికంగా ఉన్నాయి.

బంగ్లాదేశ్‌తో 4,096 కిలోమీటర్ల సరిహద్దును భారత్ పంచుకుంటోంది. ఇది ప్రపంచంలోని అయిదో అతిపెద్ద అంతర్జాతీయ సరిహద్దు. అత్యధికంగా బంగ్లాదేశ్‌తో 856 కిలోమీటర్ల సరిహద్దుగల త్రిపుర, 443 కిలోమీటర్ల సరిహద్దుగల మేఘాలయ, 18 కిలోమీటర్ల సరిహద్దుగల మిజోరాం, 2,217 కిలోమీటర్ల సరిహద్దుగల పశ్చిమ బంగ రాష్ట్రాల్లో పెద్దగా ఇబ్బందులు లేవు. కానీ 263 కిలోమీటర్ల సరిహద్దుగల అసోం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. **గత 70 ఏళ్లలో అస్సాం జనాభా 30 లక్షల 29 వేల నుంచి కోటి 46 లక్షలకు చేరుకున్నది. అంటే జనాభా పెరుగుదల రేటు 343.77 శాతం. ఇది సగటు భారతదేశ జనాభా పెరుగుదల రేటు 150 శాతం కన్నా ఎంత ఎక్కువగా ఉన్నదో తెలుస్తూనే ఉన్నది. అంటే ఇక్కడ జననాల రేటు ఎక్కువగా ఉన్నదా అంటే అదీ లేదు.**

అంతేకాదు ఈశాన్య రాష్ట్రాల్లోని భిన్న జాతులు, తెగలు, భాషలు 'ప్రత్యేక' ఉద్యమాలకు, వేర్పాటువాదాలకు, తీవ్రవాదానికి కేంద్ర బిందువుగా మారాయి. తెగలవారీగా జాతీయ వాదం పెరగడంతో దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతోంది. ప్రత్యేక రాష్ట్రాలు, ప్రత్యేక జాతీయత, ఎస్టీలుగా గుర్తింపు కోసం జరుగుతున్న ఉద్యమాలు రక్తసిక్తమయ్యాయి. వెలుపలి నుంచి వచ్చిన వారితోపాటు కొన్ని సందర్భాల్లో ఈ ప్రాంతంలోనే ఇతర రాష్ట్రాల

నుంచి, ఇతర తెగల నుంచి సమస్యలు పెరిగాయి. **మొత్తం మీద ఈ ప్రాంతంలో 40కిపైగా వేర్పాటువాద ఉద్యమాలు ఉన్నాయి. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ తీవ్రస్థాయిలో ఉన్న పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అవినీతి వంటివి వీటికి ఆజ్యం పోస్తున్నాయి.**

ఈశాన్య రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఇతర ప్రధాన సమస్యల విషయానికి వస్తే..,

1) అతి తక్కువ వ్యవసాయోత్పత్తి అంటే హెక్టారుకు కేవలం 2 టన్నుల ధాన్య ఉత్పత్తి (వరి) ఈ ప్రాంత ప్రధాన ఆహారం
2) తక్కువ పంటల సాంద్రత
3) వ్యవసాయ విస్తీర్ణం పెరగకపోవడం
4) వ్యవసాయ విప్లవం ఫలాలు అందక పోవడం, నేటికీ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించడం
5) రుణసదుపాయం తక్కువగా ఉండటం. (నేటికీ ఈ ప్రాంతాల్లో క్రెడిట్, డెబిట్ నిష్పత్తి 50శాతం కన్నా తక్కువగా ఉంది.)
6) ఆధునిక వ్యవసాయ పద్ధతులు అందు బాటులోకి లేకపోవడం, విత్తనాలు, ఎరువుల కొరత, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులే అమలులో ఉండడం.
7) గోడౌన్లు, వేర్ హౌస్‌లు, శీతల గిడ్డంగుల కొరత
8) ఆధునిక మార్కెట్ల కొరత
9) జాతీయ సగటు విద్యుత్ వినియోగం కన్నా తక్కువ విద్యుత్ వినియోగం
10) వ్యవసాయానికి అత్యల్పంగా విద్యుత్ వినియోగం
11) పారిశ్రామికంగా ఉపయోగపడే ఇనుము, అల్యూమినియం, రాగి, జింక్, టిన్, లెడ్, నికెల్ లాంటి ఖనిజాలు స్థానికంగా లభ్యం కాకపోవడం, మైకా, సల్ఫర్ లాంటి పదార్థాలు లభ్యం కాకపోవడం
12) మంచి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి లేకపోవడం, ఈ ప్రాంతాల్లో లభించే బొగ్గులో ఎక్కువగా శాతం సల్ఫర్ ఉంటుంది. ఇది పారిశ్రామికంగా అంతగా ఉపయోగపడదు.
13) ఉన్నత విద్య, అలాగే వృత్తి, నైపుణ్య విద్య (పాలిటెక్నిక్) కళాశాలలు లేకపోవడం, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్ లాంటి కోర్సులు చాలా తక్కువగా అందుబాటులో ఉన్నాయి.
14) ఉపాధ్యాయ ట్రైనింగ్ అందుబాటులో లేకపోవడంతో పాటు, మౌలిక వసతుల లోపం కారణంగా విద్య వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. ముఖ్యంగా గణితం, సైన్స్ పాఠ్యాంశాలు బోధించేందుకు ఉపాధ్యాయులకు మరింత తర్ఫీదు అవసరం.
15) భారీ పరిశ్రమల కొరత, నాలుగు ఆయిల్ రిఫైనరీలు, రెండు పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లు తప్ప ఈ రాష్ట్రాల్లో పెద్దగా చెప్పుకోదగిన పరిశ్రమలేవీ లేవు.

అయితే అస్సాంలోనూ ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో గత శతాబ్దం నుంచే రైల్వే లైన్లు, టీ తోటలు, ఆయిల్, రైస్ మిల్లులు వంటివి విస్తృతంగా ఉన్న చరిత్ర ఉంది. అయితే తూర్పు బెంగాల్ విభజన ఈ ప్రాంత అభివృద్ధికి శరాఘాతంగా మారింది. తూర్పు తీరంలోని చిట్టగాంగ్ లాంటి పట్టణాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. అయితే దేశ విభజన అనంతరం ఆ ప్రాంతాలు బంగ్లాదేశ్‌కు బదిలీ అయ్యాయి. దీంతో రవాణా పరంగా దేశ ప్రధాన భూభాగాలతో కలవడం పెద్ద అడ్డంకిగా మారింది. ఉదాహరణకు త్రిపుర రాజధాని అగర్తలా నుంచి కోల్ కతాకు భారత భూభాగాల (చికెన్ నెక్) ద్వారా చేరుకోవాలంటే సుమారు 1500 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అదే బంగ్లాదేశ్ గుండా వెళ్లినట్లయితే కేవలం 400 కిలోమీటర్లు మాత్రమే దూరం ప్రయాణిస్తే అగర్తలా చేరుకోవచ్చు. ఇలాంటి ఇబ్బందుల కారణంగా ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి కుంటుపడుతోంది. అయితే గత కొద్ది సంవత్సరాల్లోనే ఈశాన్య రాష్ట్రాల్లో రవాణా పరంగానూ, మౌలిక వసతుల పరంగానూ వృద్ధి జరిగింది. ముఖ్యంగా రోడ్, రైల్, ఎయిర్ రవాణాల్లో పురోభివృద్ధి సాధ్యమైంది. అంతేకాదు ఐఐఎం, ఐఐటీ లాంటి ప్రతిష్ఠాత్మక విద్యాలయాలు సైతం ఈ ప్రాంతాల్లో విద్యను అందిస్తున్నాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పడ్డాయి.

ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యత విషయంలో జాతీయ సగటు కన్నా కాస్త ఎక్కువగా ఉండటం గమనార్హం. జాతీయ అక్షరాస్యత సగటు 74.04 శాతంగా ఉంటే ఈశాన్య రాష్ట్రాల్లో అక్షరాస్యత 74.48శాతంగా ఉంది.

ఈశాన్య రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందేందుకు పలు రంగాల్లో మరింత పురోభివృద్ధి సాధించాల్సి ఉంది. అవేంటో ఇప్పుడు చూద్దాం.

అ) వ్యవసాయం, హార్టికల్చర్, ఉద్యాన పంటల సాగులో వృద్ధి
ఆ) పాల ఉత్పత్తి
ఇ) ఉన్ని ఉత్పత్తి, సేకరణ
ఈ) పందుల పెంపకం
ఉ) కోళ్ల పెంపకం
ఊ) బాతుల పెంపకం
ఎ) చేపల పెంపకం
ఏ) ఆహారం, మాంస ఉత్పత్తుల ప్రాసెసింగ్
ఐ) పర్యాటకాభివృద్ధి
ఒ) పట్టు పురుగుల పెంపకం, పట్టు ఉత్పత్తి పరిశ్రమలు, చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి
ఓ) ఆర్గానిక్ టీ, సేంద్రీయ పంటలు, పుట్టగొడుగులు, తేనే ఉత్పత్తులు తయారీ అలాగే ప్లాస్టిక్ ఉత్పత్తులను తయారు చేయడం. ఇప్పటికే డిబ్రుగఢ్‌లో తక్కువ సాంద్రత కలిగిన పాలిఇథైలిన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

స్థానికంగా ఉన్న వనరులతో పాటు ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాంతాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో పయనించే అవకాశం ఉంది. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈశాన్య రాష్ట్రాలకు ప్రకృతి

అందించిన వరం వెదురు అనే చెప్పుకోవచ్చు. వెదురు సంబంధిత వస్తువులు, అలాగే జనపనార వంటి పదార్థాలతో చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చు. అంతేకాదు ఔషధ మొక్కల పెంపకం కూడా చక్కటి ఆదాయవనరుగా మారుతోంది. ఇంకా స్థానికంగా లభించే అల్లం, పసుపు వంటి పంటలకు ప్యాకేజింగ్ సదుపాయాలు కల్పిస్తే మంచి మార్కెట్ లభించే వీలుంది.

అలాగే స్థానికంగా నదులు, ఇతర ప్రవాహాల్లో ఎక్కువ శాతం నీరు ఉధృతంగా ప్రవహిస్తూనే ఉంటుంది. వీటిని ఆధారంగా చేసుకొని పలు జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేసుకోవడం ద్వారా కూడా పారిశ్రామికంగా విద్యుత్ అవసరాలను తీర్చుకోవచ్చు. అలాగే వస్త్ర పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమలు, పేపర్, చక్కెర పరిశ్రమలను విరివిగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈశాన్య భారతంలో చిత్తడి నేలలు అధికం. ఈ తరహా నేలలో వెదురు, చెరుకు పంటలను విరివిగా పండించవచ్చు. అంతేకాదు సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేయడం ద్వారా కూడా ఆదాయవనరులు ఏర్పడతాయి.

కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ప్రాంతంలో యువతలో నెలకొన్న నైరాశ్యాన్ని దూరం చేసేందుకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా రైల్వేలు, ప్రభుత్వ బ్యాంకులు, కేంద్ర పారామిలటరీ బలగాలు, ఎయిర్ లైన్స్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ఈశాన్య రాష్ట్రాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అప్పుడు యువత వేర్పాటు వాదం వదిలి ఉపాధి మార్గం బాటపడుతుంది.

కేంద్రప్రభుత్వం సైతం ఈ మధ్య కాలంలోనే పలు ప్రత్యేకమైన పాలసీలతో ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ఈశాన్య రాష్టాల అభివృద్ధి వేగవంతం చేసేందుకు, భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానం తోడ్పడే అవకాశం ఉంది. భారత్‌కు తూర్పున ఉన్న దేశాలతో.. ప్రత్యేకించి ఆసియాన్ దేశాల ప్రజలతో ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు సత్సంబంధాలు పెరగాలని ఇప్పటికే ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆసియన్ దేశాలతో వ్యాపార, సాంస్కృతిక, ఇతరత్రా సంబంధాలు మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఈశాన్య రాష్ట్రాలలోని వనరులను పూర్తిగా ఉపయోగంలోకి తేవడం, మయన్మార్ మొదలుకొని తూర్పు ఆసియా దేశాలతో వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం లక్ష్యంగా కొన్నేండ్లుగా ఈ ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణంపై కేంద్రం ఆసక్తి చూపిస్తున్నది. యాక్ట్ ఈస్ట్ పాలసీలో పురోగతి సాధిస్తే ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి బాటపట్టడం సాధ్యమనే చెప్పవచ్చు.

ఇటీవలే జాతీయ వెదురు మిషన్ కింద బడ్జెట్‌లో రూ. 1300 కోట్లు కేటాయించారు, ఇది ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు, ప్రత్యేకించి రైతులకు ప్రయోజనకారిగా ఉంటుంది. అంతేకాదు మయాన్మార్ గుండా ఆసియా రహదారి మార్గాలు పూర్తయితే, ఈశాన్యంలో పరిశ్రమలకు ఆసియా వ్యాప్త మార్కెట్ లభిస్తుంది. ఈశాన్య ప్రాంత అభివృద్ధితో పాటే అక్కడి ప్రజలు మానసికంగా దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలతో కలిసిపోయే చర్యలు తీసుకోవాలి. ఈశాన్య రాష్ట్రాలలో అక్షరాస్యత ఎక్కువ. మిజోరం, త్రిపుర, నాగాలాండ్ తదితర రాష్ట్రాలలో కూడా ప్రజలు అక్షరాస్యులు కావడమే కాకుండా, ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యం కలిగి ఉన్నారు. ఈ మానవ వనరులను ఉపయోగించుకోవడంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దీన్ని అవకాశంగా మలుచుకొని బీపీఓ వంటి రంగాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. దేశంలోని మిగతా ప్రాంతాలకు వీరి నైపుణ్యం ఉపయోగపడుతుంది. ఇదేవిధంగా ఈ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టడానికి ప్రకృతి వనరులతో పాటు అక్షరాస్యత అనుకూలాంశం.

అన్ని రంగాల్లో అభివృద్ధి, అలాగే యువతకు ఉపాధి, అందరికీ అవకాశాలు, వనరులను సక్రమంగా వినియోగించడం ద్వారా ఈశాన్య రాష్ట్రాలలో సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడంతో పాటు సవాళ్లను కూడా అధిగమించవచ్చు. అప్పుడే దేశంలోని అన్ని ప్రాంతాల సర్వతో ముఖాభివృద్ధికి దోహద పడుతుంది. ■

## యోజన చందాదారులకు సూచన:

పోస్టులో పంపిన యోజన మాసపత్రిక అందడంలేదని పలువురు చందా దారులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరందరికీ మనవి ఏమంటే, ప్రతినెలా రెండు, మూడు తారీకులలో ఠంచనుగా కాపీలను పోస్టు చేస్తాము. అయితే, ప్రతులు ఆర్డినరీ పోస్టులో వెళతాయి కనుక, ఒక్కొక్క సారి అందకపోయే అవకాశముంది. దీనికి యోజన బాధ్యతవహించదు. నెలకు ఒక ప్రతి అందకపోతే మరొకటి, మరొకటి పంపడానికి పాలనాపరమైన ఆటంకాలున్నాయి. ఒకవేళ రిజిష్టర్ పోస్టులో కావాలంటే, మామూలు ప్రతి ఒక్కింటికి రూ. 52/- లు, ప్రత్యేక సంచికకు రూ. 57/- లు చందాదారులు అదనంగా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. గమనించగలరు.

*- సీనియర్ ఎడిటర్*

# ఈశాన్య రాష్ట్రాలు - ఆర్థిక విశ్లేషణ

- మంజుల వాధ్వా



**దేశ అక్షరాస్యతలో త్రిపుర, మిజోరాం అత్యున్నత పురోగతి సాధించగా, తేయాకు ఉత్పత్తిలో చైనా తరువాతి స్థానం అస్సాందే కావడం విశేషం. అదే రాష్ట్రంలో డిగ్బోయ్‌లో ఉన్న చమురు నిల్వలు ఆసియాలోనే మొదటివి కావడం మరో విశేషం. ఇక ఇండియా స్పెండ్ రీసెర్చ్ రిపోర్టు ప్రకారం మధ్యప్రదేశ్ కన్నా మేఘాలయ వృద్ధి రేటు అధికం కావడం గమనించాలి. అభివృద్ధికి ప్రతీకగా చెప్పుకునే గుజరాత్ కన్నా అరుణాచల్ ప్రదేశ్ చాలా వేగంగా ప్రగతి సాధించింది. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. అన్ని ఈశాన్య రాష్ట్రాల్లోని పేదల కన్నా ఒక్క కర్ణాటకలో నమోదైన పేదల సంఖ్యే ఎక్కువ.**

భారతదేశ సమగ్ర స్వరూపంలో ఈశాన్య రాష్ట్రాలకు ఓ ప్రత్యేకమైన స్థానమున్నది. సెవన్ సిస్టర్స్‌గా ముద్దుగా పిలుచుకునే ఆ ఏడు ఈశాన్య రాష్ట్రాలతో పాటు వాటి పక్కనే విసిరేసినట్టుగా ఉండే సిక్కింను కూడా కలుపుకొని ఎనిమిది రాష్ట్రాలకు అనేక అంశాల్లో సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, భౌగోళిక, చారిత్రక అంశాల్లో ప్రత్యేకమైన స్థానముంది. దేశ అక్షరాస్యతలో త్రిపుర, మిజోరాం అత్యున్నత పురోగతి సాధించగా తేయాకు ఉత్పత్తిలో చైనా తరువాతి స్థానం అస్సాందే కావడం విశేషం. అదే రాష్ట్రంలో డిగ్బోయ్‌లో ఉన్న చమురు నిల్వలు ఆసియాలోనే మొదటివి కావడం మరో విశేషం. ఇక ఇండియా స్పెండ్ రీసెర్చ్ రిపోర్టు ప్రకారం మధ్యప్రదేశ్ కన్నా మేఘాలయ వృద్ధి రేటు అధికం కావడం గమనించాలి. మధ్యప్రదేశ్ ప్రస్తుత వృద్ధిరేటు 9.5 శాతం ఉంటే మేఘాలయ వృద్ధి రేటు 9.7 గా నమోదైంది. అభివృద్ధికి ప్రతీకగా చెప్పుకునే గుజరాత్ కన్నా అరుణాచల్ ప్రదేశ్ చాలా వేగంగా ప్రగతి సాధించింది. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. అన్ని ఈశాన్య రాష్ట్రాల్లోని పేదల కన్నా ఒక్క కర్ణాటకలో నమోదైన పేదల సంఖ్యే ఎక్కువ. కర్ణాటకలో దారిద్ర్య రేఖకు దిగువన 12.9 మిలియన్ ప్రజలు ఉంటే ఆ సంఖ్య అన్ని ఈశాన్య రాష్ట్రాల్లో కలిపి 12.8గా ఉంది. దానికి భిన్నంగా త్రిపురలో అత్యధిక నిరుద్యోగిత నమోదవడం మరో పార్శ్వం. 2011-12 లెక్కల ప్రకారం త్రిపుర పట్టణ ప్రాంతాల్లో 25.2 శాతం నిరుద్యోగులుండగా 23.8 శాతంతో ఆ తరువాతి స్థానం నాగాలాండ్ ఆక్రమిస్తోంది. ఇక పారిశ్రామికంగా ఈ 8 రాష్ట్రాలు మంచి పురోగతిని సాధించగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు మాత్రం క్షీణించాయి. జాతీయ స్థాయిలో నమోదవుతున్నట్టుగానే ఈశాన్య రాష్ట్రాల్లో కూడా గ్రామ ప్రాంతాల్లోని నిరుద్యోగుల కన్నా పట్టణాల్లో నిరుద్యోగుల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఇక పేదరికం చాలా అసమతుల్యంగా ఉండడం మరో అంశం. **మణిపూర్‌లో అత్యధిక పేదరికం నమోదైతే సిక్కిం అత్యధిక ధనిక రాష్ట్రంగా నిలుస్తోంది.**

బ్రిటిష్ పాలకుల కాలం నుంచే ఈశాన్య ప్రాంతం ఆర్థికాభివృద్ధి చాలా అసమతుల్యంగా ఉంది. ఇక్కడి ఖనిజ నిక్షేపాలను వారు ఆర్థిక వనరులుగా చూశారే తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. బొగ్గు, చమురు, అడవులు, తేయాకు వంటి వాటిని విపరీతంగా వెలికితీసి ఎగుమతులు చేయడం మీద దృష్టి పెట్టారే తప్ప ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం, రవాణా సదుపాయాలు కల్పించడం వంటి కీలకమైన అంశాలను నిర్లక్ష్యం చేశారు. మరోవైపు

అసిస్టెంట్ జనరల్ మేనేజర్, నాబార్డ్, చండీగఢ్.
E-mail : manjula.jaipur@gmail.com

దేశ విభజన కారణంగా ఏర్పడ్డ బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్తాన్)తో వాణిజ్యం నిలిచిపోవడం ఈ ప్రాంత ఆర్థిక వృద్ధిని విపరీతంగా దెబ్బతీసింది. దీనివల్ల మిగిలిన దేశానికి ఈశాన్య ప్రాంతానికి మధ్య హెచ్చు తగ్గులు బాగా పెరిగిపోయాయి. అయితే ఆ తేడాల్లో ఈ మధ్య మార్పు బాగా కనిపిస్తోంది. **మానవాభివృద్ధి సూచీలో దేశ సగటుకన్నా ఈశాన్య ప్రాంతం ముందుంది.** సగటు లింగ నిష్పత్తిలో మిగతా దేశంకన్నా మెరుగ్గా ఉన్న ఈశాన్య ప్రాంతం ఆర్థిక వృద్ధిలో మాత్రం బాగా వెనుకబడింది.

**ఈశాన్య ప్రాంతం వెనుకబాటుకు మరికొన్ని కారణాల్ని ఇలా పేర్కొనవచ్చు:**

**భౌగోళిక పరిస్థితులు:**

ఈశాన్య రాష్ట్రాల్లోని 70 శాతం కొండప్రాంతాల్లో 30 శాతం జనాభా ఉంటే మిగతా 30 శాతం మైదాన ప్రాంతాల్లోనే 70 శాతం జనాభా కేంద్రీకృతమైంది. ఇలాంటి భౌగోళికమైన పరిస్థితుల కారణంగా దేశమంతటినీ కలిపే రవాణా వ్యవస్థ దారుణంగా ఉండడంతో అభివృద్ధి కుంటుపడింది. అంతేకాదు ఈశాన్యాన ప్రతియేటా బ్రహ్మపుత్ర నదికి, అసోంలోని బరాక్ లోయలో వచ్చే వరదలు కూడా ప్రాంతం వెనుకబాటుకు కారణమయ్యాయి.

**మౌలిక సదుపాయాలు:**

ఈశాన్య ప్రాంతం వెనుకబడటానికి గల కారణాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రధానంగా పేర్కొనవచ్చు. రోడ్డు రవాణా, జల మార్గాలు, విద్యుత్తుతో పాటు అరకొర విద్యాసంస్థలు, వైద్య సదుపాయాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నాయి. 6 శాతం స్థానిక రోడ్లు, 13 శాతం జాతీయ రహదారులు ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తున్నాయి. అయితే నిర్వహణా వైఫల్యాల కారణంగా రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఇలాంటి మౌలిక సదుపాయాల లేమి కారణంగా ఈ ప్రాంతం చాలా వెనుకబడింది.

**పారిశ్రామికాభివృద్ధిలో పరిమితులు :**

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి పెద్దగా కాకపోయినా చెప్పుకోదగిన స్థాయిలోనే అస్సాంలో పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. అయితే అదంతా ప్రధానంగా వలస పెట్టుబడిదారుల చేత జరిగిందేనని గమనించాలి. ఇక జరిగిన ప్రగతి ఏదైనా తేయాకు తోటలు, బొగ్గు, చమురు గనులు, చమురు శుద్ధి కర్మాగారాలు, ప్లైవుడ్‌తో పాటు అటవీ ఉత్పత్తుల మీదే ఆధారపడింది. దేశ విభజన ఇక్కడి పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బ తీసింది. దేశంలోని ఇతర ప్రాంతాలతో ఈశాన్య ప్రాంత పారిశ్రామిక సంబంధాలు తెగిపోవడంతో ఇక్కడి ఆర్థిక స్వరూపం మీద ప్రభావం చూపింది. ఆ విధంగా పెట్టుబడులు ఆకర్షించడంలో అస్సాం లాంటి రాష్ట్రాలు విఫలమయ్యాయి. అయితే ఈ ప్రాంతంలో గల సహజ వనరులే ఇక్కడి పారిశ్రామిక పురోగతికి ఆధారభూతాలయ్యాయి. జాతీయ జలవిద్యుదుత్పత్తి కార్పొరేషన్, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL), చమురు మరియు సహజవాయు కార్పొరేషన్ (ONGC) వంటి సంస్థలు చమురు, సహజవాయు ఇంధనాల్ని వెలికితీస్తూ ఈ ప్రాంత పురోగతికి తోడ్పడుతున్నాయి. ఇక 1995లో చెట్లు కొట్టరాదంటూ సుప్రీంకోర్టు విధించిన నిషేధం కారణంగా అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడ్డ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. దీనికితోడు స్థానికంగా పెట్టుబడులు లేకపోవడం, మార్కెటింగ్, రవాణా సమస్యలు వేధిస్తుండడంతో ఈశాన్య ప్రాంత పారిశ్రామిక ప్రగతి వెనుకబడిపోయింది. ఇక్కడ కేవలం తేయాకు పరిశ్రమకు మాత్రమే చాలా సుదీర్ఘమైన నేపథ్యముంది. 20వ శతాబ్దంలో అస్సాంలో వేళ్లూనుకున్న తేయాకు పరిశ్రమ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకంగా మారింది. అయితే తేయాకు ఇండస్ట్రీలో స్థానిక అస్సామీలకు, అందులో పనిచేసే కూలీలకు మధ్య చాలా ఏళ్లుగా విభేదాలు పెరుగుతున్నాయి. వైద్యం, సంక్షేమం వంటి పథకాల లబ్దిలో ఈ ఇద్దరి మధ్యా అనేక అపోహలున్నాయి.

**వ్యవసాయం:**

ఈ ప్రాంతంలో ఆధునిక వ్యవసాయం పాత్ర చాలా తక్కువ. అందుకే వ్యవసాయ రంగంలో అభివృద్ధి అసమతుల్యంగా ఉంది. ఈ అసమతుల్యత ఇక్కడి పంటల్లో కూడా కనిపిస్తూ ఉంటుంది. ఖరీఫ్ లో వరి, రబీ సీజన్లో గోధుమ, బంగాళాదుంప, చెరుకు, పప్పుధాన్యాలు, వేరుశనగ వంటి చమురు గింజలు పండిస్తారు. దేశం మొత్తం మీద చూస్తే ఈశాన్య ప్రాంతం అందించే ఆహార ధాన్యాల ఉత్పత్తి 1.5 శాతం మాత్రమే. కానీ 70 శాతం ప్రజల ఆహార అవసరాలు తీరుస్తుండడం విశేషం. అయితే మిగతా దేశమంతటితో పోలిస్తే ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగం చాలా వెనుకంజలోనే ఉంది. దేశంలో వచ్చిన వ్యవసాయ విప్లవం వాయవ్య ప్రాంతాన ఫలించినంతగా ఈశాన్యాన ఫలించలేదనే చెప్పాలి. నీటిపారుదల సౌకర్యాలు లేకపోవడం, ఎరువులు వాడకపోవడం వల్ల వ్యవసాయ ఉత్పాదకత చాలా తక్కువ నమోదవుతుంది. దీనికితోడు ఇక్కడ ఇప్పటికీ పోడు వ్యవసాయమే నడుస్తుంది. దాదాపు 1.7 మిలియన్ హెక్టార్ల భూమిలో పోడు వ్యవసాయమే జరుగుతూ ఉండడం వల్ల అడవులు తగ్గిపోతూ భూములు క్రమక్షయానికి గురవుతున్నాయి. భూసారం కూడా తగ్గిపోతోంది.

**సహజ వనరుల పాత్ర :**

సారవంతమైన నేలలు, జలవనరులు, వివిధ రకాల పంటతోటలు, సహజ నిక్షేపాలు ఇక్కడ సమృద్ధిగా ఉన్నా వాటిని విచక్షణ రహితంగా వెలికితీయడం, వాటిని దురుపయోగం చేస్తున్న కారణంగా ఈ ప్రాంత అభివృద్ధి మీద తీవ్రమైన దుష్ప్రభావం చూపుతోంది. దీనివల్ల జీవ వైవిధ్యం కూడా ప్రమాదంలో పడింది. బొగ్గు గనులు, ఎరువులు, కాగితం, సిమెంట్ పరిశ్రమల కారణంగా సహజ వనరులు నానాటికీ క్షీణిస్తున్నాయి. దీనికితోడు మిలిటెంట్ కార్యకలాపాలు కూడా ప్రగతి మీద పరోక్ష ప్రభావం చూపుతున్నాయి.

**రవాణా రంగం :**

ఇక్కడి సామాజిక, భౌగోళిక, ఆర్థిక స్థితిగతుల కారణంగా రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగు పడలేదు. ఈ సమస్య ఈ ప్రాంత అభివృద్ధి ముఖచిత్రాన్ని మార్చలేకపోయింది. రవాణా సదుపాయాల కోసం పంచవర్ష ప్రణాళికల్లో కూడా ఇవ్వాల్సినన్ని నిధులు ఇవ్వకపోవడం అభివృద్ధిని కుంటుపడేలా చేసింది. దేశ విభజన వల్ల అన్ని వస్తువుల ధరలు పెరగడం, ఖరీదైన ఆర్థిక వ్యవస్థ దూసుకు రావడమే కాక దేశంలోని మిగతా ప్రాంతానికి ఈశాన్య రాష్ట్రాలు దూరంగా ఉన్నాయన్న భావన కూడా వెనుకబాటుకు మరో కారణం. దేశంలోని రైల్ నెట్ వర్క్ లో ఇక్కడ ఉన్నది కేవలం 4 శాతమే. మరోవైపు ఇప్పటికీ బోంగైగావ్ వంటి ప్రధాన పట్టణాల్ని కలిపే రైల్ నెట్ వర్క్ కూడా మీటర్ గేజ్ లోనే ఉంది. గేజ్ మార్పిడి సమస్యలు దశాబ్దాలుగా తేలకపోవడంతో సిమెంట్, ఉక్కు, ఆహార ధాన్యాలు, ఉప్పు వంటి వివిధ రంగాలకు చెందిన అత్యవసర వస్తువుల సరఫరాలకు అంతరాయం కలుగుతోంది.

ఇక ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) అనేది ఈ ప్రాంత అభివృద్ధికి మరో పెద్ద సమస్యగా మారింది. పాశ్చాత్య దేశాల స్ఫూర్తితో కొనసాగిన ఆర్థిక విధానాలు తూర్పు దిశగా (యాక్ట్ ఈస్ట్ పాలసీ) మళ్లడం ప్రధాన అవరోధంగా మారింది. విధానాల్లో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పు కారణంగా విదేశీ పారిశ్రామికవేత్తలతో, బహుళజాతి కంపెనీలతో ఇక్కడి ఇండస్ట్రీ పోటీ పడలేకపోతోంది. ఈశాన్య రాష్ట్రాల్లోని సమాజం అవ్యవస్థీకృతంగా ఉండడం వల్ల అనేక రకాలుగా నష్టపోయింది. ఉత్పాదక శక్తుల కొరత తీవ్రంగా ఎదుర్కొంటున్న సమాజంలో మానవ సామర్థ్యం చాలా తక్కువగా ఉంటుంది. అది సాంస్కృతిక ఎదుగుదల మీదా ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రజల జీవన వ్యయం ఉత్పాదక శక్తిని మించి ఉండే ఇలాంటి సొసైటీల్లో ఆర్థిక పరిస్థితులు దారుణంగా తయారవుతాయి. అది నైతిక విలువల మీదనే గాక సమాజ విలువల్ని కూడా పతనం చేస్తుంది.

ఈశాన్య రాష్ట్రాల్లో విద్యావ్యవస్థ దారుణంగా విఫలమైంది. ఉన్నతమైన కుటుంబాల తల్లిదండ్రులు వారి పిల్లల్ని చదువుల కోసం దూరప్రాంతాలకు పంపడంతో ఇక్కడి ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసింది. ఈ రకమైన మేధావలసకు కారణమైన నిర్లక్ష్యపూరిత విధానాలపై సమీక్ష జరగాల్సి ఉంది.

ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మరో తీవ్రమైన సమస్య డ్రగ్స్. 30 శాతానికి పైగా యువతరం వివిధ రకాల మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారని ఇక్కడి సామాజికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దానికితోడు మణిపూర్, నాగాలాండ్, మిజోరం వంటి రాష్ట్రాల్లో ఎయిడ్స్ నానాటికీ ప్రబలుతోంది.

అలాంటి దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించి శాశ్వత అభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు 1971లో భారత ప్రభుత్వం ఈశాన్య మండలి (North Easter Council)ని ఏర్పాటు చేసింది. ఈ మండలిలో ఈశాన్యంలోని 8 రాష్ట్రాలు సభ్యులుగా వ్యవహరిస్తాయి. షిల్లాంగ్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ మండలి కార్యకలాపాలు ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (MoDNER) ఆధ్వర్యంలో నడుస్తాయి. తొలుత దీనికో సలహా కమిటీ మాత్రమే ఉండేది. అయితే 2002లో దానికి ప్రాంతీయ ప్లానింగ్ బాడీని కూడా కేటాయించారు. దీంతో ఈ బాడీ ఈశాన్య రాష్ట్రాలకు తక్షణావసరమైన ఏ సమస్య మీదనైనా చర్చించి, పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకునే వీలు ఏర్పడింది. ఈ ప్రాంత ఆర్థిక, సామాజిక సమస్యల మీద చర్చించడమే కాక ఆయా రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాల పరిష్కారానికీ ఇది కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలకు తోడ్పాటు అందించేందుకు ఈశాన్య ప్రాంత అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ లి. (NEDFCL) ఏర్పాటైంది. అలాగే MDoNER పరిధిలో నార్త్ ఈస్టర్న్ రీజినల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (NERAMAC), సిక్కిం మైనింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (SMC), నార్త్ ఈస్టర్న్ హేండ్లూమ్స్ అండ్ హేండి క్రాఫ్ట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (NEHHDC) ఈ ప్రాంత వికాసం కోసం పని చేస్తున్నాయి.

2001లో ఏర్పాటైన ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వానికి నోడల్ విభాగంగా పని చేస్తుంది. ఇక్కడి ఆర్థిక, సామాజిక అంశాల మీద పని చేసేందుకు కేంద్ర, రాష్ట్రాల మధ్య వారధిగా వ్యవహరిస్తుంది. మౌలిక వసతుల కల్పనలో సాధక బాధకాలు తీర్చడానికి కృషి చేస్తుంది. ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించేందుకు అందుకు అవసరమైన శాంతియుత వాతావరణానికి కృషి చేస్తుంది. ఈ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే విద్యుత్తు, రవాణా, కమ్యూనికేషన్, ఆరోగ్యం వంటి రంగాలు ముఖ్యమైనవిగా MDoNER గుర్తించింది.

ఈ ప్రాంతపు విద్యుదుత్పాదక రంగంలో ఈశాన్య మండలి గణనీయంగా కృషి చేసింది. జలవిద్యుత్తు, సహజవాయు విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాట్లు మండలి సాధించిన విజయాలే. విద్యుత్ పంపిణీ వ్యవస్థకు బాటలు పరచడమే గాక ఈశాన్య ప్రాంతాన్ని జాతీయ గ్రిడ్ కు అనుసంధానం చేయడంలో మండలి కీలక పాత్ర పోషించింది. రోడ్డు రవాణా, జలరవాణా అభివృద్ధిలోనూ చొరవ చూపింది. ఈశాన్య మండలి ఏర్పాటైన దశలో ఇక్కడ సాగు భూమి కేవలం 12 శాతంగానే ఉండేది. దీన్ని బట్టి ఇక్కడ డిమాండ్ కు, సప్లయికి మధ్య ఎంత అంతరం ఉందో అర్థం చేసుకోవచ్చు. మేలైన వంగడాల కొరత, వ్యవసాయ రంగంలో వసతులు లేకపోవడం, రవాణా సమస్యల కారణంగా ఎరువులు లభ్యం కాకపోవడం వంటి సమస్యలు ఇక్కడ ఉత్పత్తి మీద ప్రభావం చూపాయి. వీటిని అధిగమించేందుకు మండలి అనేక చర్యలు చేపట్టింది. సభ్యులైన రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి మానవ వనరుల అభివృద్ధి, దాని వాడకంలో క్రియాశీలంగా పని చేసింది. పలు వైద్య సంస్థల్లో విద్యార్థులకు రిజర్వేషన్లు వర్తించేలా కృషి చేసింది. ఈ ప్రాంతంలో ఉండే సహజ వనరుల అన్వేషణ కోసం సర్వేలు

నిర్వహించి పారిశ్రామిక ప్రగతి కోసం నివేదికలు రూపొందించింది. భవిష్యత్ చిత్రపటం కోసం అవసరమైన మార్గదర్శనం చేసింది. మండలి చేసిన ఈ కృషి కారణంగానే ఇక్కడ అనేక చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వాటికి అవసరమైన మార్కెటింగ్ ఏజెన్సీలను కూడా మండలే ఏర్పాటు చేసింది. పారిశ్రామిక ప్రదర్శనలు, సెమినార్లు నిర్వహించడం ద్వారా ఈశాన్య మండలి చురుగ్గా వ్యవహరించింది. అంతేకాదు అస్సాం ఘనతను ప్రతిబింబించే పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఎంతో దోహదపడింది. స్థానికంగా ప్రత్యేకమైన ఈరీ, మూగ రకాల పట్టునే కాక సాధారణ చేనేతను కూడా మండలి ప్రోత్సహించింది. సిక్కింను కలుపుకొని ఈశాన్యం మొత్తంలో టూరిజం అభివృద్ధికి గల అవకాశాలను చక్కగా మెరుగుపరచింది. వాతావరణ, పర్యావరణ సమస్యల పరిష్కారానికి అనేక స్కీములు రూపొందించింది. పోడు పైనే ఆధారపడిన 1700 ఝుమియా కుటుంబాలను ఒప్పించి వేరే చోటికి తరలించడంలో సఫలీకృత మైంది. వాటర్ షెడ్ ప్రోగ్రామ్, వ్యవసాయంలో సంప్రదాయేతర పద్ధతులు, వాణిజ్య కార్యకలాపాల అమలులో మండలి విజయ వంతంగా పని చేసింది.

పైన పేర్కొన్న కార్యక్రమాలకు తోడు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2017లో ఈశాన్య ప్రాంత ప్రత్యేక మౌలిక వసతుల అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టింది. నీటి సరఫరా, విద్యుత్తు, రవాణా, టూరిజం వంటి భౌతిక రంగాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, వైద్యం వంటి సామాజిక రంగాల్లో కూడా వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంది. ఈ పథకంలో గొప్పతనం ఏమిటంటే వంద శాతం నిధులు కేంద్రమే విడుదల చేస్తుంది. వచ్చే 3 ఏళ్లలో ఇక్కడ ఖర్చు చేసేందుకు రూ. 5300 కోట్లను కేంద్రం సమకూరుస్తుంది. ఈ క్రమంలోనే మిజోరంలో తురియల్ హైడ్రో పవర్ ప్రాజెక్టును కేంద్రం ఏర్పాటు చేయబోతోంది. అది పని చేయడం ప్రారంభిస్తే ఏటా 251 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లో సిక్కిం, త్రిపుర తరువాత మిగులు విద్యుత్ రాష్ట్రంగా మిజోరం నిలుస్తుందనడంలో సందేహం ఉండ నక్కర లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పటివరకు 90:10 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్రాలు ఖర్చు చేస్తుండగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే వంద శాతం నిధులు అందించడం ఆ ప్రాంతం మీద కనబరుస్తున్న శ్రద్ధకు తార్కాణం. గత మూడేళ్లలో కేంద్రం 3800 కి.మీ. నేషనల్ హైవేల నిర్మాణం కోసం రూ. 3200 కేటాయించింది. అందులో ఇప్పటికే 1200 కి.మీ. రోడ్డు నిర్మాణం పూర్తవడం విశేషం.

ఈశాన్య రాష్ట్రాల్లోని అన్ని ముఖ్య పట్టణాలు రైల్వే మ్యాప్‌లో కనిపించేలా రోడ్డు మార్గాల అభివృద్ధి మీద ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం రూ. 60 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. దానికి తోడు ఈ ప్రాంతంలో హైవేలు, రోడ్ నెట్‌వర్క్ పెంచేందుకు భారత్ మాలా పేరుతో వచ్చే రెండు, మూడేళ్లలో మరో రూ. 30 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయిం చింది. 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' స్ఫూర్తితో కళాదాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్ పోర్ట్ ప్రాజెక్ట్, రీ-టేడిమ్ రోడ్ ప్రాజెక్ట్ అండ్ బోర్డర్ హాట్స్ వంటి భారీ ప్రాజెక్టులకు కేంద్రం శ్రీకారం చుట్టింది. మరోవైపు మిజోరంలో ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజంలను ప్రోత్సహించే ప్రాజెక్టులు చేపట్టింది. గత రెండేళ్లలో రూ. 194 కోట్లు కేటాయిస్తే ఇప్పటికే రూ. 115 కోట్లు విడుదలవడం విశేషం. ఈశాన్యాన లక్షలాది ప్రజలకు జీవనాధారమైన వెదురు మీద కేంద్రం ఆంక్షలు సడలించింది. ఇప్పుడు వెదురు పంట వేయాలన్నా, రవాణా చేయాలన్నా, దాని ఉత్పత్తులు అమ్మాలన్నా ఎలాంటి పర్మిట్లూ అవసరం లేదు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ఈశాన్య రైతులు 2022 నాటికి రెండింతల ఆదాయం పొందే వీలు ఏర్పడింది.

ఈ క్రమంలో ఈశాన్య రాష్ట్రాలకు తాజా బడ్జెట్లో కేటాయింపులు కూడా అదే రీతిలో ఉండడం విశేషం. గతంలో కన్నా ఈసారి ఐదింతలు పెంచి రూ. 1014.09 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించింది. ఈ నిధులతో 50 ఎయిర్ పోర్టుల నిర్మాణం, వైమానిక వసతులు కల్పిస్తారు. వ్యూహాత్మకంగా నిర్మిస్తున్న సిక్కింలోని పెకియాంగ్, అరుణాచల్ ప్రదేశ్ లోని తేజు విమానాశ్రయాలతో స్థానికులకు తొలిసారిగా పౌర విమానయానం అందుబాటులోకి వచ్చినట్లయింది. ఈ చర్యలన్నీ ఈశాన్య ప్రాంత ఆర్థిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి. ఇక్కడ ఉండే అత్యధిక అక్షరాస్యత, అందమైన లొకేషన్లు, ఇంగ్లిష్ ను అనర్గళంగా మాట్లాడే ప్రజానీకం వంటి అంశాలు అద్భుతమైన టూరిజం స్పాట్ కు పనికొస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మీద ఎన్డీయే సర్కారుకు ఎంత చిత్తశుద్ధి ఉందో గత ఫిబ్రవరి 3న గౌహతిలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో తేటతెల్లమైంది. ఈశాన్య రాష్ట్రాలకు గల ఆర్థిక పరిపుష్టి ఎంతో ఆ సదస్సు ద్వారా స్పష్టంగా కనిపించింది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాల్లో వస్తూత్పత్తి, సేవారంగం, విద్యుత్తు, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, రవాణా, పెట్రో కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్ టైల్స్, హస్త కళలు, టూరిజం వంటి రంగాల్లో ఈశాన్య రాష్ట్రాలకు గల పెట్టుబడుల సామర్థ్యాన్ని చాటినట్టయింది.

ఈ నేపథ్యంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కావాల్సింది వినూత్నమైన ఆలోచనా విధానాలు, చొరవ, సమైక్య కృషి. పాలనా నిబంధనలు సులభతరం చేసుకొని సమ్మిళిత అభివృద్ధి ద్వారా వృద్ధిని సాధించాలి. స్థానిక ప్రజలు ప్రగతి సాధించాలంటే వారిలో సాధికారత పెంపొందించాలి. అందుకోసం వారి కనీసావసరాలు తీర్చే సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇందుకోసం చట్టాల్లోని సంక్లిష్టమైన నిబంధనల్ని తొలగించాల్సి ఉంది. అది జరగాలంటే ఈ మహాయజ్ఞంలో భాగస్వాములైన అన్ని పక్షాలు కూడా ఓ సమగ్రమైన, వాస్తవిక దృక్పథంతో కూడిన అభివృద్ధి ప్రణాళికను రచించుకోవాల్సి ఉంది. ■

# ఈశాన్యంలో అభివృద్ధికి వెదురు మిషన్ ఒక సాధనం

- నీరేంద్ర దేవ్



**ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయ కార్యక్రమాలు అన్నీ సేంద్రియ పద్ధతుల్లోనే సాగుతాయి. 2016 జనవరి 18న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్కింని ఆర్గానిక్ స్టేట్ ఆఫ్ ఇండియాగా ప్రకటించారు. ఆ తర్వాత కేంద్ర ప్రతిపాదిత పథకం ఈశాన్య రాష్ట్రాలకు సేంద్రియ విలువ శృంఖల అభివృద్ధిని ప్రారంభించారు. ఈ ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేయడానికి "పరంపరాగత కృషి వికాస్ యోజన" కింద ఒక నూతన కార్య క్రమాన్ని ప్రారంభించింది.**

ఈశాన్యభారతంలో అంతర్లీనంగా ఉన్న స్థితిస్థాపకత్వాన్ని గురించి చెప్పినిదే ఈశాన్య రాష్ట్రాల కథ సంపూర్ణం కాదు. వ్యవసాయ యాజమన్య రీతులు, సంప్రదాయక విధానాలు, పంటలు పండించే పద్ధతులు అన్ని కూడా ఈ స్థితిస్థాపకత్వ స్థితిలోనే అంతర్లీనంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రజల ప్రధాన వ్యాపకం వ్యవసాయం. కొండల్లో అయినా, లోయల్లో అయినా అంతే. ఈ ప్రాంత ప్రజలు వయ్యసాయంలో సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తారు. అవి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడినవి. అంతేకాక సంప్రదాయ పరిజ్ఞానంతో వరి, తృణధాన్యాలు ఇతర వ్యవసాయ పంటలు పండిస్తారు. ఈశాన్య రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ అని అంటూంటారు. ఈ ప్రాంతంలో వాతావరణ సమతూక స్థితిని అనుసరించి వ్యవసాయ విధానాలు, పంటల మార్పిడి పద్ధతులు రూపొందించబడ్డాయి.

ఈ ప్రాంతంలో గిరిజనులతో సహా స్థానికులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ జీవవైవిధ్య విధానాలు, పరిజ్ఞానాన్ని కొనసాగిస్తున్నారు. సాధారణంగా రైతులు ఝూమ్‌ని అనుసరిస్తారు. అంటే, వ్యవసాయ విధానం నుంచి నిశ్చల వ్యవసాయ పద్ధతులకు మారుతూ ఉంటారు. గిరిజనులు ఇతర జాతుల వారు జీవవనరులు దేశంలో లభ్యమయ్యే సంప్రదాయ పరిజ్ఞానాన్ని నిలదొక్కుకునేందుకు వినియోగిస్తారు.

స్థానిక రైతులు వ్యవసాయ విధానంలో భారీ, చిన్న తరహా పంటల వేస్తుంటారు. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా, ప్రతికూల పరిస్థితులలో వ్యవసాయం చేస్తుంటారు. వివిధ వ్యవసాయ విధానాల వల్ల లభించే ఫలసాయం,. ఇంధన సామర్థ్యం ఆయా పంటలను బట్టి ఉంటుంది. వరి పండించే రైతులు మొక్క జొన్న, తృణధాన్యాలను పండించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతుండటం గమనార్హం.

వివిధ జాతులవారు రెండు రకాల వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తుంటారు. ఒకే పంటను కాకుండా పంటలను మారుస్తూ ఉంటారు. రెండవది కొండలపై వ్యవసాయం. లోయల్లో ఏటవాలుగా ఉండే ప్రదేశాల్లో, కొండల దిగువ ప్రాంతాల్లో పంటలు వేస్తుంటారు. అడవుల్లోనూ, ఇతర చోట్లా అనుసరించే పద్ధతులకు భిన్నంగా పంటల పద్ధతులను మారుస్తూ ఉంటారు. ఈశాన్యంలో పంటలు మార్పును ఝూమ్ అంటారు. ఈ పంటలు అటవీ ప్రదేశాల్లో మొక్కలు, పొదలు ఉన్న చోట, కొండల ఏటవాలు ప్రాంతాల్లో ఈ పద్ధతులతో వ్యవసాయం సాగిస్తారు.

స్పెషల్ కరస్పాండెంట్, యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ) వార్తా సంస్థ, న్యూఢిల్లీ.
E-mail: nirendev1@gmail.com

మామూలుగా ఝూమ్ సైకిల్ బాగానే పని చేస్తుంది. కానీ, జనాభా పెరగడంతో, భూమి మీద ఒత్తిడి పెరిగింది. దాంతో ఝూమ్ సైకిల్ బాగా తగ్గిపోయింది. దాంతో భూసారం తగ్గిపోయింది. అంతేకాక, ఈ ప్రాంతంలో వ్యవసాయ సమతూక స్థితి దెబ్బతింది.

### ఆవిష్కరణలే కీలకం

ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజన రైతులు నైపుణ్యాన్నీ, బుద్ధి కుశలతనూ ప్రదర్శిస్తారు., ఫలితంగా స్థానికంగా లభ్యమయ్యే వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోగలుగు తున్నారు. అటువంటి ముఖ్యమైన పద్ధతి ఏమిటెంటే పందిరి సేద్యం. ఈ సేద్యంలో రాళ్లు, గోనె సంచులు వినియోగిస్తారు. కొండల్లో ప్రవహించే నీటి ప్రవాహాన్ని నిల్వ చేస్తారు. అలా నిల్వ చేసిన ఆ నీటిని పందిరి సేద్యానికి మళ్ళిస్తారు. పై నుంచి, కింది వరకూ నీరు నిరంతరాయంగా ప్రవహిస్తుంది. ఈ పద్ధతి మాగాణి కాని భూముల్లో ఎక్కువ ఫలదాయక మైనది. ముఖ్యంగా, వరి పంటలు పండించ దానికి ఎంతో మేలు అయినది. దీని వల్ల మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమంటే, పై నుంచి నీటి ప్రవాహంతో పాటు పోషక సంపన్నమైనవి వరి పంట పండించేందుకు లభించవచ్చు. మొక్కజొన్న, చిక్కుడు, బంగాళా దుంప వంటివి ఎగువ ఏటవాలు ప్రాంతాల్లో పండించేందుకు వీలుంది. వరి, వంటి పంటలకు ఎక్కువ నీరు కావల్సి ఉంటుంది. దిగువ ఏటవాలు ప్రాంతాల్లో జౌళి పండిస్తారు.

నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్ వంటి ఈశాన్య రాష్ట్రాల వారు దశాబ్దాలుగా ఆర్థిక పరంగా రాబడి వచ్చే పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కష్టించి పని చేసే పద్ధతుల విషయానికి వస్తే లాభం ఉంటేనే ఈ పద్ధతులను అనుసరిస్తుననరు. అందువల్ల చెట్టు ప్రాతిపదికగా వయ్యసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. చెట్లు పంటల ఉత్పత్తిలో విస్తృతంగా కలగలిసిపోయి ఉంటాయి. వ్యవసాయ, వాతావరణ పరిస్థితులపై దృష్టి కేంద్రీకరించడం జరుగుతుంది. ఆహారానికీ, వైద్యానికి, ఇతర చిన్న వ్యవసాయ ఉత్పత్తులకు చెట్ల జాతులను వినియోగిస్తారు.

కూరగాయలు, పండ్లు, అటవీ సుగంధ ద్రవ్యాలు, మొక్కలు, వ్యవసాయ పంటలు, మొదలైనవి బహుళ ప్రయోజనాల వృక్షాలను, సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. స్థిరమైన సాధన, ఆర్థిక సంస్కరణలకు వస్తే ఈశాన్య ప్రాంత ప్రజలు ఏళ్ళ తరబడి వెదురుమీదే ఆధారపడుతున్నారు. అడవులలో వాతావరణ సమతుల్య పద్ధతిల వెదురు ముఖ్యమైనదని వేరే చెప్పనవసరం లేదు. ఈశాన్య ప్రాంతంలో ఇది చాలా ముఖ్యమైనది.



సంప్రదాయ జీవనం, గిరిజనుల జీవన విధానం బట్టి చూస్తే వెదురు సాగు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆధునిక సమాజంలో సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి వెదురు ఎంత ఉపయోగ పడుతందో వేరే చెప్పనవసరం లేదు. వాతావరణానికి అనుకూలమైనది అయిన వెదురు గ్రామీణ ఆర్థకాభివృద్ధికి, పారిశ్రామి కాభివృద్ధికి, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతోందని వేరే చెప్పనవసరం లేదు..

### పచ్చ బంగారం

2018-19 సాధారణ బడ్జెట్‌ల వెదురును పచ్చబంగారంగా అభివర్ణించడం సబబుగానే ఉంది. వెదురు ప్రాథమికంగా గట్టి తరహా మొక్క అయితే, దానిని చెట్టుగా వందేళ్ళ క్రితమే మార్చడంతో ఈశాన్య రాష్ట్రాల్లో స్థానికులు దీనిని వాణిజ్యపరంగా ఎక్కువగా ఉపయోగించు కుంటున్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వెదురులో 68 శాతం ఈశాన్యంలో ఉత్పత్తి అయ్యేదే. ప్రపంచంలో వెదురు వనరుల్లో 30 శాతం భారత్ లోనే ఉన్నాయి, అయితే, ప్రపంచ మార్కెట్‌కు నాలుగు శాతాన్ని మాత్రమే అందిస్తోంది. తక్కువ ఉత్పాదకతే ఇందుకు కారణం. అందుకే కేంద్ర ప్రభుత్వం వెదురు మిషన్‌ని ప్రారంభించింది. ఇది కేంద్ర ప్రతిపాదిత పథకం, ఇందుకు అయ్యే వ్యయంలో నూరు శాతం కేంద్రమే భరిస్తుంది. వెదురు, వెదురుతో తయారు చేసే చేతి వస్తువులు, వంటి కార్యక్రమాలను వెదురు మిషన్ సమన్వయం చేస్తోంది. ఈ పథకం ద్వారా నైపుణ్యం కలిగిన వారికీ, నైపుణ్యం లేని వారికీ ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యంగా, నిరుద్యోగులైన యువకులకు ఉపాధి కల్పిస్తోంది ఈశాన్యంలో తరతరాలగా స్థానికులు సంప్రదాయకంగా వెదురును సాగు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రయోజనం కోసం వెదురును సాగు చేస్తున్నారు. వెదురును వాణిజ్యం కోసం వ్యవసాయాయేతర భూముల్లో కూడా వెదురు మొక్కలను పెంచుతున్నారు. పారిశ్రామిక ప్రయోజనాల కోసమే కాకుండా వెదురును పౌష్టికాహారంగా ఇక్కడి వారు వినియోగిస్తున్నారు. మిజోరం, త్రిపుర, నాగాలాండ్ తదితర ప్రాంతాల్లో గిరిజనులు వెదురును పెంచు తుంటారు. వెదురు పెంపకం వల్ల భూమికి తగిన భద్రత ఏర్పడుతుంది. భూసారం పెరుగుతుంది. నీటిని నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ నీటిని పొందడం, వ్యవసాయ, ఆహార భద్రతకు తోడ్పడటం జరుగుతుంది.

2017 నవంబర్‌లో ప్రభుత్వం వెదురును చెట్లు జాబితా నుంచి తొలగించింది. దాంతో వెదురు మొక్కలను కూల్చడానికి సంబంధించిన నిబంధనలను సడలించింది. అలాగే, కొట్టిన మొక్కలను రవాణా చేయడం, ప్రాసెసింగ్ చేయడంలో నిబంధనలను కూడా సడలించింది. దీంతో 90 శాతం ఆంక్షలు తొలగిపోయాయి. వెదురు ఉత్పత్తులు స్వేచ్ఛగా ఎగుమతి చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఈలోగా మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలు

అసోంలోని నుమాలిగఢ్ రిఫైనరీకి సరఫరా చేసేందుకు అంగీకరించాయి. ఇంతటితో ఆగకుండా, ప్రభుత్వం వెదురు రంగంలో కొత్త ఆవిష్కరణలకు వ్యూహాలను అమలు చేస్తోంది. వెదురు రంగం వనరుల వృద్ధికి శాశ్వత మార్గంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అనేక రాష్ట్రాల్లో వెదురు పెంపకం దారులు బృందాలుగా ఏర్పడ్డారు.

2018-19 బడ్జెట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జాతీయ బాంబూ మిషన్ పునర్ వ్యవస్థీకరణకు 1290 రూపాయిలను కేటాయించారు. ఈ రంగంలో ఆమూలాగ్రమైన అభివృద్ధి కోసం ఈ కేటాయింపులు చేశారు.

త్రిపుర వంటి రాష్ట్రాల్లో వెదురు రంగాన్ని ప్రధాన జీవనోపాధిరంగంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నట్టు అంచనాలు తయారుచేశారు. కనీసం 20 వేల మంది వెదురు పెంపకం దారులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు.

బహుళమైన వస్తువులు, ఉప ఉత్పత్తుల విషయానికి వస్తే, వెదురు మొక్క ఉంటే, పచ్చళ్ళు, వెనిగర్, ఫ్లవర్ వాజ్, బుట్టలు, అగరబత్తి పుల్లలు, మొబైల్ కవర్లు, శవపేటికలు, ఫొటో ఫ్రేమ్స్ మొదలైనవి ఎన్నైనా తయారు చేసుకోవచ్చు. స్థానిక చేతివృత్తి పనివారు సంప్రదాయకంగా తాము పుణికి పుచ్చుకున్న నైపుణ్యంతో అందమైన వెదురు టోపీలు తయారు చేస్తారు. టోపీలు,ఇతర ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఇతర దేశాలకు వీటిని ఎగమతి చేస్తారు. ఇందులో ప్రైవేటు సంస్థలు, వ్యక్తులను భాగస్వామ్యం చేస్తున్నారు. వెదురుతో డబ్బాలను తయారు చేసి రైతులు తమ వస్తువులను భద్రపర్చుకుంటారు. వివిధ సైజుల్లో వెదురు కంటైనర్లు, ధాన్యం గాదెలను తయారు చేస్తారు. ధాన్యపు రాశులను ఈ గాదెల్లో భద్రపర్చుకుంటారు. అలాగే, విత్తనాలను భద్రపర్చుకుంటారు. రెండు వరుసల్లో నేసిన వెదురు బుట్టలకు రెండు వైపులా ఆవుపేడ, మట్టితోపై లేపనంగా అద్దుతారు. ఇలాంటి బుట్టలు ధాన్యం దాచుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి. ఇలా ఎన్నోన్నో రకాల కుటుంబ అవసరాలకు పనికి వచ్చే వస్తువులను వెదురుతో తయారు చేసుకోవచ్చు. అలాగే, మొక్కజొన్నను కూడా ఇలాంటి బుట్టలలో భద్రపరుస్తుంటారు. ఆఖరికి ఎలుకలను పట్టేందుకు అవసరమైన పెట్టెలను కూడా వెదురుతో తయారు చేస్తారు.

చివరిగా.. ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయ కార్యక్రమాలు అన్నీ సేంద్రియ పద్ధతుల్లోనే సాగుతాయి. 2016 జనవరి 18న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సిక్కింని ఆర్గానిక్ స్టేట్ ఆఫ్ ఇండియాగా ప్రకటించారు. ఆ తర్వాత కేంద్ర ప్రతిపాదిత పథకం ఈశాన్య రాష్ట్రాలకు సేంద్రియ విలువ శృంఖలాభివృద్ధి (మిషన్ ఆర్గానిక్, వాల్యూ చెయిన్ డవలెప్ మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్) ని ప్రారంభించారు. నిజానికి 2015 నుంచి 2018 వరకూ ఈ కార్యక్రమానికి ఆర్థిక కేటాయింపులు రూ. 400 కోట్ల మేరకు కేటాయించారు. ఈ ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేయడానికి "పరంపరాగత కృషి వికాస్ యోజన" కింద ఒక నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**జాతీయ వెదురు మిషన్ వ్యూహం ప్రధాన అంశాలు.**

.... అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వెదురు ఉత్పత్తిదారులకు అందించడం, వివిధ రకాల ఎరువులు, రసాయినాలతో పెంచిన వెదురు మొక్కలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం,

.... బాంబూ టెక్నాలజీ పార్కుల ఏర్పాటును ప్రోత్సహించడం

.... టోకు, రిటైల్ మార్కెట్ల ఏర్పాటులో సహకరించడం...

.... గ్రామాల్లో బాంబూ బజార్ల ఏర్పాటు....

.... నూర్పిడులు అయిన తర్వాత స్టోరేజి, ట్రీట్‌మెంట్ సౌకర్యాలు కల్పించడం

.... ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అగర్‌బత్తి పుల్లల తయారీని జైలులో ఉండే ఖైదీలకు అప్పగించడం మిజోరం లోని ఐజ్వాల్ సెంట్రల్ జైలులో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది.

.... వెదురు ద్వారా స్థిర జీవనోపాధి కల్పించేందుకు వ్యూహాలు. క్లస్టర్ల ప్రాతిపదికగా అమలు.

.... వెదురు ఉత్పత్తులకు వెదురు ఆధారిత సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలకు ఈశాన్య రాష్ట్రాలను కేంద్రంగా తీర్చిదిద్దడం.

.... వెదురు రంగాన్ని దీర్ఘకాలిక, స్వల్పకాలిక జీవనోపాధిగా అభివృద్ధి పర్చడం, ఉపాధి అవకాశాలను పంచడం.

■

## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Division వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

– సీనియర్ ఎడిటర్

ప్రత్యేక వ్యాసం

# ఈశాన్య రాష్ట్రాల్లో పరిపాలనాపరమైన సవాళ్లు

- నరేష్ చంద్ర సక్సేనా




**ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన గణాంకాల ప్రకారం చూస్తే, ఎన్ఎల్‌సిపిఆర్‌లోకి మళ్లించబడ్డ నిధులు 2000 నుంచి 2010 మధ్య కాలంలో రూ. 17,213 కోట్లు ఉండగా, వీటి లోంచి 2011లో కేవలం రూ. 8,796 కోట్లు మాత్రమే అంటే యాభై శాతం మాత్రం విడుదల చేశారు. దీని ప్రకారం చూస్తే ఈశాన్య రాష్ట్రాలు ఈ ప్రాంత అభివృద్ధి కోసం తగిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం లేదని అర్థమవుతుంది.**

దేశంలో ఈశాన్య ప్రాంతం తలసరి ఆదాయం, ప్రైవేటు పెట్టుబడుల లేమి, తక్కువ పరిమాణంలో పెట్టుబడులు, సరిపడా లేని మౌలిక సౌకర్యాలు, దేశానికి ఓ మూలగా విసిరేసినట్టుగా ఉండే ప్రాంతం, అడవులు, ఖనిజాలు, జల విద్యుత్‌కి ఉన్న అవకాశాలను సరిపడా వినియోగించుకోలేకపోవడం కారణంగా వెనుకబడి ఉంది. ఆ ప్రాంతాల్లో పన్ను వసూళ్లు, అంతర్గత వనరులు స్వల్పంగా ఉండడం కారణంగా కేంద్ర ప్రభుత్వం సహాయంపై పూర్తి స్థాయిలో ఆధారపడాల్సి వస్తోంది. స్థానికంగా కాస్తోకూస్తో ధనికులు భూ ఆధారిత ఆస్తులపై మదుపు చేయడానికే మక్కువ చూపిస్తారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం రిస్క్‌తో కూడుకున్నట్లుగా వెనుకంజ వేస్తారు. ఈశాన్య రాష్ట్రాల పరిసర ప్రాంతాలు, భౌగోళిక స్థితిగతులు, మౌలిక సదుపాయాల లేమి వంటి కారణాలు పరిశ్రమల వృద్ధికి అడ్డంకిగా మారాయి. సిక్కిం, త్రిపురతో పాటు కొంత వరకు మిజోరాంని మినహాయిస్తే మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు పట్టిక 1లో చూపిన విధంగా ఆర్థిక వృద్ధి రేటు ఏ మాత్రం మెరుగుపడలేదు. 1970 తొలినాళ్ల వరకు అసోం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగ్గా ఉన్నప్పటికీ, తరువాతి నాలుగు దశాబ్దాల్లో అన్ని అభివృద్ధి సూచికల్లో దిగుజారుతూ వచ్చింది. ఒక్క అసోంలోనే ఈశాన్య రాష్ట్రాల మొత్తం జనాభాలో

**పట్టిక 1: 2004-05 ధరల ప్రకారం ఈశాన్య రాష్ట్రాల్లో తలసరి లెక్కన ఎన్ఎస్‌డిపి వృద్ధిరేటు**

| | 2005-06 | 2015-16 | 2005-16 మధ్యలో వార్షిక వృద్ధి రేటు |
|---|---|---|---|
| అరుణాచల్ ప్రదేశ్ | 26870 | 39107 | 3.82 |
| అసోం | 17050 | 26413 | 4.47 |
| మణిపూర్ | 19479 | 26301 | 3.05 |
| మేఘాలయ | 25642 | 38601 | 4.18 |
| మిజోరాం | 25826 | 44773 | 5.66 |
| నాగాలాండ్ | 33072 | 50327 | 4.29 |
| సిక్కిం | 29008 | 92328 | 12.27 |
| త్రిపుర | 25688 | 55322 | 7.97 |
| ఇండియా | 28639 | 52833 | 6.32 |

మాజీ కార్యదర్శి, కేంద్ర ప్రణాళికా సంఘం, న్యూఢిల్లీ.
E-mail: naresh.saxena@gmail.com

70 శాతం ఉండడం కారణంగా, అలాంటి రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడడంతో మొత్తం ఈశాన్య ప్రాంతాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపించింది.

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమిత శ్రద్ధ ప్రదర్శించినప్పటికీ, ఆయా రాష్ట్రాల పరిపాలన పరంగా ఎంతో అభివృద్ధి చెందాల్సిన విషయాన్ని ఎవరూ మర్చిపోరాదు. పేదరిక నిర్మూలన, సామాజిక సూచికల అభివృద్ధి, అందరికీ ప్రాధాన్యత కలిగిన లక్ష్యాల సాధనలో అసమానతలను రూపు మాపడంతో పాటు పర్యావరణానికి హాని కలగని రీతిలో ఆర్థిక వృద్ధి సాధించడానికి సమ్మిళిత పురోగామి మార్గమే శరణ్యంగా ఉంటుంది. అయితే, ఈశాన్య ప్రాంతాల్లో సూక్ష్మ విధానాలను అచరణలోకి తీసుకొని రావడానికి సుపరిపాలన, బాధ్యతాయుతమైన అధికార యంత్రాంగం లేకపోతే మంచి విధానాలు, చట్టాలు కూడా కాగితాలకే పరిమితమవడంతో పాటు, పక్కదోవ పట్టే ప్రమాదమూ పొంచి ఉంది. ఈశాన్య ప్రాంతాల్లోని రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అధికార యంత్రాంగం బలహీనంగా ఉందని చెప్పాలి. ఫలితంగా నిధులు వినియోగం కాకపోవడం, పర్యవేక్షణ లోపం కారణంగా సరైన ఫలితాలు రావడం లేదు. ఇవన్నీ అభివృద్ధి, సామాజిక సూచికల వృద్ధి రేటుపై విధాయకమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దిగువన కొన్ని ఉదాహరణలు ఇవ్వడం జరిగింది.

### నిధుల వినియోగం:

అందరికీ తెలిసిన విధంగా, అన్ని కేంద్ర మంత్రిత్వశాఖలు వాటి వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో పది శాతం తప్పనిసరిగా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించాల్సి ఉంటుంది. అలా కేటాయించిన నిధుల్లో వినియోగం కాకుండా మిగిలిన వాటిని రద్దు కాని కేంద్ర వనరుల జాబితాలోకి మళ్లించాల్సి ఉంటుంది. ఈ ప్రాంతాల్లో కొన్ని ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అవుతాయి. కొన్ని ప్రాజెక్టులు సకాలంలో నిధులు అందని కారణంగా ఆలస్యమవుతాయి. ఈ రాష్ట్రాల్లో నిధులు పూర్తిస్థాయిలో వినియోగం కాకపోవడంతో పాటు, పని కాల వ్యవధి తక్కువగా ఉండడంతో పనులు వేగవంతంగా పూర్తి కావు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన గణాంకాల ప్రకారం చూస్తే, ఎన్ఎల్‌సిపిఆర్‌లోకి మళ్లించబడ్డ నిధులు 2000 నుంచి 2010 మధ్య కాలంలో రూ. 17,213 కోట్లు ఉండగా, వీటి లోంచి 2011లో కేవలం రూ. 8,796 కోట్లు మాత్రమే అంటే యాభై శాతం మాత్రం విడుదల చేశారు. దీని ప్రకారం చూస్తే ఈశాన్య రాష్ట్రాలు ఈ ప్రాంత అభివృద్ధి కోసం తగిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించ లేదని అర్థమవుతుంది. అదే ఎన్ఆర్ఈజిపి కింద 2016-17 మధ్య కాలంలో ఈశాన్య ప్రాంతంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రాలైన అసోం, మణిపూర్‌లలో కేవలం రూ. 1630 కోట్లు వ్యయం కాగా, అందులో ప్రతి గ్రామీణ పేదవాడికి రూ. 4953 ఖర్చుపెట్టారు. అదే కాలానికి గాను కేరళలో రూ. 15657, రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ. 11942 వ్యయం చేశారు.

ఈశాన్య ప్రాంతంలో వరల్డ్ బ్యాంక్, ఏడిబి నిధులతో చేపట్టిన అనేక ప్రాజెక్టులకు అనుమతులు తదితర సమస్యలతో ఆలస్యమవుతుండడంతో, ఆయా ప్రాజెక్టుల వ్యయం కూడా పెరగకుండా పోయింది. రైల్వే ప్రాజెక్టుల పరిస్థితి ఇదే విధంగా ఉందని చెప్పాలి. ఇక ఈశాన్య రాష్ట్రాలు ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ జరపకపోవడం లేదా అటవీ అనుమతులు పొందడంలో విఫలమవుతున్నాయి. లోక్‌సభలో 22.07.2015 రోజున అడిగిన 'అన్ స్టార్డ్' ప్రశ్న నెంబర్ 287కి సమాధానం చెబుతూ, ఈశాన్య ప్రాంతాల్లో ప్రాజెక్టులు ఆలస్యం కావడానికి నిధుల విడుదలలో ఆలస్యం కావడం, సకాలంలో వినియోగ ధృవీకరణ పత్రాలు సమర్పించకపోవడం, భూ సేకరణ సంబంధమైన సమస్యలు, అటవీ అనుమతులు, శాంతి భద్రత సమస్యలు, అత్యధిక వర్షపాతం కారణం చేత తక్కువగా ఉండే పని దినాలు వంటి కారణాలను ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖ అంగీకరించింది. కాగ్ నివేదిక ప్రకారం (1 of 2015) మణిపూర్‌లో పారిశుద్ధ్య పథకం అమలులో అంచనా, గ్రామీణ లబ్ధిదారుల అవసరాలను గుర్తించడంలో విఫలమైంది. ఈ ప్రాంతాల్లో ఆధారపడదగ్గ గణాంక సమాచారం అందుబాటులో లేదు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ప్లాన్ తయారీలో కమ్యూనిటీ భాగస్వామ్యం లోపించింది. ఆర్థిక పర్యవేక్షణ కూడా సవ్యంగా లేకపోవడంతో నిధుల విడుదలలో ఆలస్యం కావడం, రాష్ట్రాల వాటా విడుదలలో జాప్యం, అనవసర వ్యయం, ఆమోద యోగ్యం కాని నిధుల విడుదల కారణంతో పక్కదారి పట్టడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చును. లబ్ధిదారుల గుర్తించడం లేదా మదింపు చేయడం, లేదా మరుగుదొడ్లను వినియోగించుకొనే విధంగా చేసే పద్ధతులు లోపించాయి.

### పర్యవేక్షణ మరియు మదింపు వ్యవస్థలను మెరుగు పర్చడం:

ప్రస్తుతం అన్ని స్థాయిల్లోని అధికారులు సమాచారాన్ని సేకరించడం, దాన్ని సమర్పించడం చేస్తున్నారు. అయితే వీటిని సరి చేసే లేదా మెరుగుపరిచే చర్యలకు లేదా విశ్లేషించడానికి వినియోగించడం లేదు. ఈ సమాచారాన్ని కేవలం ఉన్నతాధికారులకు పంపడం లేదా అసెంబ్లీలో అడిగే ప్రశ్నలకు మాత్రమే వాడడానికి పరిమితం చేశారు. అదే కాకుండా సేకరిస్తున్న గణాంకాలు కూడా ఒక నిర్ణీత కాల వ్యవధి ప్రకారం చేయడం లేదు. ఆయా ప్రభుత్వ విభాగాలు సేకరించిన సమాచారం సరి అయినదో లేదో కూడా సరి చూడడం లేదు. బాధ్యతాయుతమైన విధానాలు దాదాపుగా లోపించాయని చెప్పాలి. ఉదాహరణకి, ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వాల గణాంకాల ప్రకారం అత్యధికంగా పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులు ఒక శాతంగా ఉన్నట్లు చెబుతుంటే, 2014లో యునిసెఫ్ స్వతంత్ర్యంగా నిర్వహించిన సర్వేలో మణిపూర్‌లో 3.5 శాతం, మేఘాలయ, త్రిపురలో 16 శాతం ఉన్నట్లుగా తేలింది.

**పట్టిక 2: తక్కువ బరువున్న పిల్లల శాతం: ప్రభుత్వ గణాంకాలు (మార్చి, 2014) వర్సెస్ యునిసెఫ్ గణాంకాలు:**

| | ప్రభుత్వ గణాంకాలు | యునిసెఫ్ గణాంకాలు |
|---|---|---|
| అరుణాచల్ ప్రదేశ్ | 0.00 | 13.30 |
| అసోం | 0.86 | 7.00 |
| మణిపూర్ | 0.02 | 3.50 |
| మిజోరాం | 0.31 | 6.20 |
| నాగాలాండ్ | 0.20 | 7.90 |
| సిక్కిం | 0.07 | 6.50 |
| త్రిపుర | 0.25 | 16.80 |
| ఇండియా | 1.61 | 9.40 |

అత్యవసరంగా ఈ రెండు గణాంకాల మధ్య తేడాను పరిష్కరించాల్సి ఉంది. సంస్కరణల ప్రక్రియను అమలు చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో సమాచారం విశ్వసనీయంగా, మదింపు చేసిన సమాచారానికి సరిపోయే విధంగా ఉండేలా చూడాలి. జిల్లా స్థాయిలో జరిగే అర్థం పర్థంలేని, బాధ్యతా రహితమైన పర్యవేక్షణను సరిచేస్తూ సరైన గణాంకాలు అందించే విధంగా ఈశాన్య రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

ఈ-గవర్నెన్స్‌ను ప్రోత్సహించాలి – ఈ-గవర్నెన్స్ ద్వారా సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అదే సమయంలో పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పని చేసేలా చేస్తుంది. పారదర్శకతను పెంపొందించడం కారణం చేత ఈ-గవర్నెన్స్ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దూరభార, ప్రయవ్యయాసాలను తగ్గించి, ప్రజలు రాజకీయ ప్రక్రియలో భాగ్యస్వామ్యులు కావడానికి, సాధికారత సాధించడానికి, మెరుగైన జీవన ప్రమాణాలు సాధించడానికి దోహద పడుతుంది. ఈ-గవర్నెన్స్ అన్నది ప్రజలందరికీ ప్రయోజన కారిగా ఉండడంలో కీలకంగా ఉంటుంది. అయితే ప్రస్తుతానికి మాత్రం ఈ-గవర్నెన్స్ అన్నది విద్యావంతులకు, నైపుణ్యమున్న బృందాలకు మాత్రమే పరిమితమైంది. దీని ప్రయోజనాల గురించి ఈశాన్య రాష్ట్రాల్లోని అత్యధిక జనాభాకి తెలియదనే చెప్పాలి. అసోంపై ప్రపంచ బ్యాంకు 2014లో ఇచ్చిన నివేదికలో (నెంబర్ ఏసీఎస్2740) ఒక సమగ్రమైన ఐసీటీ ప్లాన్ లోపించిందని, సేవలు అందించే వేదికతో పాటు ఐసీటీకి మద్దతుగా ఉండే మౌలిక సౌకర్యాలు లేవని పేర్కొంది. న్యాయపరమైన చిక్కులను, మౌలిక సౌకర్యాల చిక్కుముడులను పరిష్కరించడం ద్వారా ఒక సాధారణ ఐసీటీ ప్లాన్‌ను అభివృద్ధి చేస్తే, హారిజాంటల్ కనెక్టివిటీ, వైడ్ ఏరియా నెట్ వర్క్, డేటా సెంటర్లు ఏర్పాటు చేసి ఐసీటీని బలోపేతం చేసి, దాని ప్రమాణాలు, అంతర్గత నిర్వహణను మెరుగు పర్చడం సాధ్యం అవుతుంది. వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం కోణంలో పరిమాణ పరమైన మోడల్, భవిష్యత్ వృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఐసీటీని మెరుగు పర్చాలి. ప్రతి ప్రభుత్వ విభాగం కూడా ఐసీటీ ప్లాన్ రూపొందించుకొని అందులోనే అన్ని సేవలను, బ్యాక్ ఎండ్, హారిజాంటల్ కనెక్టివిటీ అవసరాలు తీర్చే విధంగా ఒక కేంద్రీకృతమైన అప్లికేషన్ల ద్వారా పాలనాపరమైన సమర్థత, మెరుగైన బాధ్యతను సాధించాలి. ఇదే విధమైన రీతిలో 10వ కామన్ రివ్యూ మిషన్ (2017) కూడా నాగాలాండ్‌లో జాతీయ ఆరోగ్య పథకానికి సంబంధించిన ఐటీ మౌలిక సదుపాయాలు తీవ్ర స్థాయిలో లోపించిన విషయాన్ని గుర్తించింది. నాగాలాండ్‌లో టెలీ మెడిసన్ కానీ, ఎమ్-ఆరోగ్య చర్యలు కానీ అమలు కావడం లేదని పేర్కొంది. పునరుత్పత్తి, శిశు ఆరోగ్యంపై ఒక కార్యాచరణ ప్రణాళిక అన్నదాన్నే అసలు తయారు చేయలేదు. ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్‌ను కంప్యూటీకరించలేదు సరకదా, ఏఎన్ఎమ్‌లు సేవలు అందించే లబ్ధిదారుల వివరాలు కూడా సవ్యంగా లేవు. ఐటీ సదుపాయాలున్నా, కొండ ప్రాంతాలు కావడం, రహదారుల అనుసంధానం లేకపోవడం, ఫోన్, ఇంటర్నెట్ నెట్ వర్క్ సరిగా లేకపోవడంతో సరైన ఫలితాలు రావడం లేదు. అకౌంట్లును సరిగా కంప్యూటీకరించక పోవడంతో త్రిపురలోని ధలాయ్ జిల్లాలో ఆశా వర్కర్లకు ఏడాదిగా వేతనాలు చెల్లించడం లేదు. అయితే దేశంలో మిగిలిన రాష్ట్రాలు సంపూర్ణమైన కంప్యూటీకరణ కారణంతో లక్షిత ప్రజల పంపిణీ (టిపిడిఎస్) ద్వారా ఆహార ధాన్యాల పంపిణీ వంటి పథకాల ద్వారా ఎంతో ప్రయోజనం పొందుతున్నాయి. ఈ టీపీడీఎస్ అమలును ఆరు రాష్ట్రాలు అనగా, అసోం, బీహార్, చత్తీస్‌గఢ్, కర్నాటక, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల్లో అధ్యయనం ద్వారా కింది విషయాలు వెల్లడయ్యాయి (సెప్టెంబర్, 2015లో ఎన్‌సిఏఈఆర్ కొన్ని ఎంపిక చేసిన రాష్ట్రాల్లో లక్షిత ప్రజల పంపిణీ వ్యవస్థపై మదింపుతో కూడిన అధ్యయనం).

1. ఛత్తీస్‌గఢ్‌లో కేవలం లబ్దిదారుల గుర్తింపులో 2 శాతం మాత్రమే తేడా ఉండగా అదే అసోంలో మాత్రం అర్హులైన లబ్దిదారుల గుర్తింపులో 71 శాతం వ్యత్యాసం ఉంది.
2. ఛత్తీస్‌గఢ్‌లో దుర్వినియోగం అతి తక్కువగా ఉంటే తరువాతి స్థానం బీహార్. అసోంలో అత్యధికంగా తరువాతి స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి.
3. అసోంలో నిఘా, పర్యవేక్షణ లోపం అతి తీవ్రంగా ఉన్నాయి.
4. అసోంలో బీపీఎల్ కార్డు పొందాలంటే లంచం కింద రూ.3000 వరకు ఇవ్వాల్సి ఉంటే, అదే ఛత్తీస్‌గఢ్‌లో నామ మాత్రంగా ఉంది.
5. కచార్ అండ్ బోంగైగావ్ కార్డు దారులు ఎప్పుడూ వారి పూర్తీ కోటా ధాన్యాన్ని పొందలేదు. ఎఫ్‌పిఎస్ డీలర్లు కార్డుకి 3 నుంచి 4 కేజీలు తగిస్తారు. ఇది నిజమేనని డీలర్లే అంగీకరించారు. ఎందుకంటే, ధాన్యం రవాణా అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం చెల్లించడం లేదని చెబుతున్నారు.

**అవసరంలేని ప్రభుత్వ సిబ్బంది భారం:**

పైన పేర్కొన్న పాలనా పరమైన లోపాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో కొద్దోగొప్పో

ఉన్నప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం రెండు అంశాలు కీలకంగా ఉన్నాయి. ఒకటి, ఈశాన్య రాష్ట్రాల్లో ప్రణాళికేతర వ్యయం అత్యధికంగా ఉండడానికి గ్రూప్ సి, డీ సిబ్బంది అంటే గుమాస్తాలు, ప్యూన్లు వంటి వారు అవసరం లేకపోయినా ఉండడమేనని చెప్పాలి. దీని కారణంతో ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర సహాయం ఉదారంగా ఉన్నప్పటికీ, ప్రణాళికా వ్యయానికి నిధుల లేమిని ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకి, 2014-15 సంవత్సరానికిగాను అసోంలో తలసరి ప్రణాళికా అంచనా (పర్ కేపిటా ప్లాన్ అవుట్‌లే) రూ.5,775 ఉండగా, అంతే పేదల జనాభా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం రూ.12,807 ఉండగా, అసోంలో భారీగా జీతభత్యాలు ఉండడమే దీనికి కారణమని తేలింది. ఈ రెండు రాష్ట్రాల పోలికలను కింది పట్టికలో చూడవచ్చును.

**పట్టిక 3: అసోం వర్సెస్ ఛత్తీస్‌గఢ్**

| | అసోం | ఛత్తీస్‌గఢ్ |
|---|---|---|
| విస్తీర్ణం (చదరపు కిలో మీటర్లు) | 135 | 78.4 |
| జనాభా (కోట్లలో) | 3.12 | 2.55 |
| 2011-12లో దారిద్ర్య రేఖ శాతం | 32 శాతం | 40 శాతం |
| ఫైనాన్స్ కమిషన్ అందించిన నిధులు (కోట్ల రూపాయాల్లో) | 17,401 | 13,490 |
| 2014-15లో ప్రణాళిక అంచనా | 18,000 | 32,710 |
| 2014-15లో తలసరి ప్రణాళిక అంచనా | 5,775 | 12,807 |
| ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య | 316 | 122 |

ఈ విధంగా ఈశాన్య రాష్ట్రాల్లో సరిగా పని చేయని సిబ్బంది అధికార యంత్రాంగంలో అధికంగా ఉండి, వారి అసమర్థత కారణంగా పాలనా ప్రమాణాలు పడిపోవడంతో పాటు ప్రభుత్వ ఖజానాపై అనవసరమైన భారం పడుతోంది. అవసరానికన్నా ఎక్కువగా ఉన్న సిబ్బందికి తగిన నైపుణ్యం కూడా లేక పోవడంతో, క్లర్కులు, ప్యూన్లు, డ్రైవర్లు వంటి అవసరం లేని వారి కారణంగా అనుత్పాదకత ఎక్కువైంది. అదే సమయంలో అవసరమైన కీలక రంగాల్లో నర్సులు, డాక్టర్లు, టీచర్లు, న్యాయ మూర్తులు, పోలీసులు వంటి వారి కొరత మాత్రం ఈ రాష్ట్రాల్లో పట్టి పీడిస్తోంది. ఇక పోతే ప్రభుత్వ యంత్రాంగమంతా ఇక్కడ అపసవ్యంగా ఉంటూ, ఆయా శాఖల్లో పని తీరు, వాటి నిర్మాణం, నిర్వహణ ఎంతో నిరాశజనంగా ఉండడమే కాకుండా, మావన వనరుల నిర్వహణ కూడా మరెంతో అసంతృప్తికి గురి చేస్తోంది. కీలకమైన ప్రభుత్వ కార్యాకలాపాల నిర్వహణలో ప్రోత్సాహాలూ కరువయ్యాయి. ఇకపోతే ఈశాన్య రాష్ట్రాలకే ప్రత్యేకమైన సంస్కృతి ఏంటంటే, అసోం, మణిపూర్, నాగాలాండ్ వ్యక్తిగత హక్కుల కోసం చీటికి మాటికీ బంద్‌లు జరుగుతుంటాయి. ఇలాంటి బంద్‌లతో స్థానిక ప్రభుత్వాల వ్యవహారశైలి కుంటుపడుతోంది. అసోంలో బంద్ జరిగితే దాని ప్రభావం ఆ రాష్ట్రానికే పరిమితం కాకుండా ఆ రాష్ట్రం గుండా రైలు, రోడ్డు మార్గం ద్వారా వచ్చే బియ్యం, తృణ ధాన్యాలు, మందులు, పౌల్ట్రీ, కూరగాయలు తదితరాల రవాణా నిలిచిపోతోంది. ఇహ ఇప్పుడు నాగాలాండ్, అసోం, మణిపూర్ రాష్ట్రాల ప్రజలకు సరైన సమయం వచ్చింది. అనుత్పాదకంగా మారిన బంద్‌లకు వ్యతిరేకంగా దృఢ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో పని చేసే సాయుధ ముఠాలు రాష్ట్ర ప్రభుత్వాలపై ఏదో నెపం వేస్తూ నిరసనలకి దిగుతుంటాయి. ఈ బంద్‌ల సంస్కృతికి స్వస్తి పలకడం ద్వారా ఈశాన్య ప్రాంతాల ప్రజలు రాబోయే భవిష్యత్ తరాలకు పురోగతితో కూడుకున్న శాంతియుత జీవనాన్ని అందించడం సాధ్యమవుతుంది.

**ముగింపు**

రాబోయే దశాబ్ది కాలంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకూ, ఈశాన్య రాష్ట్రాలకు మధ్య ఉన్న వృద్ధి రేటులో అంతరాన్ని తగ్గించడానికి భారీ స్థాయిలో ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచడంతో పాటు, పాలనా పరమైన సేవలను మెరుగు పర్చాలి. అయితే ఆర్థిక వనరుల లభ్యత కన్నా, ప్రభుత్వ సంస్థలు, వ్యక్తులు స్థానికంగా లభ్యమయ్యే వనరులను ప్రభావంతంగా వినియోగించుకోవడంలోనే వృద్ధి రేటు పెరగడానికి కీలకాంశంగా ఉంటుంది. దీని కోసం దేశం నలు మూలల నుంచి, మరియు అంతర్గతంగా సాంకేతిక సహాయాన్ని ఈశాన్య ప్రాంతాలకు తరలించాలి. ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వ శాఖలు, సంస్థలను బలోపేతం చేయడం, పౌర సమాజం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. స్థానిక స్వయం పాలనా యంత్రాంగాన్ని పటిష్టం చేయాల్సి ఉంది. ఈ దిశగా భారత ప్రభుత్వం కృషి చేయాలి. నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, స్పష్టమైన ఫలితాల సాధన కోసం వ్యూహాలను రచించుకొని, యావత్ ఈశాన్య ప్రాంతాన్ని ఒకే యూనిట్‌గా సమన్వయం చేసుకుంటూ స్వయం పోషకంగా తయారు కావడమే కాకుండా దేశ ఖజానాకి, ఆర్థిక వ్యవస్థ కూడా ఇతోధికంగా తోడ్పడే రీతిలో అభివృద్ధి చెందాలి. ఇలాంటి ప్రక్రియను త్వరిగతిన ప్రారంభించడం అత్యావశ్యకం. సుపరిపాలన ద్వారా పారదర్శకత, బాధ్యతాయుతమైన సేవలు సాధ్యమవుతాయి. ఇది పాలనా వ్యవస్థయే కాకుండా నైతిక ప్రాధాన్యత కూడా సంతరించుకోనుంది. ఒక ప్రభావంతమైన సామాజిక తనిఖీ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో జరిగే ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ బలోపేతం అవుతుంది. క్రమేణా అది ఉన్నత స్థాయి ప్రభుత్వ వ్యవహారాలను ప్రభావితం చేస్తుంది. అదే విధంగా సామర్థ్య నిర్మాణం, సంస్థాగత నిర్మాణాన్ని తక్కువగా అంచనా వేయరాదు. ■

**గమనిక:**

ఈ సంచికలో స్థలాభావంవల్ల **"దర్పణం"** శీర్షికను ప్రచురించలేక పోతున్నాం. పాఠకులు గమనించగలరు.

విశిష్ట వ్యాసం

# ఈశాన్యంలో నైపుణ్యాభివృద్ధి

- ఇబూ సంజీబ్ గార్గ్




**జనాభాపరంగా మొత్తం దేశ జనాభాలో పని చేసే వయస్సులో (15-64 సంవత్సరాలు) ఉండే వారి సంఖ్య త్వరితగతిన పెరగడాన్నే డెమోగ్రాఫిక్ డివిడెండుగా పేర్కొంటారు. గత కొద్ది కాలంగా నైపుణ్యాభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాలు అద్భుతమైన పురోగతిని సాధించాయి. శిక్షణ పొందిన యువతకు ఉపాధి అవకాశాలను అందించడంతో, ఉద్యోగకల్పనకు ఈ కార్యక్రమాలు కొత్త ద్వారాలను తెరిచాయి. అయితే ఈశాన్య రాష్ట్రాలకు ఇప్పుడు ఆర్థికంగా పెరిగిన ప్రాధాన్యం దృష్ట్యా ఈ ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధిని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది.**

21వ శతాబ్ది ఆర్థిక వాస్తవాలు ఒక కొత్త రకం ఆర్థిక వాతావరణాన్ని ఆవిష్కరించాయి. పెట్టుబడి, జాతిశక్తికి కొత్త ధోరణిలో నిర్వచనాలు ఇచ్చాయి. ఈ కొత్త ఆర్థికశక్తిలో అత్యంత కీలకమైన అంశం జనాభాపరమైన డివిడెండు. దీన్నే డెమోగ్రాఫిక్ డివిడెండుగా వ్యవహరిస్తారు. జనాభాపరంగా మొత్తం దేశ జనాభాలో పని చేసే వయస్సులో (15-64 సంవత్సరాలు) ఉండే వారి సంఖ్య త్వరితగతిన పెరగడాన్నే డెమోగ్రాఫిక్ డివిడెండుగా పేర్కొంటారు. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రపంచంలోని పలు దేశాల్లో ఈ వయసులోని వారి సంఖ్య క్షీణిస్తూ ఉంటే భారత్‌లో మాత్రం నిరంతరాయంగా పెరుగుతూ వస్తోంది. ప్రపంచ ఆర్థికవేత్తలు ఈ ప్రయోజనాన్నే భారతదేశానికి గల డెమోగ్రాఫిక్ డివిడెండుగా అభివర్ణించారు. రానున్న దశాబ్ది కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అవతరించడంలో ఈ జనాభా శ్రేణిలోని వారే కీలక పాత్ర పోషిస్తారు.

జనాభాపరంగా తనకు గల ఈ ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని పని చేసే వయసులో ఉన్న జనాభాను ప్రస్తుత అవసరాలకు దీటుగా తీర్చిదిద్దడానికి భారత్ సన్నాహాలు చేస్తోంది. ఇక్కడే నైపుణ్యాల అభివృద్ధి అనే అంశం కీలకంగా మారింది. ఒక వ్యక్తిలో ప్రత్యేక ఉపాధికి లేదా స్వయం ఉపాధి పొందడానికి అవసరం అయిన నైపుణ్యాలను అలవరచడం లేదా శిక్షణ ఇవ్వడం ద్వారా అతని సంపాదనా శక్తిని పెంచడం, పని చేసే పరిస్థితులను మెరుగుపరచడం, ఇప్పటివరకు అసంఘటిత నైపుణ్యాలుగా పరిగణించిన వాటికి సరైన రూపం ఇవ్వడం ద్వారా వారిలోని నైపుణ్యాలకు ఒక తటస్థ సంస్థ నుంచి సర్టిఫికేషన్ వచ్చేలా చూసి వారిని వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగులుగా మార్చడం, వారు మరింత ఉన్నత విద్య/శిక్షణలకు అర్హత సాధించేలా చేయడం లక్ష్యంగా ఏదైనా రంగాన్ని లేదా ఒక విభాగాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఇచ్చే శిక్షణనే నైపుణ్యాల అభివృద్ధిగా 2015 జూలై 15న నైపుణ్యాభివృద్ధి ఉమ్మడి నిబంధనల పరిధిలో నిర్వచించింది. ఒకే ఒక ముక్కలో చెప్పాలంటే ఒక వ్యక్తి తనలోని నైపుణ్యాలకు న్యాయం చేయగల ఉద్యోగం సాధించడానికి లేదా స్వయం ఉపాధి పొందడానికి నిర్దిష్ట రంగంలో నియమబద్ధమైన శిక్షణ ఇవ్వడమే నైపుణ్యాభివృద్ధి.

గత పది సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి కీలక చోదకశక్తిగా నైపుణ్యాల అభివృద్ధిని గుర్తించి అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నాయి. ఈ రోజు

---

అసిస్టెంట్ కమిషనర్, ఆదాయపన్ను శాఖ, న్యూఢిల్లీ
E-mail: pabloo8690@gmail.com

కేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖ పనిచేస్తోంది. నైపుణ్యాల అభివృద్ధిలో వేగాన్ని, ఆ కార్యక్రమాల కాలపరిమితిని కూడా ఆ శాఖ పరిశీలిస్తోంది. రాష్ట్రాల స్థాయిలో కూడా రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎస్‌డిఎం) కింద అదే నమూనా అమలు జరుగుతోంది. దేశవ్యాప్తంగా నైపుణ్యాల అభివృద్ధి కార్యకలాపాలు జోరందుకున్న నేపథ్యంలో ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో ఆ కార్యకలాపాల తీరుతెన్నులను తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. గత కొద్ది సంవత్సరాల కాలంలో దేశపాలనా వ్యవహారాల్లో ఈశాన్య ప్రాంతాలకు ప్రాధాన్యత పెరుగుతూ వస్తోంది. **ఈశాన్య ప్రాంతాన్ని ''నవభారతావనికి కొత్త ఇంజన్''గా రీబ్రాండింగ్ చేయడం భారతదేశంలో ఈశాన్యానికి పెరుగుతున్న ప్రాధాన్యతకు దర్పణం.** ఈ ప్రాధాన్యతకు అనుగుణంగానే వివిధ రాష్ట్రాల్లో నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి.

**అరుణాచల్‌ప్రదేశ్...**

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి ఆర్థిక సహాయ సంస్థ (ఎన్ఇడిఎఫ్ఐ) సమన్వయంతో నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల పునాదులు పటిష్ఠం చేయడానికి అవసరమైన వాతావరణం కల్పించేందుకు ఒక అధ్యయన నివేదిక తయారుచేస్తోంది. "ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన" (పిఎంకెవివై) కింద 87 వేల మంది యువతకు ఉపాధి హామీ కల్పించడం లక్ష్యంగా ఒక ఉత్సాహవంతమైన కార్యక్రమాన్ని ప్రభుత్వమే చేపట్టింది. 2018-19 నాటికి నాలుగు కొత్త ఐటిఐల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పిపిపి) రాష్ట్ర వ్యాప్తంగా 'గ్రామీణ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను' ఏర్పాటు చేయనున్నట్టు నైపుణ్యాల అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఒక ప్రత్యేకమైన నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు దశలో ఉంది. అలాగే పిఎంకెవివై కింద తవాంగ్‌లో "హోమ్ స్టే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం" దేశంలోనే తొలి ప్రయత్నంగా చేపట్టారు.

**అస్సాం...**

ఉపాధి కల్పన కార్యక్రమం (ఇజిఎం), అస్సాం రాష్ట్ర జీవనోపాధి కార్యక్రమం మరియు జాతీయ పట్టణ జీవనోపాధి కార్యక్రమం (ఎన్‌యుఎల్ఎం) కింద అస్సాంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా ఈ పథకాలు విశేషమైన విజయం సాధించాయి. **2017 సంవత్సరం చివరిలో రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న ఉపాధికల్పన కేంద్రాలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చుతున్నట్టు ప్రకటించారు. అస్సాంలో నైపుణ్యాభివృద్ధిని విజయవంతంగా నిర్వహించడానికి అస్సాం నైపుణ్యాభివృద్ధిశాఖ ప్రత్యేకంగా ఏర్పాటయింది.** 3 లక్షల మంది కొత్త వారికి రానున్న సంవత్సరాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలన్న బృహత్ లక్ష్యాన్ని అస్సాం ప్రభుత్వం స్వయంగా నిర్దేశించుకుంది. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడం ద్వారా జైలు జీవితం అనంతరం సమాజంలో అర్థవంతమైన భాగస్వాములు కాగల నిపుణులుగా తీర్చి దిద్దడం లక్ష్యంగా 'ఖరాగోర్ పోరా ఖరిఖోర్ పథకాన్ని' ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రాల్లో ఒకటిగా అస్సాం నిలిచింది. రంగాలవారీగా సామర్థ్యాలు అలవరచడానికి సిస్కో, డాబర్ వంటి కంపెనీలతో కూడా అస్సాం ప్రభుత్వం భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంది.

**మణిపూర్...**

నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపించడానికి మణిపూర్ పలు కమిటీలను నియమించింది. ఆ కమిటీలన్నీ నైపుణ్యాల అభివృద్ధిలో భాగస్వాములందరినీ సమన్వయ పరుస్తూ ఆ బృహత్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయి. ప్రతీ ఒక్క కుటుంబానికి ఒక ఉద్యోగం వంతున రాష్ట్రంలో 1.5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా మణిపూర్ ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని ఇటీవలే ప్రకటించింది. రాష్ట్రంలోని 40 కళాశాలల్లో వృత్తి నైపుణ్యాల శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నారు. అలాగే లొంగిపోయిన తీవ్రవాదులు, గిరిజన మహిళలకు నైపుణ్య శిక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది.

**మేఘాలయ...**

మేఘాలయ రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి సంఘం తొలిదశలో 7700 మంది యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి వారందరికీ వివిధ పరిశ్రమలు, వివిధ రంగాల్లో ఉపాధి చూపించింది. గ్రామీణ ప్రాంతాల యువతకు భిన్న నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారిని ఉపాధి మార్కెట్‌లోకి తీసుకురావడం కోసం దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన (డిడియు - జికెవై) కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఈ పథకం కింద టూరిజం, ఆటోమొబైల్ మెకానిక్, హౌస్ కీపింగ్ సహా కొన్నిరంగాలను నైపుణ్యాల శిక్షణ కోసం కీలక రంగాలుగా గుర్తించి వాటికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఇక మిజోరం, నాగాలాండ్ తమ నైపుణ్యాభివృద్ధి పథకాలను స్థూలంగా జాతీయ పథకాలకు అనుసంధానం చేసి జాతీయ లక్ష్యాలకు దీటుగానే కార్యక్రమాలు చేపడుతున్నాయి. త్రిపురలో కూడా నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహం కల్పించడం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం పేరిట ఒక బృహత్ కార్యక్రమం చేపట్టారు. సిక్కిం జీవనోపాధి పాఠశాలల పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందులో కళలు, హస్తకళలు సహా భిన్న విభాగాల్లో యువతకు నైపుణ్యాల శిక్షణ ఇస్తున్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో నైపుణ్యాల అభివృద్ధి వాస్తవంగా వేగాన్ని అందుకుంది, అయినా ఇంకా ఎన్నో సవాళ్లు ముందున్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలకు దీటుగా ఆ జోరును స్థిరంగా కొనసాగించేందుకు సరికొత్త చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ప్రతి రాష్ట్రానికి అవసరం అయిన ప్రత్యేక నైపుణ్యాలతో ఒక

సమగ్ర స్కిల్ మ్యాపింగ్ తయారుచేయడం అందులో మొదటిది. ఒక్కో రంగంలోనూ సాంప్రదాయిక జ్ఞానానికి పెద్దపీట వేస్తూ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వాస్తవ ఉపాధి కల్పన వనరులుగా తీర్చి దిద్దేందుకు స్కిల్ మ్యాపింగ్ తప్పనిసరి. దీని వల్ల ఏ ప్రాంతంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్యాలు అవసరం అనే అవగాహన కలుగుతుంది. గ్రామీణ యువత ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలస పోవడాన్ని నిలువరించి, స్థానికంగానే వారికి ఉపాధి చూపించగలుగు తారు. అస్సాం ప్రభుత్వం ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి మ్యాప్ సిద్ధం చేసింది. ఉదాహరణకి అస్సాంలోని బార్‌పేట జిల్లానే తీసుకుంటే అక్కడ బాణాసంచా, బెల్ మెటల్ హస్తకళల్లో ప్రత్యేక పరిజ్ఞానం ఉంది. ఈ రంగాల్లో పరిజ్ఞానాన్ని మరింతగా పెంచి నైపుణ్యాల శిక్షణ ఇచ్చేందుకు ఐటిఐలు, ఇతర విద్యా సంస్థలను సమాయత్తం చేశారు. సాంప్రదాయిక జ్ఞానాన్ని మరింతగా అభివృద్ధి చేసి యువతను ఉపాధి మార్కెట్‌కు అనుగుణంగా సిద్ధం చేయడానికి ఆయా సంస్థల సిలబస్‌లో మార్పులు చేయడం తప్పనిసరి. అలాగే ప్రత్యేకంగా గుర్తించిన విభాగాల్లో క్లస్టర్ విధానంలో పరిశ్రమల ఏర్పాటును సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇల)ను ప్రోత్సహించాలి. అదే విధంగా భిన్న విభాగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న కచార్ జిల్లాలో మట్టి పాత్రల తయారీ (పాటరీ), సితాల్ పట్టి; సోనిత్ పూర్ జిల్లాలో రైస్ మిల్లింగ్ వంటి రంగాల్లో ప్రత్యేక నైపుణ్యాల అభివృద్ధి కోసం కృషి జరగాలి. ఇతర ఈశాన్య రాష్ట్రాలు కూడా ఏయే రంగాల్లో తమ ప్రజలకు సాంప్రదాయిక జ్ఞానం ఉన్నది లేదా చారిత్రక, భౌగోళిక ప్రయోజనం ఉన్నది గుర్తించి అలాంటి విభాగాల్లో స్కిల్ మ్యాపింగ్‌కు కృషి చేయాలి. రబ్బర్ ఉత్పత్తి, రబ్బర్ వస్తువుల తయారీలో త్రిపురకు ఎంతో లోతైన పరిజ్ఞానం ఉంది. ఇక్కడ తయారయ్యే రబ్బరును పొరుగు దేశాలకు కూడా ఎగుమతి చేయవచ్చు. ఈశాన్య ప్రాంతాన్ని ఆగ్నేయాసియాతో అనుసంధానం చేస్తూ రైల్వే నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిన నేపథ్యంలో ఇలాంటి బిజినెస్ నమూనాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని త్రిపురలో రబ్బర్ పరిశ్రమకు అవసరం అయిన నిపుణులైన కార్మికశక్తి అందించడం లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రీ-డిజైన్ చేయాల్సి ఉంది. జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన హార్న్‌బిల్ ఉత్సవాన్ని కేంద్రంగా చేసుకుని నాగాలాండ్‌లో టూరిజం అభివృద్ధి చేయవచ్చు. అత్యంత ప్రాధాన్యతా రంగంగా టూరిజం కేంద్రంగా పలు కార్యక్రమాలు చేపట్టవచ్చు. మేఘాలయలో సోహ్రా, దాకి, జైనితా హిల్స్ కేంద్రంగా సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయవచ్చు. ఆ ప్రాంతాల చుట్టూ ఆహారం, పానీయాలు, ఆతిథ్యం, సాహస క్రీడలను అభివృద్ధి చేయవచ్చు.

పొరుగుదేశాల్లోని మార్కెట్ అవకాశాలను సొమ్ము చేసుకోవడం లక్ష్యంగా సాంప్రదాయిక జ్ఞానానికి మెరుగులు దిద్దడం కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేయడం మరో ప్రాధాన్యతాంశం. బంగ్లాదేశ్‌కు చెందిన ప్రాణ్ ఫుడ్స్ ఈ నమూనాను విజయవంతంగా అమలు పరిచింది. ఈశాన్య రాష్ట్రాల్లో విశేష ఆదరణ ఉన్న లిచి జ్యూస్ వంటివి తయారుచేసి మార్కెటింగ్ చేయడం ద్వారా ఒక ప్రత్యేక మార్కెట్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈశాన్యంలోని పలు ప్రాంతాల్లో ఈ కంపెనీ బలంగా పాతుకుపోయింది. ఈశాన్య ప్రాంతాల్లో ప్రజలకు ప్రత్యేకమైన నైపుణ్యాలున్న టవల్స్, శాలువాల తయారీపై దృష్టి సారించి పొరుగుదేశాల మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని వాటిని తయారుచేయవచ్చు.

జాతీయ నైపుణ్యాల అర్హత నియమావళి (ఎన్ఎస్ఓఎఫ్) ప్రమాణాలకు ధీటుగా ఈ కార్యక్రమాలను ముందుకు నడిపేందుకు ఫలితాల సాధన ఆధారిత వ్యూహం అనుసరించడం మరో ప్రధానమైన అంశం. ఒకసారి ఈ నమూనాను అనుసరించినట్లయితే నైపుణ్యాల అభివృద్ధిలో ప్రతి ఒక్క రాష్ట్రం పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లోటుపాట్లేవైనా ఉంటే వాటిని సరిదిద్దే వీలు కలుగుతుంది. అలాగే అధిక డ్రాపౌట్ రేటును అదుపులోకి తెచ్చేందుకు ఆశావహులైన యువతను చిన్న వయసులోనే పట్టుకుని వారి దృష్టిని నైపుణ్యాల వైపు మరలించాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే వృత్తివిద్యలు ప్రవేశపెట్టడం ఈ దిశగా ఆహ్వానించదగిన చర్య. అలాగే ఈశాన్య రాష్ట్రాల్లోని యువతలో ఎంటర్ ప్రెన్యూర్ సామర్థ్యాలు పెంచడానికి పాఠశాల స్థాయి నుంచే స్ఫూర్తిమంతం అయిన ఎంటర్ ప్రెన్యూర్ల విజయగాథలు పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టాలి. సవరించిన జాతీయ నైపుణ్యాల అభివృద్ధి విధానం ప్రస్తుత మౌలిక వసతులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన మార్గదర్శకం చేస్తోంది. ప్రాంతీయంగా ప్రైవేటు శిక్షకుల సంఖ్య కూడా పెంచాలి. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీల కార్పొరేట్ సామాజిక బాధ్యతలను నైపుణ్యాభివృద్ధితో అనుసంధానం చేసి ఆయా రంగాలకు వారిని ట్రెయినర్లుగా అభివృద్ధి చేయాలి.


గత కొద్ది కాలంగా నైపుణ్యాభివృద్ధిలో ఈ రాష్ట్రాలు అద్భుతమైన పురోగతిని సాధించాయి. శిక్షణ పొందిన యువతకు ఉపాధి అవకాశాలను అందించడంతో, ఉద్యోగ కల్పనకు ఈ కార్యక్రమాలు కొత్త ద్వారాలను తెరిచాయి. అయితే ఈశాన్య రాష్ట్రాలకు ఇప్పుడు ఆర్థికంగా పెరిగిన ప్రాధాన్యం దృష్ట్యా ఈ ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధిని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రస్తుత జోరును కొనసాగిస్తూ కొత్త సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలతో ముందుకు వచ్చినట్టయితే ఈశాన్య రాష్ట్రాల్లో నైపుణ్యాల అభివృద్ధి మరింతగా విస్తరించి యువతకు చక్కని ఉపాధి కల్పించగల అవకాశాలు మెండుగా ఉన్నాయి.

■

ఆకర్షణీయ వ్యాసం

# దేశాభివృద్ధికి దోహద పడుతున్న కృత్రిమ మేధస్సు

\- డాక్టర్ అవీక్ సర్కార్




**రాగల దశాబ్దాలలో భారతదేశంలో కృత్రిమ మేధస్సు ద్వారా అభివృద్ధికి అద్భుత అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఇందుకు సంబంధించిన భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించనుంది. అలాగే కృత్రిమ మేధస్సుకు సంబంధించి నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్ననేపథ్యంలో ప్రజలను ఇందుకు సన్నద్ధులను చేసి వారికి నూతన నైపుణ్యాలలో శిక్షణ నివ్వవలసి ఉంది. పాత సాంకేతిక పరిజ్ఞానం వల్ల కోల్పోయే కొన్ని ఉద్యోగాల బదులు నూతన నైపుణ్యాల వల్ల ఎన్నో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.**

మనిషి తన మేధస్సుతో చేసే జ్ఞానసంబంధ కార్యకలాపాలను నిర్వర్తించగల సామర్థ్యాన్ని ఒక యంత్రం కలిగి ఉండడాన్ని కృత్రిమ మేధస్సు అని నిర్వచిస్తున్నాం. దీనినే ఇంగ్లీషులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అని అంటున్నాం. అంటే, అర్థం చేసుకోవడం, తార్కికత కలిగిఉండడం, నేర్చుకోవడం, పరిసరాలనుంచి గ్రహింపు, సమస్య పరిష్కారం, చివరకు సృజనాత్మకత కలిగిఉండడం ఇవన్నీ ఒక యంత్రం చేయగలగడం అన్నమాట. అంతర్జాతీయంగా కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎ.ఐ) విషయమై విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వదిలించుకుని, దానిస్థానంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకువచ్చి తద్వారా వేగవంతమైన ప్రగతి, ఉత్పాదకతకు కృత్రిమ మేధస్సు దారి తీస్తుందని, ఇదే అతి పెద్ద సాంకేతిక మార్పు అవుతుందని కొందరు భావిస్తున్నారు. మరికొందరు మాత్రం, ఇందుకు పూర్తి భిన్నంగా తమ వాదనలను వినిపిస్తున్నారు. దీనివల్ల పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని అంటున్నారు. ప్రైస్ వాటర్ కూపర్స్ (పిడబ్ల్యుసి) మాత్రం అంతర్జాతీయంగా కృత్రిమ మేధస్సుకు సంబంధించి 15.7 ట్రిలియన్ డాలర్ల మేరకు అదనపు వ్యాపార అవకాశాలు కలుగుతాయని, ప్రస్తుతం వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థలో ఇది అతిపెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలను కల్పించనుందని చెబుతోంది. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వాస్తవాలను తెలియజేయడంతోపాటు ఈ అంశానికి సంబంధించిన స్థూల దృష్టిని కల్పించడానికి ఈ వ్యాసంలో ప్రయత్నించడం జరుగుతోంది. అలాగే కృత్రిమ మేధస్సుకు సంబంధించిన కొంత నేపథ్యాన్నీ వివరించడం జరుగుతోంది. కేంద్రప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన దానిని బట్టి, కృత్రిమ మేధస్సు వల్ల ఇండియా ఏ రకంగా ప్రయోజనం పొందనుంది? దీనిని ముందుకు తీసుకుపోవడంలో ఇమిడి ఉన్న అంశాల వంటి వాటిని కూడా ఇక్కడ ప్రస్తావించుకోనున్నాం.

కృత్రిమ మేధస్సు, దానికి మద్దతుగా నిలిచిన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన మౌలిక అంశాలను అర్థం చేసుకోవడానికి, 2009 నాటి బహుళ జనాదరణ పొందిన త్రీ ఇడియట్స్ సినిమాలోని క్లైమాక్స్ సన్నివేశాన్ని పరిశీలించి చూడండి. ఆ చిత్రంలోని క్లైమాక్స్ సన్నివేశంలో, ఇంజనీరింగ్ విద్యార్థి, వైద్య సంబంధ శిక్షణ ఏదీ లేని ప్రధాన పాత్రధారి రాంచో (అమీర్ ఖాన్ ఈ పాత్రలో నటించారు),

ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, నీతి ఆయోగ్, న్యూఢిల్లీ.
E-mail: avik.sarkar@gov.in

ఒక గర్భిణి తీవ్రమైన పురిటి నొప్పులు పడుతుండగా ఆమెకు కాన్పుచేయవలసి ఉంటుంది. స్వల్ప వైద్యసదుపాయాలు కలిగిన గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటివి సహజం. ముఖ్యంగా గిరిజన మారుమూల ప్రాంతాలలో ఇలాంటివి సర్వసాధారణం. అయితే ఈ చిత్రంలో సాంకేతిక పరిజ్ఞానం వారిని ఆదుకుంటుంది. గర్భిణి సోదరి, శిక్షణపొందిన వైద్యురాలైన పియా (కరీనా కపూర్ ఈ పాత్రలో నటించారు) ఈ కాన్పుచేయడానికి తగిన సూచనలను వీడియో కాల్ద్వారా రాంచూకి తెలియజేస్తారు. పండంటి బిడ్డకు ఆ తల్లి జన్మనిస్తుంది. ఇలాంటి టెలి మెడిసిన్ సౌకర్యాలు ఇవాళ, భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ ప్రభుత్వ పథకాలైన భారత్ నెట్ (గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటి), డిజిటల్ ఇండియా కార్యక్రమాల ద్వారా అందుబాటులోకి వచ్చాయి.

ఈ చిత్రంలో, శిక్షణ పొందిన వైద్యురాలైన పియా, గర్భిణికి సుఖ ప్రసవం అయ్యేవరకు రాంచూకు తన సూచనలు అందిస్తూనే ఉంటుంది. దీనిని బట్టి మనకు గ్రామాలలో ప్రతి నర్సుకు లేదా వైద్యుడి పరోక్షంలో సేవలు అందించే వారికి సూచనలు అందించేందుకు శిక్షణ పొందిన ఒక డాక్టర్ అవసరం. వాస్తవానికి, భారతదేశంలోని అన్ని గ్రామాల విషయంలో ఇలాంటి సమస్య పరిష్కారానికి వైద్యుల కొరత పెద్ద అవరోధం. కృత్రిమ మేధస్సు ఆధారిత సిఫార్సుల వ్యవస్థ ఇలాంటి సమస్యల పరిష్కారానికి దోహదపడగలదు. రోగికి అందించాల్సిన చికిత్స గురించి, రోగులు పలు సందర్భాలలో ఎదుర్కొనే పరిస్థితుల గురించి నర్సులకు కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ తగిన సూచనలు ఇవ్వగలదు. ఇలాంటి రోగలక్షణాలు గల పేషెంట్లకు, ఇదే తరహా చికిత్సకు సంబంధించి గతంలో పేషెంట్లకు వైద్యులు ఎలాంటి మందులు సూచించారన్న దానికి సంబంధించి పెద్దమొత్తంలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు వ్యవస్థ పరిస్థితిని అవగాహన చేసుకుంటుంది. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కృత్రిమ మేధస్సు పౌరులకు సాధికారత కల్పించడంలో, వారికి విజ్ఞానాన్ని పంచడంలో కీలక పాత్ర వహిస్తుంది. ఈ ఉదాహరణలో, గ్రామ ఆరోగ్య సంరక్షణ కేంద్రంలోని నర్సుకు కలిగే సాధికారత, కృత్రిమ మేధస్సు ద్వారా కలిగిన సాధికారతగా చెప్పవచ్చు.

### కృత్రిమ మేధస్సు చరిత్ర....

1950ల మధ్య నుంచి కృత్రిమ మేధస్సు అనేది కంప్యూటర్ సైన్స్‌లో ఒక పరిశోధన అంశంగా ఉంటూ వచ్చింది. 1958లో ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్ వర్క్ కోసం పర్సెప్ట్రాన్ ఆల్గోరిథమ్‌ను కనుగొన్నప్పుడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు పునాది పడింది. 1950లలో అదే సమయంలో అలెన్ ట్యూరింగ్, కంప్యూటింగ్ మిషినరీ అండ్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై ఒక పత్రాన్ని ప్రచురించారు. మానవ మేధస్సు, ప్రవర్తనను అనుకరించే యంత్రాన్ని సృష్టించే లక్ష్యంతో ఈ పత్రాన్ని రూపొందించారు. తర్కం, తార్కికత, మాట్లాడడం, సంభాషణ, అవగాహన, అసంకల్పిత చర్య వంటివాటి విషయంలో మానవ మేధస్సుతో సమానమైన యంత్రాలను రూపొందించాలన్నది ఎంతో కాలంగా పరిశోధకుల లక్ష్యంగా ఉంటూ వచ్చింది. మేధో యంత్రాల రూపకల్పన యంత్రాలను రూపొందించాలన్న భావన తొలుత ప్రధానంగా పరిశోధకుల ఆలోచనల్లో, సైన్స్ ఫిక్షన్ సినిమా రూపకర్తలలో మొగ్గతొడిగింది. 1996-97 కాలంలో , డీప్ బ్లూ అనే పేరుగల ఐబిఎం కంప్యూటర్, చెస్ పోటీలో చెస్ ఛాంపియన్ గ్యారీ కాస్పరోవ్‌ను ఓడించింది. ఈ డీప్‌బ్లూ యంత్రం గొప్ప విజయం సాధించిన ప్పటికీ ఇందుల్లో, సంభాషణ, చూపు వంటి లోతైన మానవ అవగాహనలకు సంబంధిం చినదేదీ లేదు. చాలా వరకు ఈ యంత్రం చేసిన పని తార్కికమైనది.

గత కొన్ని దశాబ్దాలలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులను చూసింది. ఇది బిగ్ డేటా మద్దతుతో కృత్రిమ మేధస్సు ఆవశ్యకతను తిరిగి మన ముందుకు తీసుకు వచ్చింది. 1960-70 దశకం అంతర్జాతీయంగా డిజిటలైజేషన్ పెద్దఎత్తున సాగిన దశ. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ నుంచి రిటైల్ రంగం వరకు అన్ని రంగాలూ పేపర్ లావాదేవీల నుంచి ఎలక్ట్రానిక్ లావాదేవీల విధానంలోకి మారుతూ వచ్చాయి. ఇది సహేతుక ధరకు పెద్ద ఎత్తున డేటా నిల్వ, భారీ స్థాయిలో గణనతో కూడిన భారీ సమాచారానికి వీలు కల్పించింది. ఈ పరిణామం, బిగ్ డేటా అన్న పదం రూపకల్పనకు అవకాశం కల్పించింది. దీనితో పెద్ద మొత్తంలో సమాచారాన్ని ప్రాసెస్ చేసి, విశ్లేషించడానికి ఇది వీలు కల్పించింది. బిగ్ డేటా, పెద్ద మొత్తంలో గణన. తక్కువ ఖర్చుతో సమాచారాన్ని భద్రపరిచే సౌలభ్యం వంటివి కృత్రిమ మేధస్సు రంగానికి కొత్త ఊపిరిలూదాయి.

నూతన కృత్రిమ మేధస్సు ఆవిర్భావానికి డీప్ లెర్నింగ్ ఆల్గోరిథమ్ ను కనుగొనడం కారణమని కొందరు విశ్వసిస్తారు. డీప్ లెర్నింగ్ ఆల్గోరిథమ్ పర్యవేక్షణలో మల్టీలేయర్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లను (ఎ.ఎన్.ఎన్) 1965లోనే కనుగొన్నారు. పెద్ద ఎత్తున కృత్రిమ మేధస్సు వ్యవస్థల రూపకల్పనకు ఆ కాలంలో పెద్ద మొత్తంలో గణన వ్యవస్థలు గానీ, గిగాబైట్స్, టెరాబైట్స్ డేటా గానీ లేదు. మాట్లాడడానికి సంబంధించిన అంశాలు, సంభాషణలను అర్థం చేసుకోవడం, ఆసంభాషణలకు అనుగుణంగా తగిన సమాధానాలు ఇవ్వడం వంటివి చాలా సంక్లిష్టమైన అంశాలని భావిస్తూ వచ్చారు. ఐబిఎం కు చెందిన ప్రశ్న. జవాబులు చెప్పే వ్యవస్థ, వాట్సన్, 2011లో జియోపార్డీ గేమ్‌లో ఇద్దరు ప్రముఖులను ఓడించింది. జియోపార్డీ అనేది అమెరికన్ టెలివిజన్‌లో ప్రసారమైన కార్యక్రమం. ఇందులో ముందుగా సమాధానాలు ఇస్తారు. దానితో పాటు ఇచ్చే క్లూల ఆధారంగా పోటీదారులు తగిన ప్రశ్నలను రూపొందించాలి.

ఇక, మనుషులు నిర్వహించే అత్యంత క్లిష్టమైన పని తమ చూపుతో వస్తువులను గుర్తించడం,అయితే 2012లో కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ ఒకటి, ఇమేజ్ నెట్ వారి దృశ్యాల వర్గీకరణ పోటీలో పెద్ద మార్జిన్‌తో విజయం సాధించింది. స్టాన్‌ఫోర్డ్ విశ్వ విద్యాలయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్‌ను రూపొందించింది. ఇది కృత్రిమ మేధస్సు వ్యవస్థలు మానవులు చేసే పనులైన స్వరగుర్తింపు, దృశ్యాలను గుర్తించడం వంటి వాటిని ఏమేరకు నెరవేరుస్తున్నాయో కొలుస్తుంది. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన అత్యుత్తమ వ్యవస్థలు ఈకొలమానం ప్రకారం మంచి పనితీరు కనబరచినట్టు గుర్తించారు.

## కృత్రిమ మేధస్సు భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది?

మనం ఆరోగ్య సంరక్షణ రంగాన్నే తీసుకుంటే, భారతదేశంలో ప్రతి వెయ్యిమంది ప్రజలకు ఒకరు కంటే తక్కువ (0.725) ఫిజీషియన్లు ఉన్నారు. స్పెషలిస్టుల సంఖ్య ప్రతి వెయ్యి మంది ప్రజలకు చూస్తే చాలా తక్కువ. ఏటా వైద్య విద్య పూర్తి చేసుకుని వైద్యవృత్తిలోకి వస్తున్న వారి సంఖ్యను గమనించి చూసినపుడు, సమీప భవిష్యత్తులో ఈ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించకపోవచ్చు. అందువల్ల, చాలావరకు గ్రామీణ ఆరోగ్యకేంద్రాలు వైద్యుల కొరతను ఎదుర్కొనే పరిస్థితి. క్షేత్రస్థాయిలో వీటిలో నర్సులు ఉంటారుకానీ వైద్యుల కొరత ఉండే అవకాశం ఉంది. మారుమూల గిరిజన ప్రాంతాలలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఇక క్లినికల్ స్పెషలిస్టులైన రేడియాలజిస్టులు, పాథాలజిస్టుల కొరత కూడా ఉంది. రోగ నిర్ధారణలో వీరికి వివిధ రకాల ఇమేజ్‌లు ఉపయోగపడతాయి. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వ్యవస్థలు ఇమేజ్ గుర్తింపుకు సంబంధించి అద్భుత పనితీరు కనబరిచిన విషయాన్ని మనం తెలుసుకున్నాం. ఇక్కడ బిగ్‌డేటా ఆధారిత కృత్రిమ మేధస్సు నిపుణుల కొరతను అధిగమించి, క్షేత్రస్థాయిలోని వైద్యసిబ్బందికి ఎంతో సహాయపడుతుంది. ఇది రేడియాలజిస్టులు, పాథాలజిస్టుల విలువైన సమయాన్ని ఆదా చేసి తక్కువ సమయంలో ఎక్కువ కేసులు పరిశీలించడానికి వీలు కల్పిస్తుంది. ఇందుకు అవసరమైన సమాచారాన్ని కృత్రిమ మేధస్సు అందిస్తుంది. క్లినికల్ స్పెషలిస్టులు సంక్లిష్టమైన అంశాలపై దృష్టిపెట్టడానికి సమయయం దొరుకుతుంది. ఇలా కృత్రిమ మేధస్సు నిపుణుల విలువైన సమయాన్ని ఆదా చేసి వారి సేవలు మరింత మందికి ఉపయోగపడేలా చేస్తుంది.




రోగికి గల రోగలక్షణాలు, తీవ్రత తెలుసుకునే క్రమంలో నర్సు, రోగి నుంచి సేకరించిన కీలక సమాచారాన్ని కృత్రిమ మేధస్సుతో అనుసంధానమైన తన చేతిలోని పరికరంలో నిక్షిప్తం చేసినపుడు కృత్రిమ మేధస్సు, ఈ సమాచారం ఆధారంగా ఇందుకు అవసరమయ్యే చికిత్స గురించి, తగిన మందుల గురించి సమాచారం ఇస్తుంది. ఇలా నర్సు, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ ద్వారా ఒక నిపుణుడైన వైద్యుడు సూచించే మందుల వంటి వాటిని సూచించడానికి వీలు కలుగుతుంది. అంతేకాదు, ప్రస్తుత పేషెంట్‌కు ఇది ఎక్కువగా సరిపోదని అనుకున్నప్పుడు నర్సు కృత్రిమ మేధస్సు అందించే సూచచనలను నిరాకరించనూ వచ్చు. మొత్తానికి కృత్రిమ మేధస్సు వ్యవస్థ, తన వద్ద నిక్షిప్తమైన పెద్ద మొత్తంలోని సమాచారాన్ని విశ్లేషించి సూచనలు చేస్తుంది. వేలాది మంది రోగుల సమాచారం, వారికి సిఫార్సు చేసిన మందులు, ప్రస్తుత పేషెంట్‌కు గల రోగ లక్షణాలు వంటి వాటిని పరిశీలించి, సరిపోల్చుకుని సిఫార్సులు చేస్తుంది. దీనితో వైద్య రిపోర్టుల పరిశీలనకు వైద్యులకు ఎక్కువ సమయంపట్టదు. ఫలితంగా మామూలు కన్నా ఎక్కువమంది రోగులను చూడవచ్చు. ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతదేశంలో పెద్ద ఎత్తున నిపుణుల కొరత ఉన్న దశలో కృత్రిమ మేధస్సు వ్యవస్థలు పౌరులకు మెరుగైన సేవలు అందడానికి ఉపకరిస్తాయి.

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆండ్రూ నెగ్,కృత్రిమ మేధస్సును నూతన విద్యుత్తుగా అభివర్ణించారు. వంద సంవత్సరాల క్రితం ప్రతి రంగాన్నీ విద్యుత్ ఎలా ప్రభావితం చేసిందో, రానున్న సంవత్సరాలలో కృత్రిమ మేధస్సు ప్రభావంతో మార్పులకు లోను కాని పరిశ్రమ ఏదైనా ఉంటుందని తాను అనుకోనని వారు అంటారు. మన దేశం విషయంలో కృత్రిమ మేధస్సు ఉపయోగాలు అపరిమితమని చెప్పుకోవచ్చు.

కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినపుడు పాత సాంకేతికత కనుమరుగౌతూ వచ్చినట్టే, కృత్రిమ మేధస్సు అందుబాటులోకి వచ్చినపుడు, ప్రజల జీవన విధానంలో, పనితీరులోనూ మార్పు కనిపిస్తుంది. గతలో బ్యాంకింగ్, ఇతర రంగాలలో కంప్యూటర్లను ప్రవేశపెట్టినపుడు వాటికి వ్యతిరేకకంగా నిరసనలు వెల్లువెత్తిన సందర్భాలున్నాయి. కంప్యూటర్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చాయి. ఇది భారతదేశాన్ని ఐటి రంగంలో గ్లోబల్ లీడర్‌గా చేసింది. భారతదేశానికి చెందిన పలు ఐటి సంస్థలు అంతర్జాతీయంగా పేరెన్నికగన్న ఐటి కంపెనీలతో గట్టి పోటీ పడుతున్నాయి. గరిష్ఠస్థాయిలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులతో భారతదేశం ఈరంగంలోనూ నాయకత్వస్థానంలో ఉంది. కంప్యూటర్లను ప్రవేశపెట్టినపుడు భారతదేశంలో ఐటి నైపుణ్యాలు కలిగిన వారెవరూ లేరు. కానీ ఇవాళ ఐటి నిపుణులకు భారతదేశం పెట్టింది పేరు. అలాగే కృత్రిమ మేధస్సు కారణంగా కొన్నిరకాల ఉద్యోగాల అవసరం ఉండకపోవచ్చు. కానీ కొత్త నైపుణ్యాలు కొత్త

అవకాశాలను కల్పిస్తాయి. ఇందుకు అనుగుణంగా ప్రజలను కొత్త నైపుణ్యాలతో సమాయత్తం చేయడంలో ప్రభుత్వం కీలక పాత్ర వహించవలసి ఉంది. తయారీ రంగానికి సంబంధించి కృత్రిమ మేధస్సు వల్ల సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులు తక్కువ ఉత్పాదక ఉద్యోగాలకు బదులు ఎక్కువ ఉత్పాదకత కలిగిన ఉద్యోగాలను కల్పించనున్నాయి.

కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, బిగ్ డేటా ఆధారిత కృత్రిమ మేధస్సును గ్రామీణ ప్రాంతాలలోని నర్సులకు సాధికారత కల్పించేలా గ్రామీణ ఆరోగ్య రంగంలో ఉపయోగంలోకి తీసుకురావాలంటే, అందుకు కొన్ని మార్పులు అవసరం.ఏ కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా వాటి సక్రమ నిర్వహణకు కొన్ని మార్పులు చేసుకోవలసి ఉంటుంది. ఏ కొత్త సాంకేతిక పరిజ్ఞానం విజయమైనా వైఫల్యమైనా దీనితో ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు గ్రామీణ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమి మేధస్సు వ్యవస్థల సాయం తీసుకోదలచినపుడు ఈ పరికరాల వినియోగంలో నర్సులు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవలసి ఉంటుంది. రోగికి సంబంధించిన రోగలక్షణాలు,ఇతర వివరాలను సక్రమంగా నమోదుచేయడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంను ఉపయోగించగల నేర్పు వారికి ఉండాలి. ఇందుకు నైపుణ్యాభివృద్ధిపై దృష్టిపెట్టడం అవసరం. ఈ నైపుణ్యాలు లేకుంటే నూతన సాంకేతిక పరిజ్ఞానం వృధా అవుతుంది, ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోకపోతే అది ఉద్యోగాలు కోల్పోవడానికీ దారితీస్తుంది. రోగికి సేవలు అందించడంలో నైపుణ్యం ఉన్నట్టుగానే నర్సులు కృత్రిమ మేధస్సుఅనుసంధానిత పరికరాల వినియోగంలో నైపుణ్యం సాధించాల్సి ఉంటుంది.

**భారత్‌లో పరిస్థితి**

ప్రస్తుత బడ్జెట్‌లో కృత్రిమ మేధస్సు రంగంలో అభివృద్ధిసాధనకు సంబంధించిన ప్రస్తావన ఉంది. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారుతోందని. ఇందుకు సంబంధించి నూతన సాంకేతిక పరిజ్ఞానాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొంది. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటివి భారతదేశం విజ్ఞానాధారిత డిజిటల్ సమాజం ఏర్పాటుకు వీలు కల్పిస్తుందని పేర్కొంది. ఈ దిశగా కృత్రిమ మేధస్సు రంగంలో పరిశోధన , అభివృద్ధి తదితర విషయాలలో మన కృషిని ముమ్మరం చేసేందుకు నీతి ఆయోగ్ ఒక జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందనీ ప్రస్తావించడం జరిగింది.

కృత్రిమ మేధస్సు అనేది ఇవాళ ఒక వ్యూహాత్మక సాంకేతిక పరిజ్ఞానంగా పరిగణింపబడుతోంది. ఇది వేగవంతమైన ఆర్థిక వృద్ధికి, ప్రపంచదేశాల అభివృద్ధికి దోహదపడుతుంది. పలు దేశాలు ఇప్పటికే కృత్రిమ మేధస్సు రంగంలో వేగవంతమైన వృద్ధికి తగిన విధానాలు తీసుకువచ్చాయి.కృత్రిమ మేధస్సు ప్రభావం కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలపైనా ఉంటుంది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, బిగ్‌డేటా రంగంలో భారతదేశం నాయకత్వ స్థానంలో ఉన్నప్పటికీ, కృత్రిమ మేధస్సు రంగంలో మాత్రం ఆ స్థానాన్ని ఇంకా పొందలేదు. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పరిశోధన విషయంలో ఎన్నో గొప్ప గొప్ప ఉదాహరణలను మనం గమనించవచ్చు. పరిశోధనశాలలు, అకడమిక్ రంగం, స్టార్టప్‌లు, ప్రవేటు రంగంలో ఇందుకు సంబంధించిన కృషి గణనీయంగా జరుగుతోంది. మరోవైపు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నవారికి కృత్రిమ మేధస్సు వినియోగానికి సంబంధించిన సాంకేతిక పరమైన అవగాహన అంంతంత మాత్రంగా ఉంటోంది. కృత్రిమ మేధస్సును వినియోగం తీసుకువచ్చి ఈరంగంలో వేగవంతమైన వృద్ధిసాధించాలంటే అందుకు ఈరంగంతో ముడిపడిన వారందరి మధ్య సమన్వయం ఉండాలి. అంతర్జాతీయంగా కృత్రిమ మేధస్సు రంగంలో భారతదేశాన్ని నాయకత్వ స్థానంలో నిలపడానికి ఎలాంటి చర్యలు అవసరమో పరిశీలిద్దాం.

యాక్సెంచర్ అధ్యయనం ప్రకారం, వివిధ రంగాలలో అద్భుతమైన ప్రగతిసాధించాలంటే అందుకు విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లు, పెద్ద కంపెనీలు, విధాన నిర్ణేతలు, మల్టీస్టేక్ హోల్డర్ల కలిగిన భాగస్వామ్యాలు కీలకమైనవి. అయితే ఇందులో చాలా అంశాల విషయంలో భారతదేశం బలమైన పునాదులు కలిగి ఉంది. భారతదేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనశాలలు గత 40 సంవత్సరాలుగా కృత్రిమ మేధస్సు రంగంలో విశేష కృషి చేస్తున్నాయి. ప్రపంచంలోని పెద్ద ఐటి కంపెనీలలో కొన్ని భారతదేశంలనివే. పలు అంతర్జాతీయ బహుళజాతి సంస్థలకు చెందిన అభివృద్ధి కేంద్రాలు, పరిశోధన కేంద్రాలను భారతదేశంలో ఇప్పటికే ఏర్పాటు చేశాయి.దేశంలో వెంచర్ కాపిటల్ ఫండ్స్, స్టార్టప్ కంపెనీలు పెద్ద సంఖ్యలో క్రియాశీలంగా ఉన్నాయి. స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వం ఎంతో మద్దతునిస్తోంది. నవకల్పనలను మరింత ప్రోత్సహించేందుకు నీతి ఆయోగ్ పలు చర్యలు తీసుకుంటోంది. అటల్ ఇన్నొవేషన్ మిషన్ (ఎఐఎం) కార్యక్రమం కింద పాఠశాలల్లో ప్రయోగశాలల ఏర్పాటు, స్టార్టప్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా ఇంక్యుబేషన్ సెంటర్లను ప్రమోట్ చేస్తున్నారు. వెంచర్ కాపిటల్ ఫండ్స్, స్టార్టప్ కంపెనీల మధ్య భాగస్వామ్యం చాలావరకు ఉంటోంది. అయితే ఇందుకు సంబంధించిన సమాచారమే ఒక క్రమపద్ధతిలో లేదు.

వివిధ సంస్థల భాగస్వామ్యం, సహకారంతో దేశంలో కృత్రిమ మేధస్సు రంగం అద్భుత ప్రగతికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. స్టార్టప్ కంపెనీలకు లోతైన పరిశోధనలకు అవకాశం ఉండదు. ఈ విషయంలో పరిశోధకుల కృషి వారికి అందుబాటులోకి వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వం వివిధ స్థాయిలలో భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు చర్యలు

*తరువాయి **29** పేజీలో*

# మారుతున్న భారతీయ రైల్వేల ముఖ చిత్రం

- డాక్టర్ శశికళా పుష్ప
- డాక్టర్ బి.రామస్వామి




**ఆసియాదేశాల్లో చూస్తే మన రైల్వే వ్యవస్థ రెండో అతి పెద్ద వ్యవస్థ కాగా, ప్రపంచ దేశాల్లో నాలుగో అతి పెద్ద వ్యవస్థ. 19వేల రైళ్ళు ప్రతిరోజూ, ప్రతిగంటా, 7112 స్టేషన్లగుండా పరుగెడుతూ కన్పిస్తాయి. మొత్తం 13 లక్షల మంది ఉద్యోగులు దీనిలో పనిచేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతీయ రైల్వేలో కేవలం 10 వేల కిమీ రైలుమార్గం కొత్తగా రాగా, అదేకాలంలో చైనాలో 50 వేల కిమీ రైలుమార్గం అదనంగా వచ్చింది. భద్రత ప్రమాణాలపై అనిల్ కాకోద్కర్ కమిటీ సిఫార్సులు ఇంకా సంపూర్ణంగా అమలుకు నోచుకోలేదు.**

**భారతదేశంలో 'రైళ్ళు' అంటే - ఇక్కడ ఎక్కి అక్కడ దిగేవి మాత్రమే కావు. పట్టాలనే ఇనుపదారంతో సమస్త భారతావనిని ఏకవస్త్రంగా నేసిన వ్యవస్థ అది.** కులమతాలు, భాషాభేదాలు, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలున్న ప్రజలందరినీ ఆప్యాయంగా చంకనెక్కించుకుని నిత్యం నిర్విరామంగా తిరిగే దృశ్యాన్ని చూసిన ఓ మేధావి దీనిని - 'చక్రాలపై తిరిగే భారతదేశం' అని అభివర్ణించాడు. మన శరీరంలో నాడీమండలం ఎలాగో మనదేశం నలుమూలలా అలా అల్లుకుపోయిన రైల్వేలు కటికపేదలనుండి ఆగర్భ శ్రీమంతులవరకు అందరి జీవితాలతో పెనవేసుకుపోయాయి. అందుకే ఆసియాదేశాల్లో చూస్తే మన రైల్వే వ్యవస్థ రెండో అతి పెద్ద వ్యవస్థ కాగా, ప్రపంచ దేశాల్లో నాలుగో అతి పెద్ద వ్యవస్థ. 19వేల రైళ్ళు ప్రతిరోజూ, ప్రతిగంటా, 7112 స్టేషన్లగుండా పరుగెడుతూ కన్పిస్తాయి. మొత్తం 13 లక్షల మంది ఉద్యోగులు దీనిలో పనిచేస్తున్నారు. ఇది కేవలం మనుషులను, సరుకులను ఒక ప్రాంతంనుండి మరో ప్రాంతానికి చేరవేసేది మాత్రమే కాదు, మనదేశ ఆర్థిక, సామాజికాభివృద్ధిలో భారతీయ రైల్వే చాలా కీలక పాత్ర పోషిస్తున్నది.

మారుతున్న ప్రపంచ పోకడలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న అవసరాలకు తగ్గట్టుగా మన దేశంకూడా మారుతున్నది. మన రైల్వే వ్యవస్థకూడా మారుతున్నది. వాటికనుగుణంగా లెక్కలు మారుతున్నాయి. అలాగే భవిష్యత్ అవసరాలు కూడా మారుతున్నాయి. అవేమిటో చూపడమేఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

## 2018-19కి రైల్వేబడ్జెట్

2018-19లో కేంద్రప్రభుత్వం భారతీయ రైల్వేపద్దు కింద రు.1,48,528కోట్లు కేటాయించింది. దీనితో అన్ని రైళ్ళలో వై-ఫై, సిసిటివి ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన, 25వేలమందికి పైగా ప్రయాణికులు రాకపోకలుసాగించే అన్ని రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్ సౌకర్యం, కొత్తగా 12వేల వ్యాగన్లు, 5160 కోచ్‌లు, 700 రైళ్ళ సేకరణ వంటి ఏర్పాట్లతోపాటూ రైలుమార్గం నిర్వహణ, భద్రతవంటి అంశాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు.

ఆరు వందల పెద్ద రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపట్టడం జరిగింది. బెంగళూరు మెట్రోకు రూ.17వేల కోట్లు, ముంబాయి శివారు రైళ్ల

గౌరవ పార్లమెంటు సభ్యురాలు (రాజ్యసభ)
E-mail : sasikalapushpamprs@gmail.com
మాజీ ప్రో-వైస్ ఛాన్సలర్, ఏపీజీ సిమ్లా యూనివర్సిటీ.

అభివృద్ధికి రు.11వేల కోట్లు కేటాయింపు, భవిష్యత్తులో రాబోయే హైస్పీడ్ రైళ్ళవ్యవస్థకు అవసరమయిన సిబ్బందిని సిద్ధంచేసుకోవడానికి వడోదరలో ఒక శిక్షణా సంస్థ ఏర్పాటు, 36వేల కి.మీ రైలుమార్గం పునరుద్ధరణ, రెండేళ్ళలో 4267 మానవరహిత రైల్వే క్రాసింగ్‌ల తొలగింపు, 4వేల కి.మీల రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ, తూర్పు, పశ్చిమ రైల్వే జోన్లలో కేవలం సరుకు మాత్రమే రవాణా చేపట్టడానికి ఉద్దేశించిన మార్గాల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

## రైల్వే వ్యవస్థలో తరచూ ఎదురయ్యే సవాళ్ళు :

అభివృద్ధి ఎంత చురుగ్గా జరుగుతున్నా, ప్రగతి పథానికి అడ్డొచ్చే సవాళ్ళుకూడా అధికంగానే ఉంటున్నాయి. వాటిలో ప్రధానమైనవి...

## విస్తరణ, ఆధునికీకరణల నత్తనడక:

గతంతో పోలిస్తే ప్రయాణికులు పెరుగుతున్నారు. రైలుమార్గాలు పెరుగుతున్నాయి. కానీ మౌలిక సదుపాయాల అభివృద్ధి మాత్రం మందకొడిగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతీయ రైల్వేలో కేవలం 10 వేల కిమీ రైలుమార్గం కొత్తగా రాగా, అదేకాలంలో చైనాలో 50వేల కిమీ రైలుమార్గం అదనంగా వచ్చింది. డబుల్ లైన్లు... అంతకంటే ఎక్కువ ఉండే మార్గాలు గత మూడు దశాబ్దాల్లో 52 శాతం మాత్రమే పెరిగాయి. ఈరోజున అది కేవలం 30–32 శాతంగా ఉంది. ప్రస్తుతం మౌలిక సదుపాయాల పరిస్థితి ఎలా ఉందంటే –మొత్తం 1129 సెక్షన్లలో 40 శాతం రైలుమార్గాల్లో లైను సామర్థ్యం కంటే 100 శాతం మించి నడపాల్సిన పరిస్థితి.

## రైలుప్రమాదాలు :

ప్రపంచదేశాలతో పోలిస్తే మన రైళ్ళ ప్రమాదాలు ఎక్కువగానే ఉంటున్నాయి. ఇవి ఎక్కువగా మానవ తప్పిదాలవల్ల, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్నాయి.

## టిక్కెట్ లేని ప్రయాణాలు :

రైల్వే వ్యవస్థ ఎదుర్కొంటున్న అతి పెద్ద జటిలసమస్య– ప్రయాణికులు టిక్కెట్టులేకుండా ఎక్కువసంఖ్యలో ప్రయాణించడం. దీనివల్ల ఏటా రు.5కోట్ల నష్టం వాటిల్లుతున్నది.

## ఆర్థిక సమస్యలు :

ఒక పక్క దీనిని స్వయంసమృద్ధంగా చేయాలన్న సంకల్పం, మరోపక్క పేదలకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థగా దీన్ని నిర్వహించాలన్న డిమాండ్‌ల మధ్య ప్రయాణికుల చార్జీలు ఎప్పటికప్పుడు వ్యయాలకు అనుగుణంగా పెంచకపోవడం, ఆర్థికంగా లాభసాటికాని మార్గాల్లోకూడా కొత్తమార్గాలను, రైళ్లను ఏర్పాటుచేయడం జరుగుతున్నది.



ఏళ్ళతరబడి పెరగకుండా ఉన్న ప్రయాణికుల చార్జీలతో ఆ లోటును భర్తీచేయడానికి సరుకు రవాణా చార్జీలను పెంచాల్సివస్తున్నది. కానీ ఈ రెండింటిమధ్య తేడా పెరిగి రైళ్ళ నిర్వహణపై దాని ప్రభావం పడుతున్నది. ప్రీమియం రైళ్ళలో ప్రయాణికుల రైలు చార్జీలు పెంచాలని ఇటీవల తీసుకున్న నిర్ణయంవల్ల కొంత ఊరటలభిస్తున్నది. కానీ సరుకు రవాణా వ్యవస్థను బాగా విస్తరించాలన్న నిర్ణయం రైల్వేకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నది.

## నిర్వహణా సామర్థ్యం :

భారతీయ రైల్వేలో 13లక్షలమంది ఉద్యోగులున్నారు. వీరి కార్మిక సంఘాలుకూడా బలంగానే ఉన్నాయి. పాలన కేంద్రీకృతం కావడంతో అధికార యంత్రాంగంలో చిన్న చిన్న నిర్ణయాలు తీసుకోవడానికి, సమస్యలు పరిష్కరించడానికి ఏళ్ళూపూళ్ళూ పడుతున్నది. పదవీ విరమణ చేసేవారికి, సర్వీసులో ఉన్నవారికి 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం రు.28వేల కోట్లు ఇవ్వాల్సి రానుండడంతో ఖర్చులు పెరిగి ఆపరేటింగ్ నిష్పత్తిపై దాని ప్రభావం ఘోరంగాపడే అవకాశం ఉంది.

## ఆర్థికసాయం : జమాఖర్చులు

భారతీయ రైల్వే రెవిన్యూ వ్యయంమీద భారీగా ఖర్చుచేస్తుండగా ప్రగతివ్యయానికి అవకాశం తక్కువగా ఉంటున్నది. ప్రగతి వ్యయానికి దాని నిధులు అదే సమకూర్చుకుని ప్రభుత్వేతర వనరులను కొత్తగా వెతుక్కుంటే తప్ప నిధుల సేకరణలో గణనీయమైన మార్పు కనిపించదు. అదెప్పుడు సాధ్యం?

రైల్వేలు సమర్ధనీయమైన వ్యవస్థగా నడుస్తూ చక్కటి ఆరోగ్యకరమైన జమాఖర్చుల పట్టికతో కన్పిస్తే రుణాలు సమకూరుతాయి. అందుకే 2019నాటికి రు.8.56 లక్షలకోట్ల పెట్టుబడులను ఆకర్షించేదిశగా మంత్రిత్వశాఖ అడుగులు వేస్తున్నది.

## పాతరైలుమార్గాలు, దుర్భరమైన రైళ్ళు

రైలుమార్గాలు పాతబడిపోయాయి. దీనితో ఘోరరైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం టైంటేబుల్లో రైళ్ళ వేగం పెంచుకుంటూ పోతున్నారు. అగ్రరాజ్యాలు సయితం వేగం తగ్గిస్తుంటే మనం పెంచుకుంటూ పోతున్నాం.

## యాజమాన్యం

యాజమాన్యంలో ఆధునిక పోకడలు లోపించడంతో మంచి ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు, ప్రతిభ ఉన్న సిబ్బందిని ఆకర్షించలేకపోతున్నది.

## రోడ్డురవాణాతో పోటీ పడాల్సిరావడం...

ప్రయాణికుల రవాణా, సరుకురవాణా రెండింటిలోనూ రోడ్డురవాణాతో రైల్వేకుపోటీ ఎక్కువయిపోతున్నది. రెండింటి మధ్య సమన్వయ లోపంతో రైల్వేల సంపాదన సామర్థ్యం తగ్గుతున్నది. దానితోపాటూ రైళ్ళరాకపోకలు కూడా ఆలస్యమవుతున్నాయి. ప్రయాణికులకు దీనివల్ల అసౌకర్యం ఏర్పడుతున్నది.

## మార్కెట్ సైజ్

ఏప్రిల్-నవంబర్ 2017 మధ్యకాలంలో ప్రయాణికుల సంఖ్య 0.68 శాతం (55కోట్ల, 43లక్షలకు) పెరిగింది. ఇదేకాలంలో మొత్తం రెవిన్యూ 5.68 శాతం పెరిగింది. ప్రయాణికుల ద్వారా వచ్చే రెవిన్యూ 5.24 శాతం పెరగ్గా సరుకు రవాణాద్వారా 8.01 శాతం పెరిగింది.

## పెట్టుబడులు

ఏప్రిల్ 2000 నుండి సెప్టెంబరు, 2017 మధ్యకాలంలో రైల్వేలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో (ఎఫ్‌డిఐ) 89.69 లక్షల డాలర్లు వచ్చాయి.

## రైల్వేరంగంలో పెద్దమొత్తం పెట్టుబడులు

సూరత్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, పునర్ అభివృద్ధికి రు.4650కోట్లు ప్రకటించబోతున్నారు. మొత్తం 100 రైల్వే యార్డులకుగాను, 40యార్డ్‌లను స్మార్ట్‌యార్డ్ లుగా అభివృద్ధిచేయడానికి రు.3వేల కోట్లుపెట్టాలని రైల్వే యోచిస్తున్నది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడే ఐరోపా నియంత్రణ వ్యవస్థ నమూనాను అనుసరించ డానికి కూడా పెట్టుబడులు భారీగా పెట్టాలని ప్రతిపాదిస్తున్నారు.

## సిఫార్సులు/అవసరమైన సంస్కరణలు

కొత్త సరుకుల వర్గీకరణ, ట్రాఫిక్ హేతుబద్ధీకరణ, బొగ్గురవాణా రేటు క్రమబద్ధీకరణ, కంటైనర్ల పద్ధతిలో రవాణా సేవల విస్తరణ, స్టేషన్లవారీగా రేట్లను నిర్ధారించడానికి కొత్త విధాన సూత్రాలు, సరుకుదించిన తరువాత ఖాళీగా తిరిగివెళ్ళే గూడ్స్ రైళ్ళలో సరుకు రవాణా రేట్లతగ్గింపు, ఇనుప ఖనిజం ఎగుమతిలో ద్వంద్వవిధానం ఉపసంహరణ, ఓపెన్ వ్యాగన్లద్వారా పంపే సరుకురేట్ల తగ్గింపు, సరుకు రవాణా వ్యాపారంలో డిజిటల్ చెల్లింపుల పద్ధతులు ప్రవేశపెట్టడం, ఎక్కువకాలానికి ఒప్పందం కుదుర్చుకునే సమయంలో ధరల స్థిరీకరణ, తగ్గింపు వంటి విధానాల అమలు.

## రైల్వేలో భద్రత

రైల్వేలోని పలువిభాగాల్లో భద్రతకు సంబధించి అనిల్ కాకోద్కర్ కమిటీ 106 సిఫార్సులతో ఒక నివేదిక సమర్పించింది. వీటిలో 68 సిఫార్సులను పూర్తిగా, 19ని పాక్షికంగా ఆమోదించారు. మరో 19 ఆమోదానికి నోచుకోలేదు. ఇప్పటివరకు 22 సిఫార్సులను అమలు చేసారు. మరో 20 సిఫార్సుల అమలు తుది దశలో ఉంది.

## ముగింపు

దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న భారతీయ రైల్వే... ప్రయాణికుల రవాణా, సరుకు రవాణాలను తక్కువగా అందుబాటు చార్జీల్లో అందిస్తున్న భారతీయ రైల్వే... గత రెండుదశాబ్దాలుగా మార్కెట్‌లో పోటీకి దీటుగా, దాని సామర్థ్యం మేరకు అది పనిచేయలేక పోతున్నది. ప్రయాణికుల, సరుకు రవాణావేగం పుంజుకోకపోవడం, ఆధునికీకరణ, విస్తరణ పనుల్లో ఆలస్యం కారణంగా అవసరాలకు తగ్గట్టుగా రైల్వే అభివృద్ధి సాధించలేకపోతున్నది.

అందువల్ల గతంలోనూ, వర్తమానంలోనూ పలుకమిటీలు అందించిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాల వికేంద్రీకరణపై, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై, జాతీయ ప్రాముఖ్యత ఉన్న ప్రాజెక్టులు త్వరితగతిన చేపట్టడంపై, సకాలంలో సేవలు అందించడంపై భారతీయ రైల్వే దృష్టి కేంద్రీకరించాలి. ■

*26వ పేజీ తరువాయి...*

## దేశాభివృద్ధికి దోహద పడుతున్న కృత్రిమ మేధస్సు

తీసుకోవాలి. విద్య, పరిశోధన సంస్థలు కృత్రిమ మేధస్సు రంగంలో పరిశోధనలను మరింత ముందుకు తీసుకుపోవడానికి, ఈ ఫలితాలను స్టార్టప్‌లు, పరిశ్రమ వర్గాలు ఉపయోగించుకు నేలా వాటిమధ్య భాగస్వామ్యానికి కృషి చేయాలి. అలాగే ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య తదితర రంగాలలో కృత్రిమ మేధస్సు పెద్ద ఎత్తున వినియోగానికి పరిశ్రమ వర్గాలు,అకడమిక్ వర్గాల మధ్య భాగస్వామ్యం ఉండాలి. వెంచర్ కాపిటల్ సంస్థలు, వాణిజ్య సంస్థల మధ్య అనుసంధానత కల్పిస్తూ కృత్రిమ మేధస్సు ఆధారిత సర్వీసులను, హార్డ్‌వేర్‌ను ప్రమోట్ చేసేలా చూడాలి.

రాగల దశాబ్దాలలో భారతదేశంలో కృత్రిమ మేధస్సు ద్వారా అభివృద్ధికి అద్భుత అవకాశాలున్నాయి. ఈ విషయంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర వహించనుంది. ప్రభుత్వం ఇందుకు సంబంధించిన భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించనుంది. అలాగే కృత్రిమ మేధస్సుకు సంబంధించి నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్ననేపథ్యంలో ప్రజలను ఇందుకు సన్నద్ధులను చేసి వారికి నూతన నైపుణ్యాలలో శిక్షణ నివ్వవలసి ఉంది. పాత సాంకేతిక పరిజ్ఞానం వల్ల కోల్పోయే కొన్ని ఉద్యోగాల బదులు నూతన నైపుణ్యాల వల్ల ఎన్నో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ప్రజలను ముందస్తుగా చైతన్యవంతులను చేసి వారికి నూతన నైపుణ్యాలలో శిక్షణ ఇప్పించడం ద్వారా కృత్రిమ మేధస్సురంగ విప్లవం నుంచి పెద్ద ఎత్తున ప్రయోజనాలను అందిపుచ్చు కోవడానికి అవకాశం ఉంటుంది. ■



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

**1) త్రిపుర రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎవరు?**
ఎ) సచింద్ర లాల్ సింగ్
బి) బిప్లబ్ కుమార్ దేబ్
సి) నృపేన్ చక్రబోర్తి
డి) సుధీర్ రంజన్ మజుందార్

**2) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) మేఘాలయ : కాన్ రాడ్ కొంగకల్ సంగ్మా
బి) నాగాలాండ్ : నెయి ఫియు రియో
సి) అస్సాం : సర్బానంద్ సోనోవాల్
డి) పై వన్ని (రాష్ట్రాలు : ముఖ్య మంత్రులు)

**3) 2018లో ఆస్కార్ అవార్డులు ఎవరి కిచ్చారు?**
ఎ) ఉత్తమ సినిమా & ఉత్తమ డైరెక్టర్ : ది షేప్ అఫ్ వాటర్ & గిల్లెర్ మోడెల్ టిరో
బి) ఉత్తమ నటుడు : గారి ఓల్డ్ మాన్ (దార్కేస్ట్ అవర్)
సి) ఉత్తమ నటి : ఫ్రాన్సెస్ మాక్ డార్మండ్
డి) పైవన్నీ (90వ అకాడమీ అవార్డులలో)

**4) డిస్ట్రిబ్యుటేడ్ డినయల్ అఫ్ సర్వీస్ (DDoS) ఎటాక్‌ను లక్ష్యం చేసుకున్న మాల్ వేర్‌లు ఏవి?**
ఎ) సపోషి బి) రీపర్
సి) మిరాయ్ డి) పైవన్నీ

**5) ఏ దేశ రాష్ట్రపతికి జీవితకాలం (లైఫ్‌టైం మాన్ డేట్) పదవి ఇవ్వదలిచారు?**
ఎ) చైనా రాష్ట్రపతి, షి జిన్‌పింగ్
బి) రష్యా రాష్ట్రపతి సి) USA రాష్ట్రపతి
డి) సౌత్ ఆఫ్రికా రాష్ట్రపతి

**6) US ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ షిప్ USS కార్ల్ విన్సన్ ఇటీవల ఏ దేశాన్ని సందర్శించింది?**
ఎ) జపాన్ బి) వియత్నాం
సి) మాల్దీవులు డి) మారిషస్

**7) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) LoU : లెటర్స్ అఫ్ అండర్ టేకింగ్
బి ) LIBOR: లండన్ ఇంటర్ బ్యాంకు ఆఫర్డ్ రేట్
సి) NOSTRO: (లాటిన్ భాషలో నోస్ట్రో అంటే 'మా ఎకౌంటు') మా యొక్క ఎకౌంటు మీ బ్యాంకు (విదేశీ) బుక్సలలో
డి) పైవన్నీ (PNB స్కాం సందర్భంగా వార్తల్లోకి వచ్చాయి)

**8) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) NPP: నేషనల్ పీపుల్స్ పార్టీ (19 MLAలు)
బి) UDP : యునైటెడ్ డెమోక్రాటిక్ పార్టీ (6 MLA లు)
సి) HSPDP: హిల్ స్టేట్ పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (2 MLA లు).
డి) పైవన్నీ (మేఘలయలో ఉన్న పార్టీలు, ఇటీవల అవి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెల్చుకున్న సీట్లు)

**9) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) NPF: నాగా పీపుల్స్ ఫ్రంట్ (26 MLA లు)
బి) NDPP : నేషనలిస్ట్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (BJP+NDPP గెల్చుకున్న సీట్లు: 30 MLAలు)
సి) NPP : నేషనల్ పీపుల్స్ పార్టీ (2 MLAలు)
డి) పైవన్నీ (నాగాలాండ్ ఉన్న పార్టీలు, అవి అసెంబ్లీ ఎన్నికల్లో గెల్చుకున్న సీట్లు)

**10) ఇటీవల పాకిస్తాన్ సెనేట్‌కు ఎన్నికైన కృష్ణ కుమారి కోహ్లి ఏ పార్టీకి చెందినది?**
ఎ) పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ
బి) పాకిస్తాన్ ముస్లిం లీగ్
సి) తహరీక్-ఎ-ఇన్సాఫ్ డి) ఇవేవి కావు

**11) కామన్ వెల్త్ హెడ్స్ అఫ్ గవర్నమెంట్ మీటింగ్ (CHOGM) ఏప్రిల్, 2018లో ఎక్కడ నిర్వహిస్తారు?**
ఎ) లండన్ బి) బ్రిస్బేన్
సి) జోహన్నాస్ బెర్గ్ డి) డబ్లిన్

**12) నేషనల్ ఫైనాన్సియల్ రిపోర్టింగ్ అథారిటీ (NFRA) వివరాలేవీ ?**
ఎ) సెక్షన్ 132, కంపనీస్ యాక్ట్ 2013 కింద ప్రతిపాదించబడింది.
బి) ఆడిటింగ్ వృత్తుల వారికీ స్వతంత్ర రెగ్యులేటర్‌గా వ్యవహరిస్తుంది.
సి) అకౌంటింగ్ & ఆడిటింగ్ వ్యవహారాలపై ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.
డి) పైవన్నీ

**13) 2018లో కామన్ వెల్త్ గేమ్స్ ఎక్కడ నిర్వహిస్తారు?**
ఎ) ప్యాంగ్ చాంగ్ బి) గోల్డ్ కోస్ట్, ఆస్ట్రేలియా
సి) కొలంబో డి) సోచి

**14) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) IPFT : ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ అఫ్ త్రిపుర
బి) SSP : సంఘట సోషలిస్ట్ పార్టీ
సి) NCT : నేషనలిస్ట్ కాన్ఫరెన్స్ అఫ్ త్రిపుర
డి) పైవన్నీ

**15) ఇండియా – మయన్మార్ మధ్య గల సరిహద్దులో (పొడవు :1643 కి.మి.) గల రాష్ట్రములు ఏవి?**
ఎ) అరుణాచల్ ప్రదేశ్ : (సరిహద్దు పొడవు : 520 కి.మి.)
బి) నాగాలాండ్: (సరిహద్దు పొడవు : 215 కి.మి.)
సి) మణిపూర్ : (సరిహద్దు పొడవు : 398 కి.మి.) & మిజోరం (సరిహద్దు పొడవు : 510 కి.మి.)
డి) పైవన్నీ (సరిహద్దుకి 16 కి.మీ. దూరంలో నివసిస్తున్న ప్రజలకి 'బోర్డర్ పాస్' ఇవ్వదలిచారు)

**16) వాస్తు శిల్పులకు ఇచ్చే ప్రిట్జ్‌కర్ బహుమతి ఇటీవల ఎవరికిచ్చారు?**
ఎ) ఆర్కిటెక్ట్ బాల్ కృష్ణ దోషి
బి) లే కార్బుసియర్ సి) లూయిస్ కాహాన్
డి) వీరెవరు కారు

**17) పార్కర్ సోలార్ ప్రోబ్‌ను NASA, USA ఎవరి గౌరవార్థం, పేరు పెట్టి, సూర్య గోళ అధ్యయనానికి పంపబడుతుంది?**
ఎ) యూజీన్ పార్కర్, ప్రఖ్యాత ఆస్ట్రోఫిజిసిస్ట్
బి) S.చంద్రశేఖర్ సి) గ్రెగోర్ మెండల్
డి) చార్లెస్ డార్విన్

**18) రెండవ వాటి కాన్ కౌన్సిల్ సంస్కరణలు లేక వాటికాన్ – II పూర్తి చేసిన ఎవరికీ సెయింట్ హుడ్ ప్రసాదించారు, ఇటీవల ?**
ఎ) పోప్ పాల్ VI (1960 దశకంలో)
బి) ఆర్చి బిషప్ రోమేరో సి) పోప్ ఫ్రాన్సిస్
డి) పోప్ గ్రెగొరీ

**19) ఇండియా – చైనాల మధ్య గల ద్వైపాక్షిక వాణిజ్యం 2017లో US $ 84.4 బిలియన్‌లకు చేరింది, ఈ కింది వాటిల్లో ఏ అడ్డంకులు ఉన్నాగాని?**
ఎ) చైనా – పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్.
బి) J-e-M లీడర్ మసూద్ అజహర్‌పై UN నిషేధంలో చైనా అడ్డుకోవటం
సి) NSGలో ఇండియా చేరటంలో, బీజింగ్ అడ్డుకోవటం; డోక్లాం సమస్య
డి) పైవన్నీ

**20) ప్రస్తుతం అమలులో ఉన్న 161 జిల్లాల నుండి 640 జిల్లాలకు విస్తరించనున్న 'బేటి బచావో బేటి పఢావో' స్కీంను ఎక్కడ నుండి ప్రధాన మంత్రి ప్రారంభించారు?**
ఎ) ఝుం ఝును, రాజస్థాన్.
బి) తరన్ తరన్ సి) సోనిపట్
డి) రాయ్ ఘర్

**21) మారిషస్, సింగపూర్ దేశాల తర్వాత ఏ దేశం ఎక్కువగా భారతదేశంలో పెట్టుబడులు పెడుతోంది?**
ఎ) ఇండోనేషియా బి) జపాన్
సి) బ్రూనీ డి) ఫిలిప్పీన్స్

**22) ఇండస్ట్రి 4.0 లేక నాల్గవ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (పారిశ్రామిక విప్లవం)లో గల అంశాలు ఏవి?**
ఎ) డేటా వాల్యూమ్స్
బి) కంప్యుటేషనల్ పవర్
సి) ఇంటర్‌నెట్ అఫ్ థింగ్స్; ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)
డి) పై అన్నిటి మేలు కలయికలతో

**23) 2018 అంతర్జాతీయ మహిళా దినోత్సవం 'థీం' ఏది?**
ఎ) # ప్రెస్ ఫర్ ప్రోగ్రెస్
బి) # ప్రెస్ ఫర్ ఫ్రీడమ్
సి) # ఫ్రీ ఫ్రం స్లేవరీ డి) ఇవేవు కావు

**24) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తొలి మహిళ అధ్యక్షురాలు : అనిబిసెంట్
బి) UN జనరల్ అసెంబ్లీకి మహిళ అధ్యక్షురాలు అయిన తొలి భారతీయ మహిళ : విజయలక్ష్మి పండిట్
సి) భారతదేశంలో తొలి మహిళ రాష్ట్రపతి : ప్రతిభా పాటిల్ డి) పైవన్నీ

**25) ఇండియా, బంగ్లాదేశ్, రష్యా దేశాలు త్రైపాక్షిక మెమొరాండం ఫర్ కో–ఆపరేషన్ ఏ సహకారం కోసం చేసుకున్నాయి ?**
ఎ) ఆహారధాన్యాల ఉత్పత్తి
బి) బంగ్లాదేశ్‌లో రూప్పూర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం
సి) ఆయిల్ ఉత్పదన డి) మైక్రో ఫైనాన్సు

26) స్టీల్ దిగుమతుల మీద 25 శాతం పన్ను, అల్యూమినియం దిగుమతుల మీద 10 శాతం పన్ను విధిస్తామని ఏ దేశ అధ్యక్షుడు ప్రకటించాడు ?
ఎ) కెనడా బి) USA
సి) ఆస్ట్రేలియా డి) మెక్సికో

**27) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) జపాన్ : నిక్కీ
బి) యూరప్ : STOXX 600 ఇండెక్స్
సి) BSE : సెన్సెక్స్ – 30
డి) పైవన్నీ (స్టాక్ మార్కెట్ సూచికలు)

**28) విద్యుత్‌తో నడిచే వాహనాలకు , కరెంటు సప్లై చేయటానికి e-ట్రాన్స్పోర్టేషన్‌కు ఏవి కావాలి?**
ఎ) E–హై వేస్ బి) ఇండక్షన్ ఛార్జింగ్
సి) బాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ డి) పైవన్ని

**29) పశ్చిమ కనుమల్లో ఉన్న వల్ పరాయ్ పీఠభూమి అన్నామలై కొండలు ఏ రాష్ట్ర పరిధిలోకి వస్తాయి?**
ఎ) మహారాష్ట్ర బి) తమిళనాడు
సి) గోవా డి) గుజరాత్

**30) ప్రపంచంలోనే 'దర్టియస్ట్ రివర్' (అతి మురికి నది)గా అభివర్ణించబడిన 'సిటారం' నది ఎక్కడ, ఏ దేశంలో ఉంది?**
ఎ) జావా, ఇండోనేషియా బి) మలేసియా
సి) దక్షిణ ఆఫ్రికా డి) వియత్నాం

**31) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) త్రిపుర : BJP + IPFT
బి) మేఘాలయ : BJP + NPP
సి) నాగాలాండ్ : BJP + NDDP
డి) పైవన్నీ (ఈశాన్య రాష్ట్రాలు : పార్టీల మిత్రత్వం, ప్రభుత్వ ఏర్పాటు కోసం)

**32) 'త్విప్ర' అనే పేరు గల రాష్ట్ర సాధన కోసం ఎక్కడి ప్రజలు కృషి చేస్తున్నారు ?**
ఎ) అస్సాం బి) సిక్కిం సి) త్రిపుర డి) బీహార్

**33) ఔరంగజేబ్ తనను ఖుల్దాబాద్‌లో సమాధి చేయమని అడిగాడు, అంటారు. దీని వివరాలేవీ?**
ఎ) ఖుల్దాబాద్, దౌలతాబాద్‌కి దగ్గరలో, మహారాష్ట్రలో ఉంది.
బి) ఇక్కడే 'వాలీ ఆఫ్ సెయింట్స్' ఉంది
సి) గతంలో రౌజా (shrine) అనే పేరుండేది. స్వర్గంలో జీవించేవాడు (ఖుల్ద్ – మకాని) అనే బిరుదు ఔరంగజేబ్ కిచ్చారు. ఆ విధంగా ఈ ప్రాంతానికి ఖుల్దాబాద్ అనే పేరు వచ్చింది.
డి) పైవన్నీ

**34) అశోకుని శిలా స్థూపాలు అందులో గల శాసనాలు. ఏది కరెక్ట్?**
ఎ) శిలా శాసనం 7 : ధమ్మానికి కట్టుబడి ఉండటానికి గల కారణం 'నిజాత్తియా' (పదేపదే చెప్పటం) [నియమ (చట్టం) కాదు]
బి) శిలా శాసనం 6 : లోకస్స హిత సుఖాయ (ప్రపంచంలోని అందరి సంక్షేమం, ఆనందం కోసం)
సి) శిలా శాసనం 4 : సమత (నిష్పాక్ష పాతం); వియోహాల లేక వ్యవహార సమత; దండ సమత
డి) పైవన్నీ

**35) చంద్రశేఖర కంబార దేనికి అధ్యక్షుడు?**
ఎ) సంగీత అకాడెమి బి) సాహిత్య అకాడమీ
సి) ICHR డి) CISR

**36) నీతి ఆయోగ్ రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో పుట్టిన పిల్లల్లో లింగ నిష్పత్తి (SRB : సెక్స్ రేషియో ఎట్ బర్త్) 2013–2015లో ఎంత ఉంది? (ప్రతి 1000 మంది మగ పిల్లలకి ఎంత మంది ఆడ పిల్లలు ఉన్నారు?)**
ఎ) 900 బి) 906 సి) 898 డి) 952

**37) విదేశాలలో భారత దేశానికి చెందిన ప్రభుత్వ రంగ బ్యాంకుల బ్రాంచీలు ఎన్ని ఉన్నాయి?**
ఎ) SBI: 52 బి) బ్యాంకు ఆఫ్ బరోడా: 50
సి) బ్యాంకు ఆఫ్ ఇండియా: 29 డి) పైవన్నీ

**38) నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (NSG) హెడ్ క్వార్టర్స్ ఎక్కడుంది?**
ఎ) మేహ్రాం నగర్, పాలం, న్యూఢిల్లీ
బి) డెహ్రాడూన్ సి) ముస్సోరి డి) డల్హౌసీ

**39) ఇటీవల SBI, కొన్ని ప్రైవేటు రంగ బ్యాంకులు, తమ MCLR రేట్లను 20 bps వరకు పెంచవల్సింది. ఏ కారణాల చేత?**
ఎ) RBI వడ్డీ రేట్లు పెంచటం చేత
బి) బ్యాడ్ లోన్‌ల వల్ల ప్రెజర్ పెరగటం వల్ల
సి) PSL ఎక్కువ చేయటానికి
డి) ఉద్యోగస్తుల జీతాలు తగ్గించుకోటానికి

**40) పావగాడా సోలార్ పార్క్‌ను 'శక్తి స్థల్' అంటున్నారు. దీని వివరాలేవీ?**
ఎ) 2000 MW దీని పూర్తి పొటెన్షియల్
బి) ఇది తిరుమణి, తుంకూర్ జిల్లాల్లో, కర్ణాటకలో ఉంది
సి) రూ. 16,500 కోట్ల వ్యయంతో నిర్మించారు
డి) పైవన్నీ

**41) 'ఫ్యుజిటివ్ ఎకనామిక్ ఆఫెండేర్స్ బిల్, 2018' వివరాలేవీ?**
ఎ) రూ. 100 కోట్లు అంతకన్నా ఎక్కువ విలువ గల ఆర్థిక నేరాలకి వర్తిస్తుంది
బి) స్పెషల్ కోర్ట్ ముందు ఆర్థిక నేరాలు చేసి విదేశాలకి పారిపోయిన ఒక వక్తి గురించి డిక్లరేషన్ చెయ్యటం
సి) ఆర్థిక నేరం చేసి, విదేశాలకి పారిపోయిన వ్యక్తి ఆస్తులు జప్తు చెయ్యటం
డి) పైవన్నీ

**42) సిమ్లి పాల్ టైగర్ రిజర్వు ఏ రాష్ట్రములో ఉంది?**
ఎ) సిక్కిం బి) ఒడిశా
సి) ఉత్తరాఖండ్ డి) రాజస్థాన్

**43) ఇటీవల భారతదేశాన్ని సందర్శించిన ట్రాన్ దాయ్ క్వాంగ్ ఏ దేశ అధ్యక్షుడు?**
ఎ) మంగోలియా బి) వియత్నాం
సి) తైవాన్ డి) సౌత్ కొరియా

**44) '5 స్టార్ ఉద్యమం' ఏ దేశ ఎన్నికలను ప్రభావితం చేశాయి?**
ఎ) ఇటలీ బి) కువైట్ సి) ఒమాన్ డి) ఈజిప్ట్

**45) రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నూతనంగా ఆవిష్కరించిన శక్తి వంతమైన న్యూక్లియర్ ఆయుధాలు ఏవి?**
ఎ) క్రూయిజ్ క్షిపణి, సార్ మాట్ ICBM
బి) హైపర్ సోనిక్ క్షిపణి
సి) న్యూక్లియర్ టార్పెడో; హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్
డి) పై అయిదు

**46) న్యూఢిల్లీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ సమావేశంలో భారతదేశం ఎంత విలువ గల లైన్ ఆఫ్ క్రెడిట్ అందిస్తాను అని ప్రకటించింది, 15 దేశాలల్లో గల 27 ప్రాజెక్టల కోసం? (బిలియన్ US డాలర్లలో)**
ఎ) 1.4 బి) 2.5 సి) 3.0 డి) 4.0

**47) ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ISA లో సోలార్ ఎనర్జీ రంగంలో ఉన్న ప్రధాన అంశాలు ఏవి అని ప్రకటించాడు?**
ఎ) ప్రతి దేశంలోను గల సోలార్ ఎనర్జీ పొటెన్షియల్ గుర్తించాలి
బి) ఆర్థిక సమీకరణ
సి) అనుకూలమైన ఫ్రేమ్ వర్క్‌ను కల్పించటం
డి) పై మూడు

**48) 2964 మంది సభ్యులు హాజరైన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (NPC) (చైనా దేశంలో) ఆమోదించిన రాజ్యాంగ సంస్కరణలు ఏవి?**
ఎ) షి జిన్‌పింగ్ అధ్యక్ష పదవి, జీవిత కాలం ఉంటుంది
బి) నేషనల్ సూపర్‌వైజరి కమిషన్ ఏర్పాటు (అవినీతి నిరోధక ఏజెన్సీ )
సి) చైనా రాజ్యాంగంలో 21 అంశాలను పునః పరిశీలించారు
డి) పైవన్నీ

**49) నదీ జలాల వివాద పరిష్కారాలకు సంబంధించి ఏది కరెక్ట్?**
ఎ) భాక్రా బియాస్ మేనేజ్మెంట్ బోర్డు (BBMB) : అన్ని ఆస్తులు, డ్యాంలతో సహా దీని అధీనం లో ఉంటాయి

బి) నర్మదా కంట్రోల్ అథారిటీ : అన్ని ఆస్తులు, డ్యాంలు మధ్యప్రదేశ్, గుజరాత్ అధీనంలో ఉంటాయి
సి) ఇంటర్ – స్టేట్ వాటర్ డిస్ప్యూట్ చట్టంలోని సెక్షన్ 6 A నదీ జలాల వివాద పరిష్కార స్కీం'ను ఏర్పాటు చేయాలనీ తెల్పుతుంది
డి) పైవన్నీ

**50) 'కోలుక్కు మలై ' ఎక్కడుంది ?**
ఎ) మహారాష్ట్ర
బి) కురంగిని దగ్గర (థేని జిల్లా, తమిళనాడు)
సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

**51) MGNREGA అమలు చేయటంలో, 2017-18లో 28.21 కోట్ల పని దినాలు కల్పించి ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రం ఏది?**
ఎ) పశ్చిమ బెంగాల్ బి) తమిళనాడు
సి) ఆంధ్రప్రదేశ్ డి) గోవా

**52) కేంద్ర ప్రభుత్వం ఎన్ని జిల్లాలను 'యాస్పి రేషనల్' జిల్లాలుగా గుర్తించి, వాటికీ యువ అధికారులను జిల్లా మేజిస్ట్రేట్‌లుగా నియమించదల్చింది ?**
ఎ) 115 బి) 235 సి) 640 డి) 250

**53) 'ఆఫ్రికన్ మోనాలిసా'అనే పెయింటింగ్ ఎవరు వేసారు?**
ఎ) బెన్ ఎన్ వన్ వు (నైజీరియా)
బి) ప్లాబో పికాసో
సి) బెర్నార్డ్ రూ యిజ్ – పికాస్సో
డి) లియోనార్డో డా విన్సి

**54) హైదరాబాద్‌లో ఉన్న రెసిడెన్సి బిల్డింగ్ (కోఠీ) ఎవరి కాలంలో నిర్మించారు? (దీని సిటీ మ్యూజియంగా మార్చదలిచారు)**
ఎ) బాబర్ బి) జేమ్స్ కిర్క్ పాట్రిక్
సి) మొహమ్మద్ బిన్ తుగ్లక్ డి) వారెన్ హేస్టింగ్స్

**55) రాజస్థాన్‌కి చెంద వలసిన 9 శాతం (లేక) 1.119 బిలియన్ క్యు సెక్కుల యమునా నది నీరు, ఎక్కడ నుండి విడుదల చేస్తారు?**
ఎ) తేజే వాలా హెడ్ వర్క్స్ నుండి జుంజుంను
బి) ఒక్లా హెడ్ వర్క్స్
సి) చురు & సికార్ జిల్లాలు
డి) పైవన్నీ (మొత్తం ఖర్చు : రూ. 20,000 కోట్లు)

**56) 2015-16లో సెక్స్ రేషియో ఎట్ బర్త్ (SRB) ఏ రాష్ట్రాలలో ఎంత ఉంది?**
ఎ) గుజరాత్ : 854 బి) హర్యానా : 831
సి) ఉత్తరాఖండ్ : 844 డి) పైవన్నీ

**57) ఫరీదాబాద్, హర్యానా దగ్గరున్న సూరజ్ కుండ్‌ని ఎవరు నిర్మించారు?**
ఎ) ఫిరోజ్ షా తుగ్లక్ బి) పృథ్వి రాజ్ చౌహాన్
సి) సూరజ్ పాల్ తోమార్ డి) అనంగ్ పాల్ I

**58) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) 'వై ఐ యాం హిందూ' : శశి థరూర్
బి) 'ఆరో విల్లి: ఏ సిటీ ఫర్ ది ఫ్యూచర్': అను మజుందార్
సి) 'ఫైటింగ్ ఫర్ స్టేటస్ ...' : జోనాథన్ రెన్ షన్
డి) పైవన్నీ

**59) ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (SFR) 2017 ప్రకారం, భారతదేశంలో మడ (man-grove) అడవులు ఎక్కడెక్కడ ఉన్నాయి? (పశ్చిమ బెంగాల్‌లో ఉన్న పెద్ద మడ అడవి, సుందర్ బన్స్ విస్తీర్ణం 4 ,263 చదరపు కి.మి.)**
ఎ) ఆంధ్ర ప్రదేశ్: కృష్ణ , గోదావరి జిల్లాల్లో
బి) గుజరాత్: భావనగర్, జునాగడ్, కచ్, జాం నగర్
సి) మహారాష్ట్ర : థానే, రాయ ఘర్, ముంబై సబర్బన్
డి) పైవన్నీ

**60) కావేరి నదీ జలాలు (740 tmcft) ఏ రాష్ట్రానికి ఎంతెంత వస్తాయి? (tmcft లలో)**
ఎ) కర్ణాటక : 284.75 (270 + 14.75)
బి) తమిళనాడు : 404.25 (419 – 14.75)
సి) కేరళ : 30
డి) పైవన్నీ (సుప్రీమ్ కోర్ట్ తీర్పు తర్వాత)

**61) కావేరి మేనేజ్ మెంట్ బోర్డులో ఎవరెవరు ఉంటారు? వివరాలు ఏవి?**
ఎ) ముగ్గురు హోల్ టైం సభ్యులు (కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది)
బి) నదీ పరీవాహక రాష్ట్రాలు, తమ ప్రతినిధులను నియమిస్తాయి
సి) ఇది టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు ఉన్న ఇంటర్ స్టేట్ ఫోరం డి) పైవన్నీ

**62) కర్ణాటకలో ఎక్కడ కాఫీ తోటలు ఉన్నాయి?**
ఎ) చిక్క మగళూరు జిల్లా బి) హసన్ జిల్లా
సి) కొడగు జిల్లా డి) పైవన్నీ

**63) హైదరాబాద్‌ను పాలించిన మొదటి కులీ కుతుబ్ షాహీ రాజు ఎక్కడి నుండి వచ్చాడు అంటారు? (సుల్తాన్ కులీ కుతుబ్ షా క్రీస్తు శకం 1512– క్రీస్తు శకం 1543)**
ఎ) హమాదాన్ (ఇరాన్) బి) ఇరాక్
సి) ఆఫ్ఘనిస్తాన్ డి) మేసడోనియా

**64) ప్రస్తుతం ఉన్న నేషనల్ జుడిషియల్ పే కమిషన్ చైర్మన్ ఎవరు?**
ఎ) జస్టిస్ R. బసంత్
బి) జస్టిస్ P. వెంకట్రామ రెడ్డి
సి) V.K.గుప్తా డి) ఎస్.రంగరాజన్

**65) మణిపూర్ నుండి ప్రవహిస్తున్న ట్విగెం నది మీద ఏ దేశం డ్యాం నిర్మిస్తోంది?**
ఎ) థాయిలాండ్ బి) మయన్మార్
సి) కాంబోడియా డి) లావోస్

**66) అంతరించి పోయే ప్రమాదానికి దగ్గరలో ఉన్న భారతీయ భాషలు ఏవి?**
ఎ) ఆంధ్ర పదేశ్‌లో : గడబ ; నైకీ
బి) తమిళనాడు : కోట ; తోడ
సి) కర్ణాటక : కోరగ ; కురుబు
డి) పైవన్నీ (UNESCO వారు ఇలాంటివి 42 భాషలు తెలిపారు)

**67) వరల్డ్ IT కాంగ్రెస్ (WITC) 2018 ఎక్కడ నిర్వహించారు ?**
ఎ) లాహోర్ బి) హైదరాబాద్
సి) న్యూఢిల్లీ డి) అహమ్మదాబాద్

**68) 'నేగేవ్' ఎడారి ఎక్కడుంది ?**
ఎ) USA బి) ఇజ్రాయిల్
సి) మంగోలియా డి) ఈజిప్ట్

**69) బ్రిటన్‌లో ఇచ్చే బాఫ్టా (BAFTA) అవార్డుల వివరాలు ఏవి?**
ఎ) ఉత్తమ సినిమా: త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి
బి) ఉత్తమ నటి: ఫ్రాన్సిస్ మాక్ డార్ మాండ్
సి) ఉత్తమ సహాయ నటుడు: శాం రాక్ వెల్
డి) పైవన్నీ

**70) సిరిల్ రామా ఫోసా ఏ దేశ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు?**
ఎ) కెన్యా బి) దక్షిణ ఆఫ్రికా
సి) టాంజానియా డి) నైజీరియా

**71) కుటుంబంలో మాతృస్వామ్య వ్యవస్థను పాటిస్తూ, ఆఖరి కూతురికి వంశపారంపర్య ఆస్తులను సంక్రమింపచేసే తెగలు, మేఘాలయలో ఏవి?**
ఎ) గారో బి) ఖాశీ సి) జైంటియా డి) పై మూడు

**72) 'రుస్తుం – 2' ఏమిటి? వివరాలు ఏవి?**
ఎ) మానవ రహిత ఏరియల్ వెహికల్ (విమానం లాంటిది)
బి) దీని చిత్ర దుర్గ, కర్ణాటకలో పరీక్షించారు, విజయవంతంగా
సి) ఇది 22,000 అడుగుల ఎత్తులో ఎగుర గలదు, 20 గంటలు ప్రయాణించ గలదు
డి) పైవన్నీ

**73) తమిళనాడులో ప్రధాన మంత్రి ప్రారంభించిన అమ్మా 2 – వీలర్ పథకంలో లబ్ధికి ఎవరు అర్హులు ?**
ఎ) పనిచేసే మహిళలు (ఒక లక్ష మందికి ఇస్తారు)
బి) పురుషులు సి) NRI లు డి) వీరెవరు కారు

**74) రాజ్యసభకు 16 రాష్ట్రాల నుండి ఎంపికయ్యే 58 సీట్లకు, ఎక్కడెక్కడ నుండి రానున్నారు?**
ఎ) బీహార్ : 6 బి) ఉత్తరప్రదేశ్ : 10
సి) ఆంధ్రప్రదేశ్ : 3 డి) పైవన్నీ

## జవాబులు (ఏప్రిల్ – 2018)

| | | | |
|---|---|---|---|
| 1–బి | 20–ఎ | 39–బి | 58–డి |
| 2–డి | 21–బి | 40–డి | 59–డి |
| 3–డి | 22–డి | 41–డి | 60–డి |
| 4–డి | 23–ఎ | 42–బి | 61–డి |
| 5–ఎ | 24–డి | 43–బి | 62–డి |
| 6–బి | 25–బి | 44–ఎ | 63–ఎ |
| 7–డి | 26–బి | 45–డి | 64–బి |
| 8–డి | 27–డి | 46–ఎ | 65–బి |
| 9–డి | 28–డి | 47–డి | 66–డి |
| 10–ఎ | 29–బి | 48–డి | 67–బి |
| 11–ఎ | 30–ఎ | 49–డి | 68–బి |
| 12–డి | 31–డి | 50–బి | 69–డి |
| 13–బి | 32–సి | 51–ఎ | 70–బి |
| 14–డి | 33–డి | 52–ఎ | 71–డి |
| 15–డి | 34–డి | 53–ఎ | 72–డి |
| 16–ఎ | 35–బి | 54–బి | 73–ఎ |
| 17–ఎ | 36–ఎ | 55–డి | 74–డి |
| 18–ఎ | 37–డి | 56–డి | |
| 19–డి | 38–ఎ | 57–సి | |

డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా.....

# గొప్ప దార్శనికుడు, ప్రజాస్వామ్య వాది డా॥ బి.ఆర్. అంబేద్కర్

– డొక్కా మాణిక్య వరప్రసాద్



**జనాభా నిష్పత్తి ప్రకారం చెప్పుకోదగ్గ రీతిలో పేదరికం తగ్గలేదని ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. ఈ సమస్యల సవాళ్ళను ఎదుర్కోవాలంటే అంబేద్కరిస్టులు ఆయన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి. అంబేద్కర్ విగ్రహాలను వాటేసుకుంటే సామాజిక న్యాయం రాదని రాజకీయ పార్టీలకు తెలియజేయాలి. అంబేద్కర్ విగ్రహాలు వేయటం ద్వారా కేవలం అంబేద్కర్‌ను దళితుల నాయకుడిగా చూడటంలో లోపం ఉంది. అంబేద్కర్‌ని దళితుల ప్రతినిధిగా భావిస్తూ, ఆయనలోని జాతీయ, అంతర్జాతీయ తాత్వికతను నిర్లక్ష్యం చేయటం భారత రాజకీయ వ్యవస్థలో ఒక సామాజిక లోపంగా కనిపిస్తుంది.**

భారత రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిభాష నుండి 'అంబేద్కర్' అనే పదం అవిభాజ్యమైనది. ఆయన ఆలోచనలను సమీక్షించకుండా నేడు ప్రజా జీవితం ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి. కానీ అంబేద్కరిస్టులుగా చెప్పే అనేక మంది కేవలం ఆయనను ఒక రిజర్వేషన్ల అంశంగాను, విగ్రహ ఆవిష్కరణల కార్యక్రమంగా పరిమితం చేయడం దురదృష్టకరం. కానీ అంబేద్కర్ మొత్తం ప్రభుత్వాన్ని, పరిపాలనను, సమాజాన్ని ప్రతి కోణాన్ని ప్రజాస్వామీకీకరించాలనే గొప్ప ప్రయత్నం తిరోగమన దిశగా మారడం నేటి 70 సంవత్సరాల ప్రజాస్వామ్య విషాద గాథ.

పరిపాలనాయంత్రాంగాన్ని అంటే ప్రభుత్వాన్ని ప్రజలు ఓటు వేసి ఎన్నుకోవాలి. ఆ ప్రభుత్వం చట్టబద్ధంగా పరిపాలించాలి. ఆ పాలన ప్రజల ప్రాథమిక హక్కులకు లోబడి ఉండాలి. ఈ మూడు ప్రజాస్వామ్యానికి అవసరంగా ఆయన చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి ప్రజలు పాలనలో భాగం కావాలని అంబేద్కర్ ఆకాంక్షించారు. ఇంతటి ప్రభావశీలమైన భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించారు. భారత ప్రజానీకం గౌరవంగా పిలుచుకునే పేరు 'బాబాసాహెబ్' బహుముఖ ప్రజ్ఞాశాలి, కారణజన్ముడు. బాల్యం నుంచే చదువులో దిట్ట. దళితుల్లో మొట్టమొదటి పట్టభద్రుడు. ఎంఏ ఆర్థిక శాస్త్రంలో పట్టా, డాక్టరేట్, లా డిగ్రీ సాధించడం ఆ రోజుల్లో సాధారణ విషయం కాదు.

అంబేద్కర్ ప్రజా జీవితంలో 1919లో ప్రవేశించారు. 1924 జులై 20న బొంబాయిలో అప్పుల విముక్తి కోసం భహిష్కృత హితకారిణి సభ అనే సంస్థను స్థాపించారు. ఆయన 1927లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యునిగా (ఎంఎల్‌సి) అస్పృస్యుల సమస్యలపై పోరాడారు. సుమారు 10 సంవత్సరాలు ఎంఎల్‌సిగా ఉన్నారు. ఆ సమయంలోనే మహర్ చెరువు పోరాటం నిర్వహించారు. 1930లో 'కలరాం' దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని నిర్వహించారు. 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని పేద ప్రజల హక్కులకోసం స్థాపించాడు.

దేశంలోని అన్ని రాజకీయపార్టీలు అంబేద్కర్‌ని తమవాడిగా చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దళిత ఉద్యమ కారులు, మేధావులు అంబేద్కర్ విగ్రహాల వైపు నుంచి అంబేద్కర్ భావజాలం వైపు మరలాలి. మనం ఇప్పుడు విగ్రహాలకే పరిమితమైతే రేపటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో జనాభా నిష్పత్తి

గౌరవ శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, అమరావతి.
E-mail: manikyavaraprasad@gmail.com

ప్రకారం చెప్పుకోదగ్గ రీతిలో పేదరికం తగ్గలేదని ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. ఈ సమస్యల సవాళ్ళను ఎదుర్కోవాలంటే అంబేద్కరిస్టులు ఆయన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి. అంబేద్కర్ విగ్రహాలను వాటేసుకుంటే సామాజిక న్యాయం రాదని రాజకీయ పార్టీలకు తెలియ జేయాలి. ఆయన సిద్ధాంతాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళిగా ప్రచారం చేయాలి. బాబా సాహెబ్ జీవితాంతం ఏ విలువలకోసం పరితపించారో ఆ విలువల సాకారానికి ప్రయత్నించాలని ఉద్యమకారులు ప్రభోదించాలి. కుల నిర్మూలన, దళితుల ఆర్థిక పునర్నిర్మాణం వంటి సామాజిక కోణంలో ప్రభుత్వాలు, దేశంలోని రాజకీయ పార్టీలు పనిచేయడమే అంబేద్కర్‌కి నిజమైన నివాళిగా తెలియజేయాలి. ఆయన జీవితం, పోరాటం, రచనలు సందేశాత్మకం. దీనిపై ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ వీటిని రాజకీయ పార్టీలు ఎవరి ఉద్దేశాలతో వారు అన్వయించుకుని కొందరు వెనక్కి కొందరు ముందకు లాగుతూ సామాజిక పురోభివృద్ధికి అడ్డుకాకూడదు.

అంబేద్కర్ 1950 జనవరి 26న పార్లమెంటులో మాట్లాడుతూ "మనం వైవిధ్యాల మయమైన జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో మనకి సమానత్వం వుంటుంది. ఆర్థిక జీవనంలో అసమానత వుంటుంది. రాజకీయంగా ఒక మనిషికి ఒకే ఓటు. ఒక ఓటుకు ఒకే విలువ ఉంటాయి. కానీ మన ఆర్థిక, రాజకీయ వ్యవస్థ మూలంగా మనం సామాజిక, ఆర్థిక జీవనంలో ఒక మనిషికి ఒకే విలువ అనే సూత్రాన్ని నిరాకరిస్తూనే ఉంటాం. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించి తీరాలి. లేకపోతే ఎంతో శ్రమించి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని అసమానతలు అనుభవిస్తున్న వారు ధ్వంసం చేస్తారు" అన్నారు. రాజ్యాంగ దినోత్సవాలు, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఆకాశ హర్మ్యాల వంటి అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు అంబేద్కర్ మాటలను దృష్టిలో పెట్టుకోవడం నేటి అవసరం.

1980 దాకా దేశంలో అంబేద్కర్ విగ్రహాలు వేయాలంటే కష్టంగా ఉండేది. సమాజం అంగీకరించేది కాదు. నేడు అంబేద్కర్ విగ్రహాలు వేయటానికి ప్రభుత్వాలు,రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. భారత దేశ జాతీయ నాయకుల విగ్రహాలు సాంప్రదాయ దుస్తుల్లో ఉంటాయి. అంబేద్కర్ విగ్రహం మాత్రం ఆధునికంగా కోటు, సూటుతో చేతిలో రాజ్యాంగంతో ఉంటుంది. 20వ శతాబ్దిలో అత్యంత ప్రతిభా వంతమైన ఆలోచనాపరుడు, నేటివరకు దేశంలోని రాజకీయ నాయకు లందరిలో అంబేద్కర్ అత్యంత విద్యావంతుడు. ఈ దేశంలో దళితుల ఆత్మగౌరవానికి ప్రతీక అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం. ఒకప్పుడు మరాత్వాడా యూనివర్సిటీకి అంబేద్కర్ పేరు పెట్టడానికి శివసేన లాంటి పార్టీలు అంగీకరించకపోగా దళితుల ఇళ్ళపైపడి విధ్వంసానికి, గృహ దహనానికి పాల్పడ్డారు. **అంబేద్కర్ విగ్రహాలు వేయటం ద్వారా కేవలం అంబేద్కర్‌ను దళితుల నాయకుడిగా చూడటంలో లోపం ఉంది. అంబేద్కర్‌ని దళితుల ప్రతినిధిగా భావిస్తూ, ఆయనలోని జాతీయ, అంతర్జాతీయ తాత్వికతను నిర్లక్ష్యం చేయటం భారత రాజకీయ వ్యవస్థలో ఒక సామాజిక లోపంగా కనిపిస్తుంది.** గాంధీని, నెహ్రూని జాతీయ నాయకులుగా చూస్తాం. వీరికి ఏమాత్రం తీసిపోని అంబేద్కర్‌ను దళిత నాయకుడిగా చూడటం భారతీయ సామాజిక వ్యవస్థలోని లోపం. గాంధీ గుజరాత్‌వాది కాదు. ఠాగూర్ బెంగాలీలకే చెందినవాడు కాదు. అలానే అంబేద్కర్ దళితులకు మాత్రమే చెందినవాడు కాదు. ఈయన దళితుల పక్షాన పోరాడాడు, దేశ ప్రజల కోసం రాజ్యాంగాన్ని రచించాడు. సమాజంలో అసమానతలు ఎదుర్కొంటున్న అన్ని వర్గాలకు ముఖ్యంగా మహిళల హక్కుల పరిరక్షణను రాజ్యాంగంలో పొందుపరిచాడు.

1927 డిసెంబర్ 24న అంబేద్కర్ తన బ్రాహ్మణ స్నేహితుడు జి.ఎన్. సహస్రబద్ధితో కలిసి కులవ్యవస్థకు దన్నుగా ఉన్న మనుస్మృతిని తగులబెట్టాడు. కారణం కుల వ్యవస్థ భారతదేశ సామాజిక అభివృద్ధికి ఆటంకంగా ఉందన్నాడు. స్వామి వివేకానందుని వంటి దేశ భక్తులు కూడా కుల వ్యవస్థని కూల్చి వేయకపోతే ఈ దేశం ముందకు వెళ్ళదని చెప్పారు. దీన్ని నేటి నాయకులు ఆదర్శంగా స్వీకరించాలి. ఆనాటి గీతాకారుడు నుంచి నేటి పీఠాధిపతుల వరకూ కుల సమస్య పరిష్కారానికి మార్గం చూపినవారు లేరు. ఆకలైన వారికే ఆకలిబాధ తెలుస్తుంది. ప్రత్యక్షంగా కులపీడనని ఎదుర్కొన్న అంబేద్కర్‌కి దాని తీవ్రత, సాంద్రత తెలుసు. దేశం, దేశభక్తి, జాతీయత అనేవి కేవలం భౌగోళిక సరిహద్దులతో కూడినవి కావు. **అంబేద్కర్ దృష్టిలో మానవ విలువలతో కూడిన పౌరుల మధ్య సత్సంబంధమే నిజమైన జాతీయత.** భారతీయుల్లో దేశభక్తి పెంపొందాలంటే కుల వ్యవస్థని ధ్వంసం చేయాలి. అందుకోసం రాజకీయ పార్టీలు, స్వాములు, పీఠాధిపతులు మనుస్మృతిని త్యజించాలి. ఈదేశంలో కులం లేని మనిషిని చూడలేం. "కులం ఉన్నంతకాలం హెచ్చు తగ్గులు ఉంటాయి అన్నారు" అంబేద్కర్. 1936 యోలా సమావేశంలో అంబేద్కర్ తాను హిందువుగా పుట్టినా హిందువుగా చనిపోనని ప్రకటించారు. మొదట ఆయన సిక్కు మతం స్వీకరించేందుకు సుముఖత ప్రదర్శించారు. కానీ సిక్కు మతం స్వీకరించినట్లయితే దళితులకు మరింత మేలు జరిగేదని నా వ్యక్తిగత అభిప్రాయం.

1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తి పూజ దిగజారుడు తనానికి, నాయకుడు నియంతగా వ్యవహరించటానికి దారి తీస్తుందని హెచ్చ రించాడు. నాడు రాజ్యాంగ సభలో అంబేద్కర్ చేసిన హెచ్చరికను నేటి రాజకీయ నాయకులు పరిగణలోకి తీసుకోవాలి. ఊరి చివర పల్లె గుమ్మం ముందు ఓ అంబేద్కర్ విగ్రహం, ఊరిమధ్యలో ఓ కాలేజీ కట్టి ఏడాదికోమారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జై

అంబేద్కర్ అని నినదించి నంత మాత్రాన సోషల్ డెమొక్రసీ రాదు. అంబేద్కర్ ఆలోచనలు ముందుకెళ్ళవు.

అంబేద్కర్ సామాజిక విప్లవకారుడు. ఆయన ఎన్నో గొప్ప రచనలు చేశారు. తాత్త్విక,ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆయన చేసిన ఆలోచనలు, రచనలు ఆధునిక భారతదేశంలో మరెవరికీ సాధ్యంకాలేదు. తత్వవేత్తలు సమాజాన్ని నిర్వచిస్తారు, కానీ సమాజాన్ని మార్చేందుకు పెద్ద ప్రయత్నం చేయలేరు అన్నాడు కారల్‌మార్క్స్. అంబేద్కర్ తత్వ శాస్త్రంలో రచనలు చేయటమే కాకుండా, వాటిని ప్రజలకు బోధించి వారిని సమీకరించాడు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. ఫలితాలు సాధించాడు. ఇంతటి విశిష్టమైన, వైవిధ్యభరితమైన ఆలోచనాపరులు మన దేశంలో చాలా అరుదు.

అంబేద్కర్ రచనలన్నీ నాకు వ్యక్తిగతంగా ఇష్టమే. అయితే భారత రాజ్యాంగం, కుల నిర్మూలన గ్రంథాలంటే మరింత మక్కువ. ఈ రెండు రచనలు విద్యార్థి దశనుంచి నన్నెంతగానో ప్రభావితం చేశాయి. వీటిని చదివినపుడల్లా ఒక సరికొత్త దృష్టికోణం నాలో ఆవిష్కృతమవుతూనే ఉంటుంది. విస్ఫోటనం కలిగించే ఆలోచనలు నాలో రేకెత్తుతాయి. ఈ దేశంలో పుట్టిన ప్రతివ్యక్తి చదవాల్సినరచనలు ఇవి. భారతీయ సమాజాన్ని సమున్నతంగా అర్థం చేసుకోవటానికి, మార్పువైపు నడిపించటానికి ఈరెండు రచనలు పనికొస్తాయి. కులవ్యవస్థ ఏర్పడిన తీరు, శ్రామిక, ఉత్పాదక వర్గాలు వేలాది సంవత్సరాలుగా పీడనకు గురైన తీరుతెన్నులు కూలంకుషంగా చర్చించాడు. మహాత్మాగాంధీ సైతం అంబేద్కర్ లేవనెత్తిన కుల సమస్యను నిజాయితీగా అంగీకరించాడు. గాంధీ 1931లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో మాట్లాడుతూ అంబేద్కర్ అంటేతనకు చాలా గౌరవమని, ఆయన లేవనెత్తిన ప్రశ్న న్యాయమైనదని చెప్పాడు. 1933లో 'హరిజన్' పత్రిక మొదటి సంచికలో అంబేద్కర్ కులసమస్యపై వెల్లడించిన అభిప్రాయాలను ప్రచురించాడు. 1934లో కరాచీ విద్యార్థులతో మాట్లాడుతూ అంబేద్కర్ ఔన్నత్యాన్ని శ్లాఘించాడు. అంబేద్కర్ విదేశాల్లో స్థిరపడి ఉంటే మంచి సౌకర్యవంతమైన జీవితం జీవించేవాడని, కానీ దళితుల కోసం ఆయన దేశంలోనే వుండి వారి పక్షాన పోరాడుతున్నారన్నారు. అంబేద్కర్ వాక్పటిమకు ప్రభావితమైన గాంధీ కాంగ్రెస్‌లో 'హరిజన్ సేవక్ సంఘ్‌ను' స్థాపించాడు. దీనిలో దళితులు, దళితేతరులు కలిసి అస్పృశ్యతా నివారణకోసం పనిచేయాలని నిర్దేశించారు. ఈ విధంగా చూస్తే **భారత సామాజిక ముఖ చిత్రం మీద అంబేద్కర్ గళంవినిపించాకే దళితుల సమస్యలను జాతీయోద్యమ నాయకులు, వివిధ సంఘాలు చర్చించడం ప్రారంభించాయి.** గాంధీ,అంబేద్కర్లు తాత్విక రంగంలో పోరాటం చేస్తూనే దేశ సామాజిక రుగ్మతలపై వారు నమ్మిన సిద్ధాంతాలతో పనిచేశారు. గాంధీ కులసమస్య పరిష్కారానికి హిందూమతంలోని సంస్కరణ వాదాన్ని అశ్రయించేవాడు. 1920 నాటికి అస్పృశ్యతా నిర్మూలనకే ప్రాధాన్యతనిచ్చిన మహాత్మాగాంధీ ఆలోచనలు 1946 నాటికి కులనిర్మూలన జరగాలనే దిశగా మారాయి. అంబేద్కర్ దృష్టిలో మతం మనిషి సేవలో తరించాలి. మనిషి మతం సేవలో బానిస కారాదు. అంబేద్కర్ మరణానంతరం సంతాప తీర్మానంలో నెహ్రూ పేర్కొన్నట్లుగా హిందూ సమాజంలోని అన్ని దాష్టీకాలకు, వెలివేతలకు, అణిచివేతలకు సర్వశక్తులను ఒడ్డి పోరాటం చేసిన ధీశాలి అంబేద్కర్.

రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్‌గా దేశం ప్రపంచంలో గర్వంచదగ్గ గొప్ప రాజ్యాంగాన్ని రచించాడు. నేడు దేశంలో పాలకులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగమే శరణ్యం. వేలాది భాషలు, కులాలు, మరెన్నో మతాలు ఐక్యంగా కలగలిసి ఒక దేశంగా వారివారి హక్కులకు రక్షణ పొందుతున్నాయంటే అంబేద్కర్ విరచిత రాజ్యాంగమే రక్షణ కవచం. అన్ని మతాలు, కులాలు ఒక్క గొంతుకగా కలిసి ఉండటానికి భారత రాజ్యాంగమే స్ఫూర్తి. ఇది అంబేద్కర్ తాత్వికత, దూరదృష్టికి నిదర్శనం. **దేశంలో రాజ్యాంగ వ్యవస్థ ఉన్నంత కాలం అంబేద్కర్ మనతో ఉంటాడు.** భారత దేశం లౌకిక తత్త్వంలోనే ప్రగతి పథంలో ముందుకెళుతుందని నమ్మిన వ్యక్తి అయన. 1942...46 మధ్యకాలంలో అంబేద్కర్ వైశ్రాయ్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సభ్యునిగా, కార్మిక, ఇరిగేషన్, విద్యుత్ సభ్యునిగా ఉండి దేశానికి కావాల్సిన అనేక ప్రాజెక్టుల రూపల్పనలో దార్శనికుడిగా వ్యవహరించాడు. ఈ నేపథ్యంలో వచ్చినవే భాక్రానంగల్, హీరాకుడ్ ప్రాజెక్టులు. వెనుకబడిన తరగుతుల రిజర్వేషన్ల కోసం రాజ్యాంగంలో అధికరణం 340ని ఏర్పాటు చేశాడు. చంపకం దొరైరాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ కేసులో బలహీన వర్గాల రిజర్వేషన్లు చెల్లవని న్యాయస్థానం తీర్పు రాగా రాజ్యాంగం మొదటి సవరణ ద్వారా అధికరణం 16(4), 15(4)లను చేర్చి బీసీల రిజర్వేషన్లు కల్పించి అయన గురువు పూలేకు గురుదక్షిణ ఇచ్చాడు.

జనవరి 26, 1950 గణతంత్ర దినోత్సవాన రాజ్యాంగ సభలో అంబేద్కర్ మాట్లాడుతూ మనం రాజకీయంగా సమాన హక్కులు సాధించినా సామాజిక సమానత్వాన్ని (సోషల్ డెమొక్రసీ) సాధించకపోతే ఈ దేశం పురోగతిని సాధించలేదు అన్నాడు. తన భావాల పట్ల తనకు గాఢ విశ్వాసం ఉన్న వ్యక్తి. కనుకనే గాంధీజీకి సైతం ఎదురు నిలిచాడు. భారతీయ తాత్విక చింతనలను ఆమూలాగ్రం కుదిపివేసిన శక్తి అంబేద్కర్. ప్రాచీన భారతీయ ఆలోచనలను, న్యాయ విధానాన్ని సంస్కరించి స్వేచ్ఛ, సమానత్వం, జీవించే హక్కులను పౌరులందరకీ సమంగా అందించాడు. దేశంలో రాజ్యాంగ బద్ధ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా గాంధీ కొంతకాలం జీవించి ఉన్నట్లయితే అంబేద్కర్‌ను మరింత స్పష్టంగా అర్థం చేసుకుని ఉండేవాడు. ■

# రైతే రాజుగా తెలంగాణ బడ్జెట్ ...2018-19

**- రాజనాల బాలకృష్ణ**




**'ప్రతి ఇంటికి సంక్షేమం- ప్రతి ముఖంలో సంతోషం' అన్న లక్ష్యంతో ఏ ఒక్క రంగాన్ని విస్మరించకుండా, ఏ వర్గాన్ని, సమూహాన్ని కాదనకుండా కేటాయింపులు చేసినా, రూ. 5 వేల కోట్లకు పైచిలుకు రెవెన్యూ మిగులును, ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, వాటికి తోడుగా నిలిచే సాగునీరు, విద్యుత్ రంగాలకు రాష్ట్ర బడ్జెట్‌లో 26 శాతం నిధులు కేటాయించారు. పెట్టుబడి ప్రోత్సాహం పేరిట ఏటా రెండు పంటలు పండించే రైతులకు ఎకరాకు ఎనిమిది వేల రూపాయలు చొప్పున పెట్టుబడి ప్రోత్సాహం అందించడానికి వీలుగా బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు ప్రతిపాదించారు.**

ముందునుంచి చెపుతున్నట్లుగానే తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ 2018-19 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో అంతగా మెరుపులు మెరిపించలేదు. అయినా ఎన్నికల సంవత్సరంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల వాసనలు అసలే లేవని చెప్పేందుకూ లేదు. కొత్తగా జనాకర్షక పథకాల జోలికి అంతగా పోకున్నా, అమలులో ఉన్న పథకాలకు కేటాయింపులను ఘనంగా పెంచారు. రైతులకు పెట్టుబడి సాయం అందించేకుకు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'రైతు లక్ష్మి' పథకానికి అవసరానికి మించిన అంచనాలతో ఏకంగా రూ. 12 వేల కోట్ల రూపాయలను బడ్జెట్లో ప్రతిపాదించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన రైతు బీమా పథకానికి రూ.500 కోట్లు కేటాయించారు. ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అమలులో అడ్డు తిరుగుతున్న దళితులకు మూడెకరాల భూమి, డబల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం, వంటి పథకాల జోలికి అంతగా పోలేదు. ఒకే ఒక్క సమ్మోహనాస్త్రం 'రైతు లక్ష్మి'..తో గ్రామీణ రైతాంగాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

తెలంగాణ రాష్ట్రం తొలి ప్రభుత్వపు చిట్టచివరి (2018-19) వార్షిక బడ్జెట్' ను రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ మార్చి 15 న శాసన సభలో ప్రవేశ పెట్టారు. గత నాలుగు బడ్జెట్ల బాటలోనే ఐదవ బడ్జెట్‌లోనూ ఆర్థిక మంత్రి అన్ని ప్రాధాన్య రంగాలకు కేటాయింపులు భారీగానే చేశారు. మొత్తంగా చూస్తే బడ్జెట్ లెక్క బరువు బానే పెరిగింది. గత (2017-18) ఆర్థిక సంవత్సరంలో అంతకు ముందు సంవత్సరం కంటే 33 శాతం ఎక్కువగా రూ.1,49,646 కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన అర్థిక మంత్రి ప్రస్తుత (2018-19) బడ్జెట్ వ్యయాన్ని ఇంచుమించుగా అదే స్థాయిలో పెంచి రూ.1,74,453.84 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించారు.

గత నాలుగు సంవత్సరాలలో బడ్జెట్ కేటాయింపుల్లో 90 శాతానికి పైగా నిధులు ఖర్చు చేయడం జరిగిందని, ఆర్థిక శాఖ గణాంకాలను బట్టి తెలుస్తున్నది. అలాగే, రాష్ట్ర స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ), రాష్ట్ర తలసరి ఆదాయం వృద్ధి రేటు ప్రగతి కూడ, బడ్జెట్ బండి పట్టాలపైనే సాగుతొందనడానికి నిదర్శనమని ఆర్థిక శాఖాధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు (6.6 శాతం) తో పోలిస్తే రాష్ట్ర వృద్ధి రేటు 10.4 శాతం ఉండటం ప్రశంసనీయం.

సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.
E-mail: rajanala.bk@gmail.com

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వల్ల కలిగిన ప్రారంభ ప్రతికూల పరిణామాలను అధిగమించి జీఎస్‌డీపీ వృద్ధి రేటులో జాతీయ ధోరణిని తోసిరాజని రెండంకెల రేటును రాష్ట్ర సాధిం చింది. నూతన పారిశ్రామిక విధానం వల్ల పారిశ్రామిక వృద్ధి రేటు 7.6 శాతానికి చేరింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల వృద్ధి 6.9 శాతానికి చేరింది. వచ్చే ఏడాదీ సకాలంలో వానలు కురవాలని కోరుకుందాం. అలాగే, రాష్ట్ర తలసరి ఆదాయం ఏటేటా మెరుగుపడు తోంది. ప్రస్తుత ధరల్లో ఇది రూ.1,75,534 లుగా ఉంటుందని అంచనా. గతేడాదితో పోలిస్తే 13.4 శాతం పెరిగింది. జాతీయ వృద్ధి రేటు 8.6 శాతంతో పోల్చితే ఇది చాలా ఎక్కువ.

'ప్రతి ఇంటికి సంక్షేమం– ప్రతి ముఖంలో సంతోషం' అన్న లక్ష్యంతో ఏ ఒక్క రంగాన్ని విస్మరించకుండా, ఏ వర్గాన్ని, సమూహాన్ని కాదనకుండా కేటాయింపులు చేసినా, రూ. 5 వేల కోట్లకు పైచిలుకు రెవెన్యూ మిగులును, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపారు. అన్నిటినీ మించి, వ్యవసాయ, వ్యసాయ అనుబంధ రంగాలకు, సాగునీటి పారుదల, సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. అందులోనూ, రాష్ట్ర ప్రభుత్వం, రైతులకు పెట్టుబడి సాయం అందించేకుకు ఇటీవల ప్రకటించిన 'రైతు లక్ష్మి' పథకానికి అవసరానికి మించిన అంచనాలతో ఏకంగా రూ. 12 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ పద్దులో ప్రతిపాదించారు. అదే విధంగా రైతులకు మేలు చేసే లక్ష్యతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన రైతు బీమా పథకానికి రూ.500 కోట్లు కేటాయించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతా పథకాలుగా ఎంచుకున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రెండు పడకల ఇళ్లు, దళితులకు మూడెకరాల సాగు భూమి పంపిణీ, సమాజంలోని అన్ని వర్గాలు,అన్ని కులాలలోని పేదలకు ప్రయోజనం చేకూర్చే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇతర సంక్షేమ పథకాలకు ఆర్థిక మంత్రి పెద్ద చేత్తోనే వద్దన చేశారు.

## వ్యసాయానికి పెద్దపీట

వ్యవసాయం, అనుబంధ రంగాలు, వాటికి తోడుగా నిలిచే సాగునీరు, విద్యుత్ రంగాలకు రాష్ట్ర బడ్జెట్‌లో 26 శాతం నిధులు కేటాయించారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతు రుణ మాఫీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరం వరకు అంచల వారీగా రూ.17,000 కోట్ల రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం, వ్యవసాయ పునరుజ్జీవం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు పెట్టుబడి ప్రోత్సాహం పేరిట ఏటా రెండు పంటలు పండించే రైతులకు ఎకరాకు ఎనిమిది వేల రూపాయలు చొప్పున పెట్టుబడి ప్రోత్సాహం అందించడానికి వీలుగా బడ్జెట్లో రూ.12 వేల కోట్లు ప్రతిపాదించారు.

వ్యవసాయరంగం మొత్తానికి కలిపి గత వార్షిక బడ్జెట్‌కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా ఈ వార్షిక బడ్జెట్లో రూ.12,601 కోట్లను ఆర్థిక మంత్రి కేటాయించారు. సాగునీటి రంగానికి రూ.25 వేలకోట్లు, విద్యుత్ రంగానికి రూ.4,393 కోట్లను ప్రతిపాదించడం ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యతను ఆర్థిక మంత్రి బడ్జెట్లో ప్రతిబింబించారు. అదే సమయంలో రైతు కుటుంబాలను ఆదుకు నేందుకు రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పిస్తూ రైతు బీమా పథకాన్నిఆర్థిక మంత్రి ఈ బడ్జెట్‌లో ప్రకటించారు.ఈ పథకం కోసం రూ.500 కోట్ల మూల నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు.

అలాగే,వ్యవసాయ యాంత్రీ కరణకు రూ.522 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాల కోసం రూ.500 కోట్లను బడ్జెట్లో ప్రతిపా దించారు. రైతులకు గిట్టుబాటు ధర, కనీస మద్దతు ధర లక్ష్యంగా రైతు సమన్వయ సమితులు పనిచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ అనుబంధరంగాలపై ఆధారపడిన వారికి గొర్రెల పంపిణీ ద్వారా అండగా నిలిచిన ప్రభుత్వం చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చేలా కేటాయింపులను పెంచింది.

భూ రికార్డులను సమగ్ర సర్వే చేయించే మహత్తరమైన పనిని ప్రభుత్వం చేపట్టింది. రికార్డుల వివరాలన్నీ 'ధరణి' వెబ్‌సైట్‌లో త్వరలో ఆవిష్కరిస్తామని భూముల రిజిస్ట్రేషన్లు సులభతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అర్థికమంత్రి తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

**దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరాకు పంటకు రూ. 4000 వంతున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ. రూ.8000 వరకు ఆర్థిక సహాయాన్ని అందించడం స్వాగతించదగిన పరిణామమే అయినా, ఈ పథకం అమలుకు రూ.12 వేల కోట్ల రూపాయలు అవసరమా అన్న ప్రశ్న వినవస్తోంది.** తెలంగాణాలో ప్రస్తుతమున్న నీటి వనరుల ప్రాతిపదికన రాష్ట్రంలో ఉన్న మొత్తం వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం భూముల్లో మాత్రమే రెండు పంటలు పండించు కునే అవకాశం ఉందని, కనుక, ఆరు, ఏడు వేల కోట్ల రూపాయలకంటే ఎక్కువ అవసరం లేదని నిపుణులు, ప్రతిపక్షాలు విమర్శిస్తు న్నాయి. అలాగే, **కౌలు రైతులకు పెట్టుబడి సహాయం అందించే వెసులుబాటు చట్టంలో లేక పోవడం కూడా విమర్శలకు తావిస్తోంది.** అదే విధంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ప్రస్తావన లేదని, దీని వల్ల రైతుల నష్టపోతారనే అభిప్రాయం వినవస్తోంది.

## సాగునీటి రంగానికి ..

రాష్ట్రం ప్రభుత్వం తొలి సంవత్సరం నుంచి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న సాగునీటి రంగానికి ఈ బడ్జెట్‌లోనూ ఆర్థిక మంత్రి అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. బడ్జెట్ వెలుపల సేకరిస్తున్న నిధులు, రుణాలు కాక, బడ్జెట్లో వరసగా మూడవ సంవత్సరం రూ. 25వేల కోట్లను కేటాయించారు. అయితే, సాగు నీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో కేటాయించిన నిధుల్లో సగానికి పైగా కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకే కేటాయించడం

గమనార్హం. అలాగే 2017-18లో అత్యధికంగా రూ.20 వేల కోట్లకుపైగా ఖర్చుచేసినా.. అందులో బడ్జెట్ కేటాయింపుల నుంచి సగం కూడా ఖర్చుకాలేదు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని రూ. తొమ్మిదివేల కోట్లకు పైగా చెల్లించడంతో మొత్తమ్మీద సాగునీటి ప్రాజెక్టుల ఖర్చు రూ.20 వేల కోట్లు దాటింది. మరోవైపు వర్షా కాలం నాటికి 8 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ప్రకటించిన ఆర్థిక మంత్రి గత ప్రభుత్వ హయాంలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, దేవాదుల, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నా, ఈ ఖరీఫ్‌లోనో లేదా వచ్చే ఏడాది ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించేలా పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కేటాయింపు జరగలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1800 కోట్లు అవసరమని నీటిపారుదల శాఖ నివేదించగా, రూ.1200 కోట్ల కేటాయింపు జరిగింది. ప్రాణహిత ప్రాజెక్టుకు రూ.350 కోట్లు మాత్రమే కేటాయించారు.

### సకాలంలో ప్రాజెక్టులు పూర్తి అయ్యేనా?

ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఇంతగా ప్రాధాన్యత ఇస్తున్న సాగు నీటి రంగానికి కేటాయించిన నిదులనుంచి ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నిధులను గమనిస్తే చాలా వరకు ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యే అవకాశం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉదాహరణకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్నే తీసుకుంటే, రూ.80,500 కోట్లు వ్యయమయ్యే ఈ పథకానికి ఇప్పటివరకు సుమారు రూ.30 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. పెరిగిన ధరలను కూడా పరిగణనలోకి తీసుకొంటే ఈ పథకం పూర్తయ్యి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందడానికి మరో రూ.55 వేల కోట్లు అవసరం. రూ.35,210 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చి, రూ.29,659 కోట్లకు గుత్తేదారులతో ఒప్పందం చేసుకొన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇప్పటివరకు చేసిన ఖర్చుపోను రూ.30 వేల కోట్లకుపైగా అవసరం. అంటే ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చుచేస్తే గానీ వచ్చే రెండేళ్లలో పూర్తికాదు. కానీ, ఈ బడ్జెట్‌లో రూ.3035 కోట్లు మాత్రమే కేటాయించారు. దీని ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే ఏడెనిమిదేళ్లు పట్టే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ఇంకా చెప్పాలంటే, దిండి ఎత్తిపోతల పథకం ఒప్పందం విలువే రూ.4 వేల కోట్లు. భూసేకరణ, పునరావాసానికి అయ్యే వ్యయం దీనికి అదనం. ఇప్పటివరకు రూ.500 కోట్లు కూడా ఖర్చుచేయలేదు. ఈ బడ్జెట్‌లో రూ.525 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాగే సీతారామ ఎత్తిపోతల, తుపాకులగూడెం పూర్తికావాలంటే రూ.10 వేల కోట్లకు పైగా కావాలి. ఇప్పటి వరకు చేసిన ఖర్చు నామమాత్రమే. తాజా బడ్జెట్‌లో ఈ రెండింటికీ కలిపి రూ.1725 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలా జరగకపోతే ఇవి పూర్తి కావడానికి సుదీర్ఘకాలం పట్టే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ప్రభుత్వ వర్గాలు మాత్రం ఇతర మార్గాలలో నిధులు సమాకుర్చుకోవడం ద్వారా కాళేశ్వరం సహా అన్ని ప్రధాన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి కోటి ఎకరాలకు సాగు నీరు అందించాలని సంకల్పించాయి. ఆర్థిక మంత్రి తమ బడ్జెట్ ప్రసంగంలోనూ పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీరం దించాం. గోదావరి, కృష్ణా నదులపై 23 భారీ, మరో 13 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ సాగుతోంది, కాళేశ్వరం ప్రాజెక్టును మరో రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అన్నారు.

### సంక్షేమ రంగానికి...

గత బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ అదే ఒరవడిని కొనసాగించిది. బడుగు, బలహీనవర్గాలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ఈ వర్గాలకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.28,692 కోట్లు కేటాయించింది. మొత్తంగా గత ఏడాదితో పోలిస్తే సంక్షేమ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు దాదాపు 20.50 శాతం పెరిగాయి. మైనార్టీలకు కేటాయింపులు పెంచడం ద్వారా ప్రభుత్వం ఆ వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. గిరిజన సంక్షేమ శాఖకు రూ.1951 కోట్లు (24.19 శాతం) అధికంగా ఇవ్వడంతో కేటాయింపుల మొత్తంగా రూ.8,063 కోట్లకు పెరిగాయి. బీసీలకు కేవలం రూ.850 కోట్లు మాత్రమే పెరిగాయి. ఎస్సీలకు నిధుల కేటాయింపు రూ.12,708 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.2,330 కోట్లు అధికం.

### పథకాల వారీగా ...

### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్:

పేదింటి అడ పిల్లల పెళ్ళికి ప్రభుత్వ సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకాలకు గత ఏడాది కంటే దాదాపు 40 శాతం అధికంగా నిధులను ప్రతిపాదించారు. ఈ పథకం కింద ఎస్సీలకు రూ.400 కోట్లు, బీసీ, ఈబీసీలకు రూ.700 కోట్లు ఇచ్చింది. ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు కలిపి రూ.1450 కోట్లు కేటాయించారు.

### ఉపకార వేతనాలు:

బోధన రుసుములు, ఉపకార వేతనాలకు నిధులు గతంతో పోలిస్తే రూ.400 కోట్లు (12శాతం) పెరిగాయి. 2018-19లో ఉపకార వేతనాల కోసం బడ్జెట్‌లో రూ.3,282.24 కోట్లు ప్రతిపాదించారు. అయితే, బడ్జెట్ లీకల ప్రకారం గత, ప్రస్తుత విద్యా సంవత్సరాలకు కలిపి

డిమాండ్ దాదాపు రూ. 4,800 కోట్లకుపైగా ఉంటుందని అంచనా, అంటే సుమారు మరో వెయ్యి కోట్లకు పైగా కేటాయింపులు చేస్తేనే గానీ,బండి ముందుకు సాగదు.

### విదేశీ విద్యా నిధి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు గత ఏడాదితో పోలిస్తే రూ. 121 కోట్లు, అంటే 41శాతం అధికంగా కేటాయింపులను ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. 2018-19 ఏడాదిలో దాదాపు 1,100 మంది విద్యార్థులను విదేశాలకు పంపించేందుకు వీలుగా దాదాపు రూ. 258.50 కోట్లు కేటాయించారు. నిరుద్యోగ యువతకు ఈ ఏడాదికి స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు వీలుగా..గతేడుతో పోలిస్తే దాదాపు రూ. 851 కోట్లు అంటే 23 శాతం అదనంగా ప్రతిపాదించారు.

### గురుకులాలకు...

2018-19 ఏడాదికి గురుకులాల సొసైటీల నిర్వహణకు మొత్తంగా రూ. 2,707 కోట్లు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల వసతి గృహాల నిర్వహణకు నిధుల కేటాయింపులు పెద్దగా పెరగలేదు. అలాగే,వసతి గృహాల నిర్వహణకు రూ. 568.85 కోట్లు కేటాయించారు.

### కిలో రూపాయి బియ్యం

ఇక రూపాయికి కిలో బియ్యం పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను పెంచింది. రేషన్‌బియ్యం కోసం గతేడాది రూ. 1,575.24 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 1,833.60 కోట్లను మంత్రి ఈటెల రాజేందర్ ప్రతిపాదించారు. పౌరసరఫరాలశాఖకు గత బడ్జెట్‌లో రూ. 1732.68 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ. 2946 కోట్లను ప్రతిపాదించారు. ఇంత వరకు వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ పాస్ విధానం వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ విధానం అమలైతే లబ్దిదారులు ఎక్కడినుంచైనా రేషన్ సరుకులు తీసుకొనే అవకాశం ఏర్పడుతుంది. తెల్లరేషన్ కార్డులు, అంత్యోదయకార్డులకు రేషన్ బియ్య సబ్సిడీ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. నిర్వహణ పద్దుకు రూ. 86 కోట్లు కేటాయించారు.

### విద్య:

అనేక ఇతర రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో పెద్ద పీట వేసిన ఆర్థిక మంత్రి అత్యంత కీలక మయిన విద్యా, రంగానికి విషయంలో మాత్రం ఎందుకో అరకొర విదిలింపులతోనే సరి పుచ్చారు. విద్యారంగానికి గతేడాదితో పోల్చితే కేవలం రూ. 573 కోట్లే అదనంగా చేర్చి రూ. 13,278 కోట్లు కేటాయించారు. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన కేజీ టూ పీజీ విద్యకు బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడమే కాదు ఎటువంటి ప్రస్తావన చేయలేదు. అలాగే తెలంగాణ విశ్వవిద్యాల యాలకు తాజా బడ్జెట్‌లో కేవలం రూ. 695 కోట్లు కేటాయించారు. ఇది గతేడాదితో పోల్చితే రూ. 147 కోట్లు తక్కువ.

### ఉపాధి రంగం

గడచిన నాలుగు సంవత్సరాలలో 27 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని ఆర్థిక మంత్రి తమ ప్రసంగంలో పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేరుగా నియమించదగిన 1,10,012 ఖాళీలను గుర్తించినట్లు పేర్కొన్నఆయన వాటిలో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని 27,588 ఉద్యోగ నియామకాల భర్తీ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆర్థిక మంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు.

### ఆరోగ్యం:

ప్రజారోగ్యానికి గత బడ్జెట్ కంటే రూ. 1,399 కోట్లు అదనంగాచేర్చి వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ. 7,375 కోట్లు ప్రతిపాదించారు. దీనికి అదనంగా అమ్మఒడి పథకానికి ప్రత్యేకంగా రూ. 561 కోట్లను కేటాయించారు. ముఖ్యంగా కేసీఆర్ కిట్స్ పథకానికి మరింత ప్రాచుర్య కలిపించే సంకలపాన్ని ఆర్థిక మంత్రి తమ ప్రసంగంలో పస్పుటంగా వినిపించారు. అదే విధంగా ఆరోగ్య శ్రీ, ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకాలకు కూడా కొంత మెరుగైన కేటాయింపులే ప్రతిపాదించారు.

### మహిళా సంక్షేమం

మహిళలు, చిన్నారుల సంక్షేమానికి గత ఏడాది బడ్జెట్లో రూ. 1,829 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ. 60 కోట్లు మాత్రమే పెంచి రూ. 1,890 కోట్లు కేటాయించింది. అదే సమయంలో గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోష్టికాహారాన్ని అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యలక్ష్మి పథకానికి ప్రభుత్వం రూ. 298 కోట్లు కేటాయించింది.

### ఆదాయంపై ఆశలు...

అలాగే, ఆదాయ పద్దుల విషయంలోనూ ఆర్థిక మంత్రి ఆశావహ దృక్పథాన్నే ప్రదర్శించారు. రెవెన్యూ ఆదాయం ద్వారా రూ. 1,30,975.11 కోట్లు, ప్రభుత్వ రుణాల ద్వారా రూ. 33,200.00 కోట్లు, రుణ చెల్లింపుల ద్వారా రూ. 7,807.17 కోట్లు, ప్రభుత్వ కహతా ద్వారా రూ. 2,500 కోట్లు మొత్తం రూ. 1,74,487.28 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తునట్లు అర్థిక మంత్రి ప్రకటించారు. వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ద్వారా వచ్చే ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని, అదే విధంగా సొంతవనరులు, పారిశ్రామిక, ఇతర రంగాల నుంచి వస్తున్న ఆదాయం ఆశాజనకంగా ఉందని ఆర్థిక మంత్రి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ■

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ - 2018-19 ఒక పరిశీలన

- కోటు ప్రసాద్




**అన్ని వర్గాలను ఆకట్టుకునేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది. గతంలో ఎప్పుడూ కేటాయించని తరగతులకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక స్థానమివ్వడం విశేషం. వివిధ బలహీన వర్గాలకు గురుకులాలు, ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్పులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు అధ్యయన కేంద్రాలు, విదేశీ విద్య కోసం సహాయం, భూమి లేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇల్లు, అవసరమైన వారికి వస్త్రాలు, ఆకలి గొన్న వారకి ఆహారం, జీవనోపాధి అభివృద్ధికి ఆర్థిక మద్దతు, వివాహాల వంటి సాంఘిక కార్యక్రమాల కోసం సాయం, వైద్య సహాయం, సాధారణ జీవిత బీమా, పెన్షన్‌ల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.**

ఆర్థిక రంగాన్ని ఉరకలెత్తించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తూనే మరోవైపు వివిధ వర్గాల ప్రజలందరి శ్రేయోదాయకగా ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సాగింది. రాష్ట్ర బడ్జెట్ భిన్న రంగాల ప్రజల చిరకాల ఆశలకు, ఆకాంక్షలకు భరోసా కల్పిస్తూ ఆర్థికంగా వెనుకబడిన, సామాజికంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్న వర్గాలు, మహిళలు, యువతకు భారీ కేటాయింపులతో వడ్డించారు. నిరుద్యోగులకు కొండంత ధైర్యానిచ్చారు. దేనికీ లేదనకుండా కీలక రంగాలన్నింటికీ పుష్కలంగా కేటాయింపుల పండగ చేశారు. 28 కొత్త పథకాలను తెరపైకి తెచ్చారు. మరీ ముఖ్యంగా "లోటు బడ్జెట్ ఇక ఇక్కడితో చెల్లు" అంటూ 2018-19 ఆర్థిక సంవత్సరానికి మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదించటం జరిగింది.

### సూక్ష్మ సేద్యం

వర్షాభావ ప్రాంతాల్లో అతి తక్కువ నీటితో అధిక దిగుబడులే దీని లక్ష్యం. ఉద్యాన వన పంటల బడ్జెట్ నుంచి సూక్ష్మ బిందు సేద్యాల వరకు రూ. 282.36 కోట్లు కేటాయించారు. తర్వాత రూ. 462.73 కోట్లు పెంచారు కూడా ఇప్పటి వరకూ 60 శాతం లక్ష్యం సాధించారు.

### యాంత్రీకీకరణ :

రైతులకు ట్రాక్టర్ల కొనుగోలుపై రూ. 1.52 లక్షల వరకూ రాయితీ ఇచ్చే "రైతు రథం" పథకం మరో పథకం. మొత్తం యాంత్రికీ కరణకు రూ. 146 కోట్లుతో పాటు, రైతు రథం పథకంలో భాగంగా మరో రూ. 90 కోట్లు జత చేశారు. మొత్తం 12,670 ట్రాక్టర్ల పంపిణీని చేపట్టగా 60 శాతం పూర్తయింది.

### సూక్ష్మ పోషకాలు :

సూక్ష్మ పోషకాలను ఉచితంగా పంపిణీ చెయ్యాలని నిర్ణయించడంతో దీనికి కేటాయింపులు పెరిగాయి. గత మూడేళ్లలో రూ. 157 కోట్ల వ్యయంతో 1.21 లక్షల టన్నులు పంపిణీ చేయగా ఈ ఒక్క ఏడాదే రూ.. 98.60 కోట్లతో ఒక లక్ష టన్నులు ఉచితంగా అందించారు. దీనివల్ల రూ. 719 కోట్ల అదనపు ఉత్పత్తి సాధ్యమైందని అంచనా.

సంక్షేమమే సగం బలం. ఇది కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం పఠించిన మంత్రం. అన్ని వర్గాలు, అన్నీ వృత్తుల వారికి నేరుగా సహాయం. అగ్రకులాల్లోని పేదలకూ ఆర్థికంగా సహకారం. ఎంచి, ఆలోచించి, ఎవ్వరినీ వదలకుండా అందరినీ చేరుకునేలా పథకాలను రచించారు. 'ప్రజలే ముందు' ప్రధానంగా సంక్షేమ రంగానికి బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పిస్తూ, 2017-18 బడ్జెట్ అంచనాల కన్నా ఎక్కువగా 2018-19 బడ్జెట్ అంచనాలను

విద్యావేత్త, విజయవాడ.
E-mail: prasad_kotu@rediffmail.com

(రూ. 1,91,063.61 కోట్లు)గా ప్రతిపాదించారు. గత మూడేళ్ళల్లో మన రాష్ట్రం సగటున 10.96 శాతం స్థాయిలో రెండంకెల వృద్ధిని సాధించడం జరిగింది. మహిళలు, శిశువులకు మెరుగైన పోషక విలువలతో కూడిన ఆహారం, స్వయం సహాయక సంఘాల ఆర్థిక వృద్ధి యువతకు ఆర్థికాభివృద్ధి. నైపుణ్యాభివృద్ధితో కూడిన సాధికారత జీవనోపాధి వృద్ధి, రైతుల సంక్షేమానికి తోడ్పడే జలవనరులు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పశు సంవర్ధకం, మత్స్య పరిశ్రమ, ఉద్యానవనరంగాలకు తోడ్పాటు అందించడం జరుగుచున్నది.

## అన్ని వర్గాలకు చేయూత

వివిధ బలహీన వర్గాలకు గురుకులాలు, ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్పులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు అధ్యయన కేంద్రాలు, విదేశీ విద్య కోసం సహాయం, భూమి లేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇల్లు, అవసరమైన వారికి వస్త్రాలు, ఆకలి గొన్న వారకి ఆహారం, జీవనోపాధి అభివృద్ధికి ఆర్థిక మద్దతు, వివాహాల వంటి సాంఘిక కార్యక్రమాల కోసం సాయం, వైద్య సహాయం, సాధారణ జీవిత బీమా, పెన్షన్‌ల వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే అల్పసంఖ్యాక వర్గాలకు దుల్హన్, ఎస్టీ కులాల వధువుల కోసం గిరి పుత్రిక కళ్యాణ పథకాల కింద సాయం చేయటం జరుగుచున్నది. ఇక నుంచి ఎస్సీ, బీసి వధువులకు కూడా సహాయం అందజేయడానికి చంద్రన్న పెళ్ళి కానుక పథకం ద్వారా రూ. 100 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. ఆదరణ పథకం ద్వారా 2.55 లక్షల మంది లబ్ది పొందుతారు. ఈ యేడాది తొలిసారి పేద వైశ్యుల సంక్షేమానికి రూ. 30 కోట్లు కేటాయిం చడం జరిగింది. 50 ఏళ్లకు పైబడిన మత్స్య కారులకు సామాజిక భద్రత పెన్షన్‌ను ప్రతిపాదించడం జరిగింది. రజకులు నైపుణ్యాభి వృద్ధిని పెంపొందించేందుకు కేటాయింపులను వంద రెట్లు పెంచడం జరిగినది. దూదేకుల వర్గానికి రూ. 2 కోట్ల నుంచి 40 కోట్లకు పెంచడం జరిగినది. నాయీ బ్రాహ్మణులకు రూ. 85 లక్షల నుంచి రూ. 30 కోట్లకు, అత్యంత వెనుక బడిన తరగతుల వారికి రూ. 60 కోట్ల నుంచి 100 కోట్లకు బడ్జెట్‌ను పెంచడం జరిగినది. బి.సి. సబ్ ప్లన్‌కు కేటాయింపులను రూ. 12,200 కోట్లకు పెంచడం జరిగింది. చిన్న తరహా తోలు పరిశ్రమల ఏర్పాటుకు, లిడ్ క్యాప్ సంస్థకు రూ. 40 కోట్లు, యం.ఆర్.పి.యస్. మహా సభకు హాజరైె వారికిచ్చిన హామీలను నెరవేరుస్తూ బడ్జెట్ లో కేటాయింపులు చేయటం జరిగింది. డప్పు కళాకారుల పెన్షన్ కోసం రూ. 12 కోట్లు, గిరిజనులకు, పోషకాహార బిస్కెట్‌లకు రూ. 40 కోట్లు కేటాయించడం జరిగింది. అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికి రూ. 840 కోట్ల నుంచి రూ. 1102 కోట్లకు అంటే 31 శాతం పెంచడం జరిగింది. హిజ్రాలు గౌరవప్రదమైన జీవనం సాగించడానికి రూ. 20 కోట్లతో ఒక విధానాన్ని రూపొందించడం జరిగింది. సాధికారతకు రూ. 1000 కోట్లతో పాటు అదనంగా యువజన సంక్షేమ పథకాలకు రూ. 305 కోట్లు కేటాయించడం జరిగింది. బలహీన వర్గాల గృహ నిర్మాణానికి కేటాయింపులను మూడురెట్లు పెంచడం జరిగినది. ఆరోగ్య రంగానికి గత యేడాదికంటే 21 శాతం అదనంగా కేటాయించారు. ఈ యేడాది నుంచి ఎనిమిదో తరగతి పిల్లలకు కూడా ''బడికొస్తా'' కార్యక్రమాన్ని అమలు చేసేందుకు రూ. 160 కోట్లు కేటాయించారు. మధ్యాహ్న భోజన పథకానికి వారానికి 3 కోడి గుడ్లకు బదులుగా 5 గుడ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగింది. రూ. 50 కోట్లతో కొత్త పథకాన్ని ప్రారంభించి 10 లక్షల పశువులకు బీమా చేయాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు ఫలాలను రాష్ట్ర ప్రజలకు వేగంగా అందించడానికి ఈ ఆర్థిక సం॥లో రూ. 9 వేల కోట్లు కేటాయించడం జరిగినది. జలవనరుల శాఖకు 33 శాతం వృద్ధి రేటుతో అత్యధికంగా రూ. 16,978 కోట్లు కేటాయించారు. తాగునీటి కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు యాన్యుటీ మోడ్స్ ద్వారా రూ. 22 వేల కోట్లతో ప్రతి ఇంటికి కుళాయిలు ద్వారా నీటిని అందించడం జరుగుతుంది. అన్న క్యాంటీన్ పథకానికి రూ. 200 కోట్లు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రాథమిక మౌలిక వసతుల కల్పనకు రూ. 75 కోట్లు కేటాయించడం జరిగినది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది. గతంలో ఎప్పుడూ కేటాయించని తరగతులకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక స్థానమివ్వడం విశేషం.

రానున్న ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర రుణం రూ. 2,49,435 కోట్లకు చేరుకుంటుందని ఆర్థిక శాఖ పేర్కొంది. రాష్ట్ర జి.డి.పి.లో ఈ అప్పు 28.66 శాతంగా ఉంటుందని చెప్పవచ్చు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ అంచనాలతో రాష్ట్ర అప్పును రూ. 2.25 లక్షల కోట్లుగా ప్రకటించారు. రాష్ట్ర జి.డి.పిలో ఈ అప్పు 28.4 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. అంటే గణాంకాల ప్రకారం చూస్తే ఏడాది కాలంలో 24,201 కోట్ల రుణాలు పెరిగే అవకాశమున్నట్లు అంచనా వేశారు. కాగా **రాష్ట్ర జనాభా 5.25 కోట్లుగా తీసుకుంటే 2018-19 కాలానికి తలసరి అప్పు రూ. 47,511లుగా ఉంటుందని భావిస్తున్నారు.**

రాష్ట్ర అప్పుల్లో బహిరంగ మార్కెట్ రుణాలు రూ. 157,779,19 కోట్లు కేంద్రం నుంచి తీసుకున్న రుణాలు రూ. 9218.10 కోట్లు, ఇతర సంస్థల నుంచి రూ. 15028.63 కోట్లు, చిన్న మొత్తాల పొదుపు రూపంలో రూ. 12,367.24 కోట్లు, ప్రావిడెండ్ ఫండ్ రూపంలో రూ. 15,272.06 కోట్లు రిజర్వ్ నిధులు, డిపాజిట్లు రూ. 39,770.15 కోట్లు వున్నాయి.

## తలసరి ఆదాయం :

పరిపాలన, ఆర్థిక సంస్కరణలు, ఆర్థికాభివృద్ధి వల్ల నవ్యాంధ్రలో తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో తలసరి

*తరువాయి 45 పేజీలో*

# ప్రధాన స్రవంతిలో ఈశాన్య రాష్ట్రాలు

- ఎస్.జే.చిరు



**ఈశాన్య ప్రాంత అభివృద్ధికోసం కేంద్రంలో ఒక ప్రత్యేక శాఖను నెలకొల్పడమేగాక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మండలిని కూడా ఏర్పాటుచేయడంతో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి సమస్యలపై దృష్టి సారించడం ఒక సమగ్ర ప్రయత్నమేనని చెప్పుకోవచ్చు. ఈశాన్య ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు రైలు, రోడ్డు, జల, వాయుమార్గాలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించడం స్వాగతించదగ్గ మార్పుగా పరిగణించవచ్చు.**

భారతదేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని ఎలా ప్రధాన స్రవంతిలోకి తేగలమని విధాన నిర్ణేతలు, చట్టాలను అమలుచేసే అధికారులు, పాత్రికేయులు, మేధావులు తరచూ ప్రశ్నిస్తుంటారు. అయితే వారు అలా ప్రశ్నించేముందే ఈ ప్రాంతం గురించి ఏదో దురభిప్రాయాన్ని ఏర్పరచుకున్నారేమోనన్న సందేహం కలగకమానదు. ఇలాంటి తెలివితక్కువ ప్రశ్నలను ఈశాన్య ప్రాంతాల ప్రజలు అసలు పట్టించుకోరని వేరేగా చెప్పనవసరం లేదు కానీ ఈ ప్రశ్న చాలా గందరగోళంగా ఉండడం వల్ల 'ప్రధాన స్రవంతి' అంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి నాకు చాలాకాలం పట్టింది. ఈ సందర్భంగా అనేక జాతులు, భాషలు, మతాలు, కళలు, సంస్కృతులకు నిలయమైన భారతదేశం వైవిధ్యభరితమైన చిత్రదర్శిని వంటిదని గుర్తించడం ఎంతో అవసరం. అలాంటప్పుడు, సౌరాష్ట్ర, పంజాబ్, లేక ఒడిశా, ఇతర దక్షిణ భారతదేశం లోని రాష్ట్రాల కంటే భిన్నంగా ఈశాన్యప్రాంతాలు ప్రత్యేకంగా ప్రధాన స్రవంతిలోకి రావాలనుకోవడం అర్థరహితమని పిస్తుందా అని పలువురు వాదిస్తారు. ఏదేమైనప్పటికీ ఈశాన్య ప్రాంతానికి ప్రధాన స్రవంతితో ఏకీకరణ అవసరమన్న హెచ్చరిక మాత్రం వినిపిస్తూనే ఉంటుంది.

**ప్రధాన స్రవంతిపై ఒక దృక్కోణం:**

భారతదేశంలో ప్రధాన స్రవంతి అంటే ఏమిటి అని ప్రశ్నించుకున్నప్పుడు ఈశాన్య ప్రాంతం ఈ ప్రధాన స్రవంతి నుండి ఎందుకు దూరమైందో అర్థమవుతుంది. రాజ్యాంగంలోని పౌరుల హక్కులు, బాధ్యతలు, విధులు, ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ పరిపాలన నిర్వహణ వంటి అనేక అంశాలు భారతదేశంలో జాతీయ భావనను పెంపొందించ డానికి, దేశంలోని పౌరులందరి సమగ్ర అభివృద్ధికి దోహదపడు తున్నాయి. రాజకీయ సమైక్యతకు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు, ఆకాంక్షలు నెరవేర్చుకోవడానికి గల స్వేచ్ఛ, దాన్ని వినియోగించు కోవడాని అవసరమైన హక్కులు, వాటి నిర్వహణ బాధ్యతలను రాజ్యాంగం నిర్దేశిస్తుంది. ఆవిధంగా దేశంలోని ప్రధాన స్రవంతిలో ఒక ప్రాంతం, లేదా రాష్ట్రంలోని ప్రజలందరూ ఈ ఆదర్శాలకు అనుగుణంగా లక్ష్యాలను సాధించి ఆకాంక్షలను నెరవేర్చుకునే స్థాయిని సూచించేవిధంగా ఉండాలన్న భావన నెలకొనాల్సి ఉంటుంది.

ఈ విధంగా నిర్వచించుకుంటే, దేశంలోని ప్రతి రాష్ట్రం లేదా ప్రాంతం వివిధ స్థాయిలలో భారతదేశంలోని ప్రధాన స్రవంతిలో భాగం కాలేదనుకోవచ్చు. ఉదాహరణకు,

కమిషనర్, తమిళనాడు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ & అగ్రిబిజినెస్ విభాగం, చెన్నై.
E-mail: sjchiru@gmail.com

దేశంలోని ఇతర ప్రాంతాల కంటే అక్షరాస్యత రేటు అధికంగా ఉన్న ఈశాన్య ప్రాంతం ఈ అంశంలో మరింత ప్రధాన పాత్ర పోషించ గలదనుకోవచ్చు. కానీ రహదారులు, రైలు మార్గాలతో అనుసంధానం, విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక అభివృద్ధి వంటి మౌలిక సౌకర్యాల విషయంలో ఈ ప్రాంతం ఇతర ప్రాంతాలకంటే వెనుకబడే ఉందని చెప్పవచ్చు. ఈ విధంగా ఈశాన్య ప్రాంతాల ప్రజలు కూడా భారత దేశ సాంఘిక-రాజకీయ వర్ణపటంలో మిగిలిన ప్రాంతాలనుంచి వేరుపడినట్టుగా భావించవచ్చు. తిరుగుబాటు ధోరణులే ఈ వెనుకబాటుతనానికి కారణమని సరిపుచ్చుకోవడానికి వీల్లేదు. వాళ్ళ ఈ ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయన్న భావనే అన్నిటినీ ప్రభావితం చేసింది కానీ రాష్ట్రాలలో ఒకదానిలో ఈ భావనను తొలగించడంలో సహాయం చేయదు. అయితే భారత దేశపౌరుల మని గర్వంగా చెప్పుకోవడంపై ఆసక్తి కనపరచే ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు తమ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి మిగిలిన ప్రాంతాల్లో కంటే తక్కువన్న భావన ఈ న్యూనతకు కారణ మవుతోంది. వాస్తవానికి, తమ బ్రతుకుతెరువు కోసం ఈశాన్య ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినపుడు, దేశంలోని మిగిలిన ప్రాంతాలవారికి, ఈ ప్రాంత ప్రజల మధ్య పరస్పర అవగాహనస్థాయి వివిధ అంశాలపై ఆసక్తికరమైన చర్చకు తావిస్తున్నది.

## వలసల దృష్టాంతం

గత మూడు దశాబ్దాలలో ఈశాన్య ప్రాంతాలనుంచి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు పెద్దఎత్తున ప్రజలు వలసపోతున్నారు. ఈ ప్రక్రియలో వివిధ అంశాలపై పరస్పర చర్చలకు అవకాశం ఏర్పడడంతో రెండు వైపులా దీర్ఘకాల భావనలను పరీక్షించుకుని సమస్యలను అధిగమించేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. ఈశాన్య ప్రాంతాలనుంచి 1980వ దశకం వరకు విద్యార్థులే ఎక్కువగా ఉన్నత విద్యకోసం ఢిల్లీ తదితర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఉన్నత విద్య పూర్తి చేసుకున్నతర్వాత వాళ్ళు స్వస్థలాలకు వెళ్లి స్థిరపడిపోయేవారు. ఆతర్వాత ఉద్యోగార్థులు తమకు మంచి అవకాశం దొరికితే దేశంలో ఎక్కడైనా స్థిరపడిపోయేందుకు సిద్ధమయ్యేవారు. సాంకేతిక పరిజ్ఞానం, సమాచార విప్లవం ప్రారంభమైన తర్వాత ఈ అంశం మరింత ప్రాధాన్యతను సంతరించు కుంది. కాల్ సెంటర్ల లాంటి ఐటి ఆధారిత సంస్థలు ఇంగ్లీష్ మాట్లాడే ఉద్యోగులకు డిమాండ్‌ను సృష్టించింది. దీంతో వారు ఈ అభివృద్ధి కేంద్రాలలో పనిచేసేందుకు అవసరమైన యువత కోసం ఈశాన్యరాష్ట్రాల వైపు దృష్టి సారించారు. ఇలా వినూత్న ఉద్యోగ విపణుల ప్రారంభంతో అనేక మంది యువకుల వలసలు ఇతర రంగాలపై తీవ్రప్రభావం చూపాయి. ఎయిర్ హోస్టెసెస్, ఫ్రంట్ డెస్క్ అసిస్టెంట్స్, సేల్స్ పర్సన్స్ వంటి ఉద్యోగాలతో పాటు హోటళ్ళు, మసాజ్ సెంటర్లలో కూడా అవకాశాలు పెరిగాయి. దీంతో ఒకప్పుడు ఢిల్లీ, బెంగళూరు, పూణే, చెన్నై, కోల్కతా, ముంబై వంటి మహానగరాలకేగాక చిన్న నగరాలూ, పట్టణాలకు కూడా వలసలు పెరిగాయి. అంతేగాకుండా దక్షిణభారత దేశంలోని తేయాకు తదితర తోటల్లోనూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న భవన నిర్మాణ కార్యకలాపాలలో కూడా ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కార్మికులు కనిపిస్తున్నారు.

## వలసలకు కారణాలు

భారీ పరిమాణం కలిగిన భారత దేశంలో ఈశాన్యం నుండి వలస వచ్చిన వారి సంఖ్య గణనీయంగా కనిపించకపోవచ్చు. అయిన ప్పటికీ, ఈవలసల స్థాయి వేగాన్ని గమనిస్తే ఇలాంటి ఆటుపోట్లు ప్రాంతీయంగా తీవ్రమైన విపరిణామాలను కలిగిస్తాయి. ఈ ప్రాంతంలో నాలుగు లోటుపాట్లు కనిస్పిస్తున్నా యని శుక్లా కమిటీ నివేదించింది. ఇందులో ఒకటి ప్రాథమిక అవసరాలు పెరుగుతుండడం, రెండు మౌలిక సదుపాయాల లోటు, మూడు వనరుల లేమితో పాటు నాలుగోది దేశం సరిహద్దుల్లో ఉన్న ఈప్రాంతాలలో పొరుగుదేశాలతోగల సంబంధాలపై కూడా తీవ్రమైన ప్రభావం కలిగివుంటాయని శుక్లా కమిటీ సంక్షిప్తంగా పేర్కొంది. ఈ అంచనా మనకు ఒక ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అందజేస్తోంది. ఇందులో మొదటి మూడు అంశాలకు ప్రాంతీయ అసమానతలు ప్రధాన కారణమనిపిస్తుంది. ఈ పరిస్థితి ఈ ప్రాంతంలో నెలకొన్న సంక్లిష్టమైన ఆర్థిక, సాంఘిక వాతావరణాన్ని ప్రతిబింబి స్తోంది. ఇందులో కూడా అత్యంత ప్రధానమైనది స్థానికంగా నాణ్యమైన విద్యావకాశాలు లేకపో వడంతో పిల్లల చదువులకోసం తలిదండ్రులు కూడా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళవలసి రావడమేనని చెప్పక తప్పదు. దీనికి తోడు తిరుగుబాటు ధోరణులు, సామాజిక రాజకీయ అశాంతి ఈ ప్రాంతంలో తరచు శాంతికి భంగం కలిగిస్తుండడం కూడా వలసలకు దారితీస్తుంది.

మరోవైపు ఉన్నత విద్యను అభ్యసించ టానికి ఇష్టపడేవారిని ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలు చాలాకాలంగా ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వోద్యోగాలు, బ్యాంకింగ్ ఉద్యోగాల్లో చేరాలనుకునేవారు, న్యాయవాదులు, విద్వాంసులు కూడా విద్యార్థి దశలోనే ఈనగరాలవైపు వలసబాట పడుతున్నారు.

## వలసదారుల జీవితం

విద్యార్థులు, ఉద్యోగార్థుల సంఖ్య వేగంగా పెగుతున్నందువల్ల కళాశాలల ప్రాంగణాల్లోను, కాల్ సెంటర్లు, మాల్స్, స్టార్ హోటళ్లు, స్పాలు తదితర ప్రదేశాలలో వీరు మరింత ఎక్కువగా కనిపిస్తారు. అయినప్పటికీ, ఒక యువ విద్యార్థికి పెద్ద నగరంలో సర్దుకోవడానికి చాలా కష్టమవడమేగాక ఎంతో ఖర్చు భరించవలసి వస్తుంది. చిన్న గ్రామాలు పట్టణాల నుంచివచ్చే చాలామంది విద్యార్థులు బలమైన సాంఘిక బంధాలను కలిగిఉంటారు. ఈ బంధాలన్నింటినీ తప్పించుకుని ఆకస్మికంగా పట్టణానికివచ్చి విభిన్నమైన పరిస్థితుల్లో బతకడం అతనికెంతో ఇబ్బంది కలిగిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో తనవంటి నేపథ్యాలనుంచి వచ్చిన స్వజనులతో

జత కట్టి మురికివాడల్లో నివసించడడంవల్ల మూకాకోరులుగా మాటపడవలసివస్తుంది. వారి విభిన్నమైన శారీరక ప్రదర్శన, మానసిక ప్రవృత్తుల వల్ల కూడా వారు సాంఘిక వివక్షతకు, సామాజిక దాడులకు లక్ష్యంగా మారిపో తుంటారు. బెంగళూరు, ఢిల్లీ తదితర నగరాల్లో వీరిపై సాంఘిక దాడులు, అవమానాలు, అత్యాచారాలు, హత్యలు, మానభంగాల కేసులు పెరిగిపోవడానికి ఇదే కారణమవుతున్నది. ఈశాన్య ప్రాంతాలనుంచి మానవ అక్రమ రవాణాకు సంబంధించిన నివేదికలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలా అవగాహనా లోపం వల్ల ఎదురయ్యే సంఘటనలు కాలక్రమంలో విభేదాలను మరింత విస్తృతపరచే ప్రమాదం ఉంది.

## బలహీనులైన వలసదారులను కాపాడడం

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన 'నిడో థనియా' అనే 19 ఏళ్ల విద్యార్థి సెప్టెంబరు 2014లో ఢిల్లీలో హత్యకు గురికావడం పెద్ద ఆందోళనకు దారితీసింది. ఈ సంఘటనతో భారతదేశ ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పరిస్థితి తీవ్రతను గుర్తించాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో – ప్రత్యేకించి మెట్రోపాలిటన్ ప్రాంతాలలో నివసించే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఆందోళనలను పరిశీలించి తగిన నివారణ చర్యలు సూచించేందుకు భారత ప్రభుత్వం ఐఏఎస్ అధికారి బెజ్ బారువా అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. అయితే నిడో వంటి ఎందరో అనేక విధాలైన హింసలకుగురైన తర్వాత చాలాకాలానికి ప్రభుత్వం కళ్ళుతెరిచి ఒక కమిటీని నియమిం చిందన్న విమర్శలున్నప్పటికీ, ఈ కమిటి సమగ్రమైన దర్యాప్తు జరిపి కీలకమైన అనేక సూచనలు చేసిందన్నది గుర్తించాల్సిన అంశమే. బెజ్ బారువా కమిటీ యొక్క సిఫార్సుల ఆధారంగా దేశంలోని అనేక నగరాల్లో ఏర్పడిన సంక్షేమ కమిటీలు ఈశాన్య రాష్ట్రాల నుంచి వలసవచ్చినవారి సమస్యలపై స్థానిక అధికారులతో కలిసి సంయుక్త సమాచార సంఘాలుగా పనిచేస్తున్నాయి. ఈ సిఫారసులను పూర్తిగా అమలు చేస్తే ఈశాన్య ప్రాంతాలనుంచి వచ్చిన వలసదారులు ఎదుర్కొంటున్నదీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మార్గంసుగమమవు తుంది. వలసదారులకు వ్యతిరేకంగా జరిగే నేరాలను పూర్తిగా అదుపుచేసేందుకు ఈ కమిటీలు భద్రతాబృందాలు కాకపోయినప్పటికీ చట్టవ్యతిరేక శక్తులకు మాత్రం దడపుట్టించే ప్రతిబంధకాలుగా పనిచేస్తాయి. అంతర్లీన సమస్యలపై ఇరురావర్గాలకు అవగాహన కల్పించి లోటుపాట్లను సరిదిద్దడానికి రెండువైపులనుంచి కృషిచేసేందుకు తోడ్పడడం దీనివల్ల కలిగే రెండో ప్రధాన ప్రయోజనం అవుతుంది. తగిన భద్రతచర్యలు తీసుకుంటూ ప్రజాసమూహాలమధ్య పరస్పర అవగాహన కోసం తరచు సంయుక్త సమావేశాలు నిర్వహించడం వల్ల లోటుపాట్లను సరిదిద్ది సయోధ్యకు వారధులుగా వినియోగపడే అవకాశం లభిస్తుంది. చట్టపరమైన సంస్థలపై అతిగా ఆధారపడడం వల్ల ఇప్పటికే నెలకొన్న అభిప్రాయబేధాలు మరింత తీవ్రతరం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తాజా వివాదాలను శాంతి భద్రతల సమస్యలు తలెత్తక ముందే ఎప్పటికప్పుడు పరిష్కరించే లక్ష్యంతో ప్రయత్నాలు సాగించాలి. చట్టాలను అమలుచేసే అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఈ కార్యక్రమాలను సులభతరం చేసే నిర్వాహకులుగా వ్యవహరిస్తూ సయోధ్య బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలకు, ఇరుపక్షాలు చెందిన సామాజిక పెద్దలకు అప్పగించడం వల్ల వారి ఆదేశాలు ఆయా వర్గీయులను కట్టడి చేసేందుకు తోడ్పడతాయి. అప్పటివరకు ఇది ఒక బలహీనమైన బంధంగానే ఉండిపోతుంది. వలసదారులపై సాగించే ఎలాంటి వివక్షతనైనా ఎదిరించే సత్తాగలిగిన విస్తృత సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ఈ కృషి జరగాలి. సమీప భవిష్యత్తులో కూడా ఈశాన్య భారతం నుంచి వలసలు ఇలాగే కొనసాగే అవకాశాలున్నాయి. అందువల్ల భవిష్యత్ తరలవారికోసం పరస్పర అవగాహనతో ఒకరినొకరు గౌరవించుకునే సురక్షితమైన సామాజిక వాతావరణం ఏర్పడడానికి బెజ్ బారువా కమిటీ రిపోర్టు అమలు చక్కటి పునాది వేస్తుంది.

## భవిష్యద్దర్శనం

గత పాతికేళ్ల కాలంలో భారతదేశం అపూర్వమైన అభివృద్ధిని సాధించి బలీయమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది. అభివృద్ధి చెందుతున్నదేశంలో ఆర్థికావకాశాలు కూడా పెరుగుతుండడం వల్ల ఈ అభివృద్ధి క్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రజలను ఆకర్షించ గలుగుతాము. ఈ సందర్భంలో, ఈశాన్య రాష్ట్రాలనుంచి వలసవచ్చిన యువత దేశంలో తామున్న ఇతర ప్రదేశాల అభివృద్ధికి దోహదపడగలుగుతారు. అయితే, దురదృష్ట వశాత్తూ ఈ వలసలకు కారణం మంచి విద్య, మౌలిక సదుపాయాల కొరత, ప్రజారోగ్య పరిరక్షణ విధానం, రాష్ట్రాలలో తగిన వనరుల లేకపోవడం వంటి అంశాలు ఆందోళనకరమైన పరిస్థితులకు దారితీయడం బాధాకరం. తమ ప్రాంతంలో ఆర్థిక అవకాశాలు లేకపోవడం, అవినీతి, పాలనా వ్యవహారాల్లో అసమర్థ నిర్వహణ, నామమాత్రపు అభివృద్ధి కూడా శైశవదశలోనే ఉండడం వంటి అంశాలు తిరుగుబాటు ధోరణులకు దారితీస్తున్నాయి.

అయితే స్థానికంగా తగిన విద్యావకాశాలు లేనప్పుడు చదువుకోసం వలసవెళ్లిన ప్రాంతాల్లో కూడా ఇతర ప్రాంతవారినుంచి పోటీ ఉండరాదని భావించేవారు ఉద్యమిస్తుండడం విద్యారంగంలో ఆందోళనకు దారితీస్తోంది విద్యార్థులు కోల్కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై, పూణే, వంటి నగరాలకు తరలిపోతుండడం వల్ల ఒకప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు విద్యాకేంద్రంగా భాసిల్లిన షిల్లాంగ్ తన ప్రభావాన్ని కోల్పోవలసి వస్తోంది. ఇతర నగరాల్లో జీవన వ్యయం అధికంగా ఉండడం వల్ల విద్యాభ్యాసం కూడా ఖరీదైపోతోంది. ఈ ప్రాంతంలోని పర్యాటక రంగం, ఐటీ ఆధారిత సేవా రంగం, ఆహార ప్రాసెసింగ్, ఆతిథ్య రంగం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ఉద్యోగ అవకాశాలు లేవు.

వికృతమైన ఈ వలసలవల్ల అభివృద్ధిరంగంలో ఎదురయ్యే ఆటుపోట్ల ఫలితంగా అనవసర ఖర్చులు, వాటితోబాటు అసమానతలు కూడా పెరిగిపోయి అభివృద్ధి అస్థవ్యస్థనంగా తయారవుతోంది. ఈ రంగాల్లో అభివృద్ధి పరంగా చెల్లించాల్సిన భారీ మూల్యంతో ఈ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందుతుందో స్పష్టంగా తెలుస్తుంది.

భారత ప్రభుత్వంలో ఈశాన్య ప్రాంతం అభివృద్ధికోసం ఒక ప్రత్యేక శాఖను నెలకొల్ప డమేగాక ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి మండలిని కూడా ఏర్పాటుచేయడంతో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి సమస్యలపై దృష్టి సారించడం ఒక సమగ్ర ప్రయత్నమేనని చెప్పుకోవచ్చు. ఈశాన్య ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు రైలు, రోడ్డు, జల, వాయుమార్గాలను, కమ్యూనికేషన్ నెట్వర్క్ను అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించడం స్వాగతించదగ్గ మార్పుగా పరిగణించవచ్చు. దీనికి తోడు మరిన్ని సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్ప డంతోబాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలను మరింత అభివృద్ధి చేయడం, వివిధ అభివృద్ధి పథకాలను వేగవంతంగా అమలుచేయడంపై శ్రద్ధ వహిస్తున్నది. ప్రభుత్వం చేపట్టిన "లుక్ ఈస్ట్ పాలసీ" ద్వారా అభివృద్ధి యంత్రాన్ని సమకూర్చి ఈశాన్య ప్రాంత సమగ్ర స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసేందుకు ప్రయత్నం జరుగుతున్నది. దీనివల్ల ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి పెట్టుబడులుపెట్టి అక్కడ అభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశం కల్పించింది. కానీ ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి అనుకున్నవిధంగా ఆశించిన స్థాయిలో సాకారం కావాలంటే ఈ పథకాలన్నింటినీ సక్రమంగా అమలుచేయగలిగి విజయం సాధించవలసిఉంటుంది.

"అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే భారతదేశం అభివృద్ధి సాధించగలుగుతుంది. కానీ ఈశాన్య ప్రాంతాలను అభివృద్ధి చేయలేక పోవడానికి తగిన కారణమేదీ నాకు కనిపించడంలేదు" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా చెప్పడం విశేషం. ఇప్పటివరకు దక్కని అభివృద్ధి ఫలాలను చేజిక్కించుకోవడానికి ఈశాన్య ప్రాంతాల ప్రజలే ముందుకు రావాలన్న ఆశావాదమే ఈ మాటల్లో కనిపిస్తున్నది. ఇప్పుడు దీనికి సమాధానంగా "ఈశాన్య రాష్ట్రాలను ఎలా ప్రధాన స్రవంతిలో కలపగలమని తిరిగి ప్రశ్నించుకోవలసిందే.

■

## గమనిక:

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆ సమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేదీ తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

– సీనియర్ సంపాదకుడు

*41వ పేజీ తరువాయి...*

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ - 2018-19 ఒక పరిశీలన

ఆదాయం రూ. 1,42,054 కు చేరుకుందని రాష్ట్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1,23,664 గా ఉంది. ఏడాది వ్యవధిలో ఇది రూ. 18,390 (14.87 శాతం) పెరిగింది. ఇది జాతీయ తలసరి ఆదాయం (రూ. 1,12,764) కన్నా ఎక్కువ. గత మూడేళ్ళతో పోలిస్తే సేవలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు, ఎనలేని పురోగతిని కనబర్చటంతో పాటు రెండంకెల స్థాయిలో వృద్ధి రేటును కొనసాగించటం బాగా కలిసొచ్చేలా చేసింది. 2011-12 ప్రమాణాల మేరకు తాజా లెక్కలను పరిశీలించగా 2017-18 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి రేటు 11.22 శాతం చేరుకుంది. అంటే స్థిర ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి 6,07,388 కోట్లగా నమోదైనట్లు సర్వే తెలిపింది.

2016-17 ఆర్థిక సంవత్సరానికి ఇది 5,46,104 కోట్లుగా ఉంది. కాగా వ్యక్తుల ఆదాయం పెరగటంలో పాటు నిత్యావసరాలు, ఆహార పదార్థాల ధరల్లోను పెరుగుదల కనిపించింది. ప్రభుత్వం ఎంపిక చేసిన ఆరు రకాల నిత్యావసరాల ధరలు పెరిగాయి. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు వల్ల అవినీతి దుబారా బాగా తగ్గి 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,525.87 కోట్లు ఆదా అయినట్లు సర్వే వెల్లడించింది.

**రంగాల వారీగా వృద్ధి :**

రాష్ట్ర జి.డి.పి.తో పాటు ఆదాయం పెరగడంలో కీలక రంగాలు గణనీయమైన పురోగతి సాధించడమే కారణం. వ్యవసాయ రంగం 17.76 శాతం పారిశ్రామిక రంగం 8.49 శాతం సేవా రంగం 9.11 శాతం స్థూల వ్యవసాయము వృద్ధి ని కనబర్చాయి.

■

# కేంద్ర బడ్జెట్ 2018 - 19 : ఆదాయపన్ను మార్పులు

- ప్రొఫెసర్ వి. ఉషా కిరణ్




**పన్నులను నిజాయితీగా కట్టే వారు ఉద్యోగస్తులే అని వారికి కొంత పన్ను రాయితీ కల్పించాలని బడ్జెట్ ప్రసంగములో విత్త మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొంటూ రూ. 40,000 ప్రామాణిక తగ్గింపుగా ప్రకటించారు. ఒకవైపు ప్రామాణిక తగ్గింపు జీతం ద్వారా వచ్చే ఆదాయానికి వర్తిస్తుందని చెప్పినట్టే, మరోవైపు ఇంతకు ముందు ప్రకటించిన రవాణా మరియు వైద్య భత్యముపై తగ్గింపులను తీసివేశారు. దీనితో ప్రామాణిక తగ్గింపు ఇచ్చిన సంతృప్తి నామమాత్రముగానే మిగిలింది. దీనివలన ఉద్యోగులకు పన్ను ఆదా గొప్పగా ఏమీ ఉండదు.**

ప్రతి సంవత్సరం పార్లమెంటులో ప్రవేశ పెట్టే ఆర్థిక బిల్లుపై అన్నీ రంగాల వారు ఆతృతతో ఎదురు చూస్తారు. బడ్జెట్ ప్రతిపాదనలు, వివిధ రంగాలకు కల్పించే నిధుల కేటాయింపు, పన్నుల్లో మార్పులు వివిధ రంగాలపై ప్రభావం చూపెడ్తాయి. సాధారణ వ్యక్తులతో పాటు కార్పొరేటు రంగాల వారు కూడా ఉత్కంఠతో ఎదురుచూసేది, పన్నుల్లో ఏమైనా మార్పులు న్నాయా అని !

ప్రతి సంవత్సరం ప్రవేశపెట్టే ఆర్థిక బిల్లు, పార్లమెంట్ మరియు రాష్ట్రపతి ఆమోదముతో ఆర్థిక చట్టంగా మారుతుంది. తద్వారా పన్నులకు ఆ ఆర్థిక సంవత్సరానికి చట్ట బద్ధత కలుగుతుంది.

ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలలో పన్ను ద్వారా వచ్చే ఆదాయం మొదటి స్థానంలో ఉంటుంది. ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని పొందుతుంది. ప్రత్యక్ష పన్నులలో ఆదాయపు పన్ను అతి ముఖ్యమైనది. క్రింద ఇచ్చిన గణాంకాలు చూసినట్లయితే ప్రత్యక్ష పన్నులు ఏ విధంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూరుస్తాయో అర్థమౌతుంది.

**2012-13 నుండి 2017-18 వరకు ప్రత్యక్ష పన్ను ఆదాయం**

| సంవత్సరం | పన్ను (కోట్ల రూ.లో) |
|---|---|
| 2012-13 | 5,58,965 |
| 2013-14 | 6,38,543 |
| 2014-15 | 6,95,797 |
| 2015-16 | 7,48,0,00 |
| 2016-17 | 8,47,000 |
| 2017-18 (అంచనా) | 9,80,000 |

మూలం: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు, ఉమ్మడి హిందూ కుటుంబాలు, సహకార సంస్థలు, వ్యక్తుల సముదాయాలు మరియు సమూహాలు, స్థానిక సంస్థలు మరియు కల్పిత వ్యక్తులు లేదా సంస్థలు ఆదాయపు పన్నును చెల్లిస్తాయి. జీతం, గృహాలపై వచ్చే ఆదాయం, వ్యాపారం లేదా వృత్తులలో కలిగే లాభాలు, మూలధన లాభాలు మరియు ఇతర వనరుల వలన వచ్చే ఆదాయాలపై ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ చట్టంలో ఏదైనా మార్పు చేయాలంటే ప్రతి సంవత్సరం పార్లమెంట్లో

డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail: usha_ou@yahoo.co.in

ప్రవేశపెట్టే ఆర్థికబిల్లు ద్వారా సాధ్యమవుతుంది.

బడ్జెట్ 2018లో పన్నుల రేట్లను చూసినట్లయితే, 2018-2019 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఇంతకు ముందు సంవత్సరాల పన్ను రేట్లకు పెద్దగా తేడాలేదు. పన్నులు విధించని కనీస ఆదాయ వ్యవధిలో కూడా ఏమీ మార్పులేదు. గతంలో లాగానే, వ్యక్తులను 60 ఏళ్ళ వరకు, 60 నుండి 80 ఏళ్ళ వరకు, మరియు 80 ఏళ్ళ పైబడిన వారిగా 3 రకాలుగా విభజన కొనసాగించారు. 2018-2019 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పరిమితి, పన్ను రేట్లు క్రింద పట్టికలో చూడండి

అరుణ్ జైట్లీ పేర్కొంటూ రూ. 40,000 ప్రామాణిక తగ్గింపుగా ప్రకటించారు. ఒకవైపు ప్రామాణిక తగ్గింపు జీతం ద్వారా వచ్చే ఆదాయానికి వర్తిస్తుందని చెప్పినట్టే, మరోవైపు ఇంతకు ముందు ప్రకటించిన రవాణా మరియు వైద్య భత్యముపై తగ్గింపులను రద్దుచేశారు. వైద్య ఖర్చులను తిరిగి చెల్లించినపుడు పన్ను లేని పరిమితి రూ.15,000 వరకు ఉండేది. రూ. 1,600 నెలకి రవాణా ఖర్చులను పన్ను లేని పరిమితిగా ఇంతకు పూర్వం ప్రకటించారు. ఈ రెండింటినీ తొలిగించడం వలన సుమారుగా పన్ను లేని జీతం రూ. 34,200 సంవత్సరానికి ఉద్యోగులు కోల్పోతారు. దీనితో ప్రామాణిక

పన్ను చట్టం 1961 ప్రకారం ఏదేని లాభము వచ్చినట్లయితే దానిని దీర్ఘకాలిక ఆస్తులపైన వచ్చినదా లేక స్వల్పకాలిక ఆస్తుల పైన వచ్చినదా అని నిర్ధారించి పన్ను విధిస్తారు. ఆర్థిక సంబందము కల ఆస్తులు, పెట్టుబడులు 12 నెలల కాలవ్యవధి తర్వాత అమ్మినట్లయితే, మిగిలిన ఆస్తులను 36 నెలల కాలవ్యవధి తర్వాత అమ్మినట్లయితే, వాటిని దీర్ఘకాలిక ఆస్తులుగా గుర్తిస్తారు. పైన చెప్పిన కాలవ్యవధి లలోనే ఆస్తులను అమ్మినట్లయితే తద్వారా వచ్చిన లాభాన్ని స్వల్పకాలిక ఆస్తులపై వచ్చిన లాభంగా గుర్తించాలి. కంపెనీ వాటాలు, స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల బదిలీలపై

**వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితులు**

| క్రమ | 60 ఏళ్ళ వరకు * | | 60 నుండి 80 ఏళ్ళ వరకు | | 80 ఏళ్ళ పైబడిన వారికి | |
|---|---|---|---|---|---|---|
| సంఖ్య | ఆదాయము | పన్ను శాతము | ఆదాయము | పన్ను శాతము | ఆదాయము | పన్ను శాతము |
| 1. | రూ. 2,50,000 వరకు | లేదు | రూ. 3,00,000 వరకు | లేదు | రూ. 5,00,000 వరకు | లేదు |
| 2. | రూ. 2,50,001 నుండి 5,00,000 వరకు | 5శాతం | రూ. 3,00,001 నుండి 5,00,000 వరకు | 5 శాతం | రూ. 5,00,001 నుండి 10,00,000 వరకు | 20 శాతం |
| 3. | రూ. 5,00,001 నుండి 10,00,000 వరకు | 20 శాతం | రూ. 5,00,001 నుండి 10,00,000 వరకు | 20 శాతం | రూ. 10,00,001 పై | 30 శాతం |
| 4. | రూ. 10,00,001 పై | 30 శాతం | రూ. 10,00,001 పై | 30 శాతం | - | - |
| 5. | పన్నుపై సుంకం | 4 శాతం | పన్నుపై సుంకం | 4 శాతం | పన్నుపై సుంకం | 4 శాతం |

* ఈ ఆదాయపన్ను పరిమితులు వ్యక్తులకు, ఉమ్మడి హిందూ కుటుంబాలకు వ్యక్తుల సమూహము కల్పిత సంస్థలకు కూడా వర్తిస్తాయి.

మొత్తం ఆదాయం రూ 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఉన్నట్లయితే 10 శాతం చొప్పున, రూ. కోటి మించిన్నట్లయితే 15 శాతం పన్నుపై పన్ను (సర్‌చార్జ్) విధించబడుతుంది. సహకార మరియు భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు, స్థానిక సంస్థలు చెల్లించే ఆదాయపు పన్ను రేట్లు, సర్‌చార్జ్ గత సంవత్సరము మాదిరిగానే ఉన్నాయి.

**జీతాల ద్వారా పొందే ఆదాయం - పన్నుల్లో మార్పులు**

పన్నులను నిజాయితీగా కట్టే వారు ఉద్యోగస్తులే అని వారికి కొంత పన్ను రాయితీ కల్పించాలని బడ్జెట్ ప్రసంగములో విత్త మంత్రి

తగ్గింపు ఇచ్చిన సంతృప్తి నామ మాత్రముగానే మిగిలిపోయింది. దీనివలన ఉద్యోగులకు పన్ను ఆదా గొప్పగా ఏమీ ఉండదు.

ఉద్యోగుల భవిష్యనిధికి ఉద్యోగులు చెల్లించాల్సిన ప్రస్తుత వాటా 12 శాతం. కొత్తగా చేరే మహిళా ఉద్యోగినులకు ఈ 12 శాతాన్ని 8 శాతానికి తగ్గించారు. దీని వలన నికర జీతం (Take Home Pay) పెరుగుతుంది. అన్ని రంగాలలో కొత్త ఉద్యోగులకు ప్రభుత్వం తన వాటా వంతుగా జీతం లో 12 శాతాన్ని వచ్చే మూడు సంవత్సరాల కాలానికి చెల్లిస్తుంది.

**మూలధన లాభాలు-పన్ను మార్పులు:**

ఆస్తులను బదిలీ చేసినపుడు, ఆదాయపు

వచ్చిన లాభాలపై 2004-2005 గణాంక సంవత్సరం వరకు దీర్ఘకాలిక మూలధన పన్ను విధించేవారు. ఆ తర్వాత సెక్షన్ 10 ప్రకారం ఆర్థిక సంబంధం కల ఆస్తుల బదిలీలపై కలిగే లాభాలను పన్ను నుండి మినహాయించారు. . ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం వీటికి సంబంధించిన లావా దేవీలు జరిగినట్లయితే సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను విధించేవారు. ఈ ఆర్థిక సంవత్సరము నుండి తిరిగి సెక్షన్ 112 (A) ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక సంబంధిత మూలధన లాభాలపై 10 శాతం క్రొత్త పన్నును ప్రవేశపెట్టారు. దీని ద్వారా స్టాక్ మార్కెట్లు మరియు ఈక్విటి మ్యూచ్యువల్ ఫండ్స్‌లో పెట్టే పెట్టుబడుల ద్వారా వచ్చే దీర్ఘకాలిక మూలధన

లాభాలపై పన్ను విధిస్తారు. అంటే, తిరిగి 2018–2019 ఆర్థిక సంవత్సరములో వీటిని పన్ను పరిధిలోనికి తీసుకొచ్చారు. లాభాన్ని లెక్కించడంలో ఆస్తుల కొనుగోలు ధరను (cost) ద్రవ్యోల్బణ సూచీల సహాయముతో ప్రస్తుత కొనుగోలు ధరలకు మారుస్తారు. కానీ ఈ పన్నుని లెక్కించడానికి బదిలీ తేదీని జనవరి 31, 2018 గా గుర్తించారు. అనగా జనవరి 31, 2018 నాడు వాటాలు, స్టాకు మరియు ఇతర పెట్టుబడుల మార్కెటు ధర ఎంత మరియు వాటిని కొన్నప్పుడు ఎంత చెల్లించారు అన్నది చూసికొని రెండింటిలో ఏది ఎక్కువైతే దానిని వాటాలు, స్టాక్స్ లేదా మ్యూచ్యువల్ ఫండ్ ధరగా తీసుకొంటారు. అమ్మినప్పుడు వచ్చే ధరతో (ఖర్చులతో సహా) దీనిని పోల్చిచూసి ఎంత లాభం వచ్చిందో గుర్తించాలి. మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఈ లాభం రూ. 1,00,000 మించినట్లయితే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది. ఈ పన్ను ఏప్రిల్ 1, 2018 తర్వాత కలిగే లాభాలపైనే వర్తిసుంది. సెక్షన్ 115 (R) ప్రకారం కంపనీ లేదా మ్యూచువల్ ఫండ్ తమ వాటాదారులకు ఆదాయాన్ని పంచినట్లయితే అదనపు ఆదాయపు పన్ను చెల్లించాల్సివచ్చేది. వృద్ధి ఆధారిత మరియు డివిడెండ్ ఆధారిత ఫండ్ మధ్యలో తేడా లేకుండా ఉండేందుకై మ్యూచువల్ ఫండ్ ద్వారా చెల్లించే ఏ విధమైన చెల్లింపుకైనా అదనపు ఆదాయపు పన్ను 10 శాతం చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇది పన్నుల్లో ఒక కొత్త పరిణామం.

ఈ కొత్త సుంకం ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్ర పరిణామాన్ని చూపెట్టింది. బీఎస్ఈ మరియు నిఫ్టీ సూచీలు దెబ్బతిని పెట్టుబడిదారుల మార్కెట్ మూలధన విలువ లక్షల కోట్లు తగ్గిపోయింది. ఈ తగ్గుదలకి ఇతరత్రా కారణాలు ఉన్నప్పటికి, దీర్ఘకాలిక మూలధన లాభాలపై క్రొత్తగా విధించిన పన్ను ఒక ముఖ్య కారణం.

**స్థూల ఆదాయం తగ్గింపులో మార్పులు**

వైద్య బీమా ప్రీమియంపై (సెక్షన్ 80D) 60 ఏళ్లలోపు వ్యక్తులకు, వృద్ధులు మరియు వయోవృద్ధులకు ఆదాయంలో రూ. 30,000 వరకు తగ్గింపు లభించేది. ఇది ఉమ్మడి కుటుంబాలకు కూడా వర్తిస్తుంది. ప్రస్తుత ఆర్థిక బిల్లులో ఈ పరిమితిని రూ. 50,000 వరకు పెంచారు.

80 DDB క్రింద తీవ్రమైన వ్యాధులతో బాధ పడే 60 ఏళ్లలోపు వ్యక్తులకు, వారిపై ఆధారపడిన వారికి, వృద్ధులకు మరియు వయోవృద్ధులకు చెల్లించిన వైద్య బిల్లులకు ప్రతి ఏటా రూ. 40,000, రూ. 60,000 రూ . 80,000 ల మినహాయింపు ఉండేది. రూ. 60,000 మరియు రూ . 80,000 ల మినహాయింపును రూ. 1,00,000 వరకు పెంచారు.

సెక్షన్ 80 TTA ప్రకారం పొదుపు ఖాతాపై వచ్చే వడ్డీ రూ. 10,000 వరకు ఆదాయంలో మినహాయింపు ఉండేది. సెక్షన్ 80 TTB (క్రొత్త సెక్షన్) ద్వారా వృద్ధులకు డిపాజిట్లపై వచ్చే వడ్డీని రూ. 50,000 వరకు పెంచారు. వీటికి సెక్షన్ 80 TTA మినహాయింపు లభించదు. దీనికి అనుగుణంగా సెక్షన్ 194 A క్రింద వృద్ధుల యొక్క ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు రికరింగ్ డిపాజిట్ల వడ్డీపై ఆదాయము మూలము వద్ద పన్ను వసూలు పరిమితిని రూ. 10,000 నుండి రూ. 50,000 వరకు పెంచారు. అంటే రూ. 50,000 వరకు వడ్డీపై పన్ను వసూలు ఆధారంలో జరగదు.

**పన్నుపై సర్‌చార్జ్‌లో మార్పులు:**

గత సంవత్సరం పన్నుపై 2 శాతం ప్రాథమిక విద్య + 1 శాతం మాధ్యమిక మరియు ఉన్నత విద్య సుంకము విధించేవారు. ఇప్పుడు దీన్ని ఒక శాతం పెంచుతూ 4 శాతం వైద్య మరియు విద్యా సుంకాన్ని విధిస్తారు. ఇది వ్యక్తులకు, కంపెనీలకు మరియు పన్ను కట్టే వారందరికీ వర్తిస్తుంది.

పెరిగిన సుంకం రేట్లను చూసినట్లయితే, పన్ను కట్టే బాధ్యత గతంలో కంటే సుమారు రూ. 100 నుండి రూ. 2,625 వరకు వివిధ పన్ను విభాజనాల్లో పెరుగుతుంది. దీని ద్వారా ప్రభుత్వము రూ. 11,000 కోట్లు అదనపు ఆదాయం పొందుతుంది.

**ముగింపు**

పైన వివరించిన పన్నుల్లో మార్పులను చూసినట్లైతే ఈ ఆర్థిక బిల్లు ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం నామమాత్రాంగానే పెరుగుతుంది. అదే విధంగా పన్ను చెల్లింపుదారులకు పన్నులలో అంత గొప్ప మార్పులు ఏమీ కనిపించవు. కాబట్టి ఈ బడ్జెట్ సాధారణమైన మరియు జనరంజకంకాని బడ్జెట్‌గా చెప్పుకోవచ్చు. ■


యోజన

మే, 2018 సంచిక

పౌష్టికాహారం

# మనసులోని మాట




**ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" (మనసులోని మాట) కార్యక్రమం ద్వారా మార్చి 25, 2018 న ఆకాశవాణిలో దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం సంక్షిప్తంగా!**

**నా ప్రియమైన దేశప్రజలారా, నమస్కారం!**

కొద్ది రోజుల క్రితం జనవరి 26వ తేదీన ఆసియాన్‌లోని (ASEAN) పలు దేశాల నేతలందరూ ఇక్కడికి వచ్చినప్పుడు వారందరూ తమ, తమ సాంస్కృతిక బృందాలను వెంట తీసుకువచ్చారు. వారిలో ఎక్కువ శాతం రామాయణాన్ని ప్రదర్శించడం మనమెంతో గర్వించదగ్గ విషయం. అంటే రాముడు, రామాయణం కేవలం మన భారతదేశానికే కాక ప్రపంచ భూభాగంలో ఒకటైన ఈ ఆసియా దేశాలన్నింటికీ కూడా ప్రేరణను అందించి, ప్రభావితం చేసిందన్న మాట. నేను మరోసారి మీ అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియపరుస్తున్నాను.

అస్సాంలోని కరీమ్ గంజ్‌లో ఉండే అహ్మద్ అలీ అనే ఒక ఆటోరిక్షా నడిపుకునే వ్యక్తి, తన పట్టుదలతో తొమ్మిది స్కూళ్ళు కట్టించాడు అనే విషయం నాకు మీ అందరి ఉత్తరాల ద్వారానే తెలిసింది. ఇలాంటి ఉత్తరాల వల్లనే మన దేశం యొక్క మొక్కవోనిన పట్టుదల నాకు కనబడుతుంది. కాన్పూర్‌లోని డాక్టర్ అజీత్ మోహన్ చౌధురీ గారి కథ విన్నప్పుడు, ఆయన ఫుట్‌పాత్‌పై నివసించే పేదవారి వద్దకు వెళ్ళి, వారికి వైద్యసేవలను అందించడమే కాక వారికి ఉచితంగా మందులు కూడా అందిస్తారని తెలిసినప్పుడు, ఈ దేశపు సౌభాతృత్వాన్ని తెలుసుకునే అవకాశం నాకు లభించింది. 13 ఏళ్ల క్రితం సకాలంలో వైద్యం అందక పోవడం వల్ల, కలకత్తాలోని కేబ్ డ్రైవర్ సైదుల్ లస్కర్ సోదరి మరణించింది. అందుకని సకాలంలో వైద్యం అందకపోవడం వల్ల మరే ఇతర పేదవ్యక్తీ చనిపోకూడదన్న సదుద్దేశంతో, ఒక ఆసుపత్రిని నిర్మించాలని ఆయన సంకల్పించాడు. తన ఈ లక్ష్యం కోసం సైదుల్ ఇంట్లోని నగలన్నింటినీ అమ్మాడు, దానాలను స్వీకరించాడు. అతడి కేబ్‌లో ప్రయాణించిన ఎందరో ప్రయాణికులు మనస్ఫూర్తిగా దానాలని ఇచ్చారు. ఒక మహిళా ఇంజినీరు తన మొదటి జీతాన్ని సైతం అతడికి ఇచ్చేసింది. ఇలా సమకూర్చుకున్న సొమ్ముతో చివరికి పన్నెండేళ్ల తరువాత, సైదుల్ లస్కర్ తన భగీరథ ప్రయత్నంలో సఫలం సాధించి, తన శ్రమ ఫలితంగా, తన సంకల్పం కారణంగా, కలకత్తా దగ్గరలో పునరీ గ్రామంలో దాదాపు ముప్పై పడకలు ఉన్న ఆసుపత్రిని తయారు చేసాడు. ఇది న్యూ ఇండియా బలం.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక మహిళ అనేక సంఘర్షణల తరువాత 125 మరుగుదొడ్ల నిర్మాణం జరిపి, మహిళలందరినీ వారి హక్కుల కోసం పోరాడడానికి ప్రేరణను అందించినప్పుడు, మాతృశక్తి దర్శనం అయ్యింది.

వ్యవసాయంతో ముడిపడిన వారి అనుభవాలను తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, వ్యవసాయంతో ముడిపడిన ఆవిష్కరణల గురించి తెలుసుకోవడం నాకొక ఆనందకరమైన విషయం. మేఘాలయలోని రైతుల శ్రమను గురించి తెలుసుకోవడం నన్ను అన్నింటికన్నా ఎక్కువగా ప్రభావితం చేసింది. తక్కువ దిగుబడి వచ్చే ఈ ప్రాంతం

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం సౌజన్యంతో.....

వారు గొప్ప పని చేసి చూపించారు. మేఘాలయలోని మన రైతుసోదరులు 2015-16 సంవత్సరంలో గత ఐదేళ్ల రికార్డునీ అధిగమించి రికార్డు స్థాయిలో ఉత్పత్తిని చేసి చూపించారు. లక్ష్యం నిర్ధారితమై ఉన్నప్పుడు, చెక్కుచెదరని ధైర్యం ఉన్నప్పుడు, మనసులో సంకల్పం ఉన్నప్పుడు, లక్ష్యాన్ని తప్పక చేరుకోగలము అని వాళ్లు చూపెట్టారు.

సూచించిన పంటలకు కనీస మద్దతు ధరను వారి పెట్టుబడిలో కనీసం ఒకటిన్నర రెట్లు ఉండేలాగ నిర్ణయించడం జరిగింది. వివరంగా చెప్పాలంటే, MSP ని లెక్కించడం కోసం ఏ పెట్టుబడి అయితే పెడతారో అందులో ఏవేమి కలుస్తాయంటే – పొలంలో పనిచేసేవారి కూలీ, పశువుల ఖర్చు, వాటి గ్రాసం, మషీన్ అద్దెకు తెచ్చిన వాటి ఖర్చు, ఉపయోగించిన అన్నిరకాల ఎరువుల ఖరీదు, నీటి పారుదల ఖర్చు, ప్రభుత్వానికి కట్టే భూమి శిస్తు, వర్కింగ్ క్యాపిటల్‌పై కట్టవలసిన వడ్డీ, కౌలుకు తోసుకున్న భూమి తాలూకూ అద్దె, మొదలైనవన్నీ కలుస్తాయి. ఇంతేకాక, శ్రమించే రైతుతో పాటూ అతడి కుటుంబ సభ్యులెవరైనా కూడా అతడికి సహాయపడితే వారి శ్రమ విలువను కూడా ఈ ఖర్చులో కలుపుతారు. రైతులకు తమ ఉత్పత్తులను అమ్మడానికి ఎంతో దూరం వెళ్ళాల్సిన అవసరం లేకుండా దేశంలోని ఇరవై రెండువేల గ్రామీణ మార్కెట్లను అవసరమైన ప్రాథమిక సదుపాయాలతో అభివృద్ధి పరుస్తూ, APMC, ఇంకా e-NAM platform తోటి వాటిని అనుసంధాని స్తున్నారు.

**ఈ సంవత్సరం మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాలు మొదలవుతాయి. ఇది ఒక చారిత్రాత్మిక సందర్భం. దేశం ఏ విధంగా ఈ ఉత్సవాన్ని జరుపుకోవాలి? పరిశుభ్ర భారతదేశాన్ని తయారుచెయ్యడం అనేది ఎలానూ మన సంకల్పమే. ఇది కాకుండా 125 కోట్ల దేశవాసులందరూ కలిసి గాంధీ గారికి ఎటువంటి ఉత్తమమైన శ్రద్ధాంజలి ఇవ్వగలం? మీరందరూ "మై గౌ" యాప్ ద్వారా ఈ విషయంపై మీ అభిప్రాయాలను పంచు కోవాల్సిందిగా నేను కోరుతున్నాను.**

ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21కు ఇంకా వంద రోజులు కూడా లేవు. మన కుటుంబాన్నీ, స్నేహితులనూ, అందరినీ యోగా చెయ్య వలసిందిగా ప్రోత్సహించడం ఇప్పటి నుండే మొదలుపెట్టండి. నేడు దేశవ్యాప్తంగా మూడువేల కంటే ఎక్కువ సార్వజనిక ఔషధ కేంద్రాలు తెరవబడ్డాయి. వాటిల్లో దాదాపు 800 కన్నా ఎక్కువ మందులు తక్కువ ధరకే లభ్యమౌతున్నాయి. ఇటువంటివే మరిన్ని కేంద్రాలు తెరిచే ప్రయత్నాలు జరుగు తున్నాయి. అవసరం ఉన్నవారికి ఈ సార్వజనిక ఔషధ కేంద్రాల వివరాలను తెలిపి, వారి మందుల ఖర్చుని తగ్గించాల్సిం దని నేను 'మనసులో మాట' శ్రోతలను కోరుతున్నాను. దీనివల్ల వారికెంతో సహాయం లభిస్తుంది. హృద్రోగులకు heart stent ధర 85శాతం వరకూ తగ్గించడం జరిగింది. మోకాళ్ళలో అమర్చే ఉపకరణాల ధరను కూడా బాగా నియంత్రించి 50 నుండి 70 శాతం వరకూ తగ్గించడం జరిగింది. "ఆయుష్మాన్ భారత" యోజనలో భాగంగా దాదాపు పది కోట్ల కుటుంబాలకి, అంటే దాదాపు ఏభై కోట్ల ప్రజలకి ఒక సంవత్సర కాల వైద్యానికి గానూ ఐదు లక్షల రూపాయిల ఖర్చులను భారత ప్రభుత్వం, ఇన్సురెన్స్ కంపెనీ కలిపి ఇస్తాయి. దేశంలో ఉన్న 479 వైద్య కళాశాలల్లో MBBS సీట్ల సంఖ్యను పెంచి, దాదాపు 68 వేల సీట్లు చేశాము. దేశవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వైద్యం, ఆరోగ్య సదుపాయాలూ అందించేందుకు గానూ వివిధ రాష్ట్రాల్లో కొత్తగా అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలను ప్రారంభిస్తున్నాము. ప్రతి మూడు జిల్లాలకూ మధ్య ఒక కొత్త వైద్య కళాశాల నిర్మించబడుతుంది. 2025 నాటికల్లా దేశం నుండి క్షయను పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించాము. దేశం టి.బి నుండి విముక్తిని పొందడానికి మనందరమూ కలసికట్టుగా ప్రయత్నం చెయ్యాలి.

నా ప్రియమైన దేశప్రజలారా, రాబోయే రోజుల్లో ఎన్నో పండుగలు రాబోతున్నాయి. ఈ పండుగలన్నీ ఏదో ఒక రూపంలో మన వ్యవసాయంతోనూ, ధాన్యపు రాసులతోనూ, అన్నదాతలతోనూ ముడిపడి ఉంటాయి. దిగుబడి రూపంలో లభించే అపురూపమైన కానుకలకు మనం ఈ పండుగల మాధ్యమం ద్వారా ప్రకృతికి ధన్యవాదాలు సమర్పిస్తాము. మరోసారి మళ్ళీ మీ అందరికీ రాబోయే అన్ని పండుగల సందర్భంగా అనేకానేక శుభాకాంక్షలు. అనేకానేక ధన్యవాదాలు. ■

## యోజన చందాదారులకు సూచన:

యోజన తెలుగు మాస పత్రిక డిజిటలైజ్ అయింది. దీనితో ఒక సంవత్సర చందాదారునికి సాలుకు 12 సంచికలు పంపటానికి మాత్రమే వీలవుతుంది. అనగా ఇప్పటి వరకు జరుగుతున్నట్లుగా సంచిక అందలేదని తెలిపితే మరో కాపీని పంపటానికి ఇకపై వీలవదు. కనుక చందాదారులు తమ చిరునామాకు సంబంధించిన పోస్టల్ విభాగంతో తమ ఏర్పాట్లు తామే గట్టిగా చేసుకోవాలి, గమనించగలరు.

**– సీనియర్ ఎడిటర్**

# తెలంగాణలో లక్షరూపాయలు దాటిన 'పెళ్లికానుక'

పెళ్లిచేసిచూడు, ఇల్లుకట్టి చూడూ అనేది నానుడి . అంటే ఈ రెండూ ఎంతో ఖర్చుతో, శ్రమతో కూడుకున్నవని దీని పరమార్థం. కానీ, తెలంగాణ రాష్ట్రంలో ఈ రెండూ, ముఖ్యంగా నిరుపేదలకు అందని ద్రాక్షపండ్లు ఏమీ కాదని రాష్ట్ర ప్రభుత్వం నిరూపిస్తోంది.

నిరుపేద వర్గాలకు ఉచితంగా డబుల్ బెడ్ రూం ఇళ్ళుకట్టించి ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఆడపిల్లల పెండ్లికి కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్ పేరుతో ఆర్థిక సహాయం కూడా అందించి ఆదుకుంటోంది. ఇప్పుడు ఈ ఆర్థిక సహాయం మొత్తాన్ని రూ. 1,00,116 లకు పెంచారు.

మన సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. ఈ భారం వల్లనే చాలామంది తల్లిదండ్రులు తమ ఇంటి మహాలక్ష్మిగా గౌరవించే ఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించే మానసిక స్థితికి గురవుతున్నారు. ఆడపిల్ల కడుపులో ఉండగానే, ఆ పిల్ల పెండ్లి కోసం చేయవలసిన ఖర్చును ఊహించి కొంతమంది భ్రూణ హత్యలకు పాల్పడు తున్న అమానుష సంఘటనలు చోటుచేసు కుంటున్నాయి. కొన్నిసార్లు పేదల ఇళ్ళలో ఆడపిల్లలు పెండ్లి కాకుండానే మిగిలిపో తున్నారు.

కళ్యాణలక్ష్మి అనే పేరుతో 2014 అక్టోబర్ 2వ తేదీ నుంచి ఈ ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొదట ఈ పథకాన్ని కళ్యాణ లక్ష్మి పేరుతో ఎస్సీ, ఎస్టీలకు, షాదీముబారక్ పేరుతో మైనారిటీ వర్గాలకు ఆడపిల్లల పెండ్లికి రూ. 51,000 అందించే పథకంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తరువాత ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు సామాజిక వర్గాలతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలందరికీ వర్తింపచేసింది. సార్థకమైన ఈ పథకం ప్రయోజనం మరింత పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ పథకం ద్వారా అందించే మొత్తాన్ని గత ఏడాది రూ. 75,116 కు ప్రభుత్వం పెంచింది. ఇప్పుడు ఈ మొత్తాన్ని రూ. 1,00,116 లకు ప్రభుత్వం పెంచింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకూ 3 లక్షల 60 వేలమందికి లబ్ధి చేకూరింది.

కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలను కూడా సాధించింది. ఈ పథకం ద్వారా లబ్ధిపొందడానికి కనీస వయోపరిమితి 18 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పథకం ప్రయోజనాలు పొందడం కోసం బాల్యవివాహాలు చేయకుండా 18 సంవత్సరాలు నిండేవరకూ తల్లిదండ్రులు వేచి వుంటున్నారు. ఈ విధంగా బాల్య వివాహాలను నిరోధించడానికి కూడా ఈ పథకం ఉపయోగపడుతోంది. కళ్యాణలక్ష్మి సహాయం అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతోపాటు చట్టబద్ధత లభిస్తోంది. ఇది ఈ పథకం సాధించిన మరో ప్రయోజనం. ■




కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీమతి స్మృతిఇరాని మార్చి 8, 2018న న్యూఢిల్లీలో ప్రచురణల విభాగం వారి నూతన తెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు.

పాఠకులు ఈ పుస్తకాలను మా విక్రయ కేంద్రం: రూమ్ నం. 204, 2వ అంతస్తు, సిజిఓ టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 500 080 లో కొనుగోలుచేయవచ్చు. ఫోన్ నం. 040-27535383 E-mail: bmsehyd@gmail.com

# తెలంగాణా రాష్ట్రబడ్జెట్ - 2018-19 : అందరికీ సంక్షేమం

- డి. సుప్రశాంతి దేవి




**2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టగా మరో వైపు తెలంగాణా ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో దేశంలోనే మొట్టమొదటిసారిగా రైతుకు పెట్టుబడి సహాయం అందించేందుకు ఒక వినూత్న పథకానికి రూపకల్పన చేసింది. "రైతులక్ష్మి" పేరిట వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులకు ఏటా ఎకరానికి రెండు పంటలు పండించేందుకు 8 వేల రూపాయలు చొప్పున పెట్టుబడి సహాయం అందనుంది. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ 12,000 కోట్లు కేటాయించింది**

"చీకటి నుంచి వెలుగు లోకి, అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి, వలస బతుకల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నాం. ఈ ప్రస్తానంలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను పేదలకు అందించాలనే ముఖ్యమంత్రి ఆశయానికి అద్దం పడుతూ తెలంగాణా రాష్ట్ర అయిదవ బడ్జెట్‌ను రూపొందించాం...."

తెలంగాణా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ మార్చి 15 , 2018 న శాసనసభకు బడ్జెట్ సమర్పిస్తూ అన్న మాటలివి. 2014 లో దేశంలో 31వ రాష్ట్రంగా అవతరించి గత నాలుగేళ్ళుగా ఎన్నో సవాళ్లును ఎదుర్కొని, వినూత్న పథకాల రూపకల్పన, అమలు లో దేశ యావత్తు దృష్టిని ఆకర్షించిన తెలంగాణా రాష్ట్రం ప్రగతి మార్గంలో వడివడిగా ముందుకు వెళు తోంది. ప్రతి ఏటా తలసరి ఆదాయం, స్థూల జాతీయోత్పత్తిలో జాతీయ సగటు కన్నా ఎక్కువ వృద్ధి రేటు నమోదు చేసుకుంటూ ముందుకు సాగుతున్న తెలంగాణా బంగారు తెలంగాణా లక్ష్య సాధనకు దోహదపడేలా 2018-19 రాష్ట్ర బడ్జెట్ ఆదాయ వ్యయ ప్రణాళికను ఆవిష్కరిం చింది. రాష్ట్రానికి ఏం కావాలి? వనరులు ఏమిటి? ప్రభుత్వ లక్ష్యాలు ఏమిటి? ఆదాయ, వ్యయం మధ్య సమతుల్యత ఎలా సాధించాలి? అనే అంశాలను బేరీజు వేసుకుంటూ ఏ ప్రభుత్వమయినా బడ్జెట్‌ను రూపొందిస్తుంది. ఇందులో ప్రజల ఆశలను ప్రతి బింబించడమే కాకుండా వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతూ ఆదాయ, వ్యయ పట్టికలను రూపొందించు కోవాలి. 2014 -15 లో తొలి బడ్జెట్ ను రూపొందించే సమయం లో అప్పుడే పుట్టిన తెలంగాణాకు రాష్ట్ర వనరులు, ఆదాయం, పన్ను రాబడులపై స్పష్టత లేదు. ఆ స్థితి నుండి ముందు వెళ్లి ఆర్థిక స్థితిపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకుని బడ్జెట్ పద్దులను తన లక్ష్యాలకు అనుగుణంగా రూపకల్పన చేసుకునే స్థాయికి ఎదగగలిగింది. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పూర్తి స్థాయి ఆఖరి బడ్జెట్ ను ఆర్థిక మంత్రి ప్రజల ముందు వుంచి తమ ప్రభుత్వ ప్రాధామ్యాలను స్పష్టం చేసారు. 2017-18 బడ్జెట్ కన్నా 20 శాతం అదనపు కేటా యింపులతో రూ. 1,74,453.84 కోట్ల అంచనా వ్యయంతో 2018- 19 బడ్జెట్ ను రూపొందించారు. ఇందులో 26 శాతం నిధులను వ్యవసాయం, సాగునీటి రంగాలకు కేటాయించి తమది కర్షక ప్రభుత్వం అని స్పష్టం చేసారు. నిరాస, నిస్పృహతో వున్న రైతాంగానికి పంట పెట్టుబడి, సాగు నీరు, విద్యుత్ భరోసా

సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్.
E-mail : suprasanthideviair2030@yahoo.com

కల్పించారు. అదే సమయం లో సంక్షేమ రంగాన్ని విస్మరించకుండా SC, ST, దళితులూ, మైనార్టీలకు అమలులో వున్న సంక్షేమ పథకాలకు కేటాయింపులను పెంచారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టి చేయడంతో పాటు పట్టణ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధికి ఊతం ఇచ్చేందుకు నిధులు సముచితంగా పెంచారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన చర్యలను ప్రకటించారు. పాఠశాల విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తీ ఎంతో కొంత ప్రయోజనం పొందేలా కొత్త బడ్జెట్‌ను తీర్చిదిద్దినట్లు ఆర్థిక మంత్రి చెప్పారు.

### వ్యవసాయం – రైతుకు వెన్నుదన్ను

2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టగా మరో వైపు తెలంగాణా ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో దేశంలోనే మొట్టమొదటి సారిగా రైతుకు పెట్టుబడి సహాయం అందించేందుకు ఒక వినూత్న పథకానికి రూపకల్పన చేసింది. "రైతులక్ష్మి" పేరిట వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులకు ఏటా ఎకరానికి రెండు పంటలు పండించేందుకు 8 వేల రూపాయలు చొప్పున పెట్టుబడి సహాయం అందనుంది. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ 12,000 కోట్లు కేటాయించి ప్రభుత్వం ఈ పథకం అమలు పట్ల తన కున్న నిబద్ధతను నిరూపించుకుంది. గత నాలుగేళ్ళు గా అమలు చేస్తున్న పంట రుణ మాఫీ పథకం ఈ ఏడాదితో పూర్తవు తున్నందున ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇచ్చేందుకు సమాయిత్తమ యింది. అలాగే రైతుల అకాల మరణంతో నష్టపోతున్న వారి కుటుంబాలను ఆదుకునేం దుకు వచ్చే ఏడాది నుండి రైతు బీమా పదకాను అమలు చేయనున్నట్లు ప్రకటించి బడ్జెట్‌లో ఇందుకు రూ 500 కోట్లు కేటాయించింది. అసంఘటిత వ్యవసాయరంగాన్ని సంఘటితం చేసేందుకు రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. పంట మద్దతు ధర మార్కెట్ ధర కన్న తక్కువ వుంటే రైతు సమన్వయ సమితులు రైతుల నుండి పంట ను కొనుగోలు చేస్తాయి. అయితే బడ్జెట్‌లో ఇందుకు నిధులు కేటాయించక పోయినా పంట కొనుగోలులో ప్రభుత్వం పూచిదారుగా వుండి తగిన నిధులు సమకూర్చ నున్నట్లు హామీ ఇచ్చింది. గత బడ్జెట్ కన్నా రూ. 9,103 కోట్లు అదనంగా జోడించి వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ. 15,511 కోట్లు కేటాయించింది.

### 2018-19 బడ్జెట్ సమగ్ర స్వరూపం

రూ. కోట్లలో

| | |
|---|---|
| **మొత్తం బడ్జెట్** | 1,74,453.83 |
| ప్రగతి పద్దు | 1,04,757.90 |
| నిర్వహణ పద్దు | 69,695.93 |
| రెవెన్యూ ఆదాయం | 1,30,975.11 |
| రెవెన్యూ వ్యయం | 1,25,454.70 |
| రెవెన్యూ మిగులు | 5,520.41 |
| **మొత్తం ఆదాయం** | |
| రాష్ట్రం సొంత పన్నులు | 73,751.88 |
| పన్నేతర ఆదాయం | 8,973.92 |
| కేంద్రం పన్నుల వాటా | 19,207.43 |
| కేంద్రం నుంచి గ్రాంట్లు | 29,041.88 |
| **మొత్తం ఖర్చు** | |
| రెవెన్యూ వ్యయం | 1,25,454.70 |
| పెట్టుబడి వ్యయం | 33,369.10 |
| రుణాలు, అడ్వాన్సులు | 9,035.56 |
| పెట్టుబడులకు చెల్లింపులు | 6,594.48 |
| ద్రవ్య లోటు | 29,077.07 |

### సాగు నీటి రంగం

వరుసగా మూడవసారి భారీ కేటాయింపులు సాగు నీటి రంగానికి తెలంగాణా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. కాంగ్రెస్ హయాం లో చేపట్టిన జలయజ్ఞం కింద సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 10 ఏళ్లలో ఖర్చు పెట్టిన మొత్తాన్ని తెలంగాణా ప్రభుత్వం గత మూడున్నర ఏళ్లలో ఖర్చు చేసింది. నిర్మాణంలో వున్న 23 భారీ, 13 మధ్య తరహా ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి కోటి ఎకరాలకు ఆయుకట్ట అందించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం వరుసగా మూడవ సారి సాగునీటి రంగానికి రూ. 25,000 కోట్లు కేటాయిం చింది. అందులో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు రూ. 6094 కోట్లు, రూ. 3,035 కోట్లు చొప్పున నిధులు కేటాయించి ఈ రెండు ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఆ తర్వాత డిండి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు కేటాయించింది. మహబూబ్ నగర్ జిల్లాలో చేపట్టిన కల్వకుర్తి, బీమా, నెట్టెం పాడు, కోయల్ సాగర్ వంటి ప్రాజెక్టులకు భారీ గా నిధులు కేటాయించింది. ఈ ప్రాజెక్టుల కోసం ఏర్పాటు చేసిన కార్పోరేషన్ల ద్వారా బయట నుండి నిధులు సమీకరించి ఈ ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు తెలియచేసింది.

### మిషన్ భగీరథ

ప్రతి ఇంటికి శుద్ధి జలాలు దేశంలోనే ఒక బృహత్తర తాగు నీటి పథకంగా జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందిన మిషన్ భగీరథ పథకాన్ని దాదాపు 43 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు అంచనా వ్యయంతో 2014లో చేపట్టి ప్రభుత్వం రాష్ట్రంలోని ఇంటింటికి శుద్ధి జలాలు అందించనుంది. ఈ పథకంలో ఇంతవరకు రూ. 25,000 కోట్లు ఖర్చయ్యాయి. లక్ష్యానికి అనుగుణంగా ఈ ఏడాది చివర నాటికి మిషన్ భగీరథను పూర్తి చేసేందుకు పథకం అంచనా వ్యయంలో రూ. 18,791 కోట్లను వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా ప్రభుత్వం ఖర్చు చేయవలసి వుంటుంది. ఈ పథకానికి 80 శాతం నిధులను రుణాల ద్వారా సమీకరిస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది తన వాటాగా రూ. 3 వేల కోట్లు కేటాయించవలసి వుండగా బడ్జెట్‌లో రూ. 1801 కోట్లు మాత్రమె కేటాయించింది. దీంతో బడ్జెట్ కేటాయింపులు సగానికిసగం తగ్గి పోవటంతో అనుకున్న గడువులోగా ఈ పథకాన్ని పూర్తి చేయడమే ప్రభుత్వానికి సవాలే.

### మిషన్ కాకతీయ : చెరువులకు జలకళ

రాష్ట్రంలో చెరువుల పునరుద్ధరణకు


ప్రభుత్వం చేపట్టిన మరో బృహత్తర పథకం మిషన్ కాకతీయకు బడ్జెట్‌లో రూ. 1601 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద నాలుగు దశల్లో 28,652 చెరువుల పునరుద్ధరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 16,606 చెరువుల పునరుద్ధరణ పూర్తయింది. ప్రస్తుతం మిషన్ కాకతీయ నాలుగవ విడత పనులు ఇటీవల మొదలయ్యాయి. బడ్జెట్ కేటాయింపులతో పాటు నాబార్డు తదితర ఆర్థిక సంస్థల ద్వారా ఈ పథకానికి నిధులు సమకూర్చుకుంటోంది.

రెండు పడక గదుల ఇళ్ళు – పేదలకు గూడు నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో వినూత్న పథకం రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణం. ఈ పథకం కింద 2,72,763 ఇళ్ళు మంజూరు కాగా ఇప్పటివరకు 9,522 ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయి. 2018–19లో ఈ పథకానికి రూ. 2643 కోట్లు కేటాయించిన ప్రభుత్వం మరిన్ని నిధులు సమకూర్చుకునేందుకు రుణాలు సేకరించను న్నట్లు బడ్జెట్‌లో తెలిపింది.

**సంక్షేమం :**

"అందరి ఇళ్ళకు సంక్షేమం, ప్రతి ముఖంలో ఆనందం" అన్న నినాదంతో దేశం లోమరెక్కడా లేని తరహాలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణా ప్రభుత్వం గత బడ్జెట్ కన్నా కొత్త బడ్జెట్‌లో SC, ST, మైనార్టీలు, దళితులకు కేటాయింపులు భారీ గా పెంచింది. ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్.డి.ఎఫ్) కింద SC లకు రూ. 16,452 కోట్లు, STలకు 9,693.11 కోట్లు కేటాయించారు. 2017-18 నుండి ఉప ప్రణాళిక స్థానంలో ప్రత్యేక అభివృద్ధి నిధిని తీసుకువచ్చారు. SC,ST వర్గాల జనాభా నిష్పత్తి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధి ని ఏర్పాటు చేసారు. ఈ నిధిలో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు ఖర్చు కాకుంటే అవి మరుసటి ఏడాదికి బదలాయింపు జరిగేలా చట్టం చేసారు. 2017–18 సంవత్సరంలో ఫిబ్రవరి గణాంకాల ప్రకారం కేటాయించిన నిధులలో 54 శాతం మాత్రమే ఖర్చయ్యాయి. నిధులను పూర్తిగా ఖర్చు చేయక పోవటం ఆయా వర్గాలను కలవరపరుస్తున్న విషయం.

SC, ST వర్గాలకు కేటాయింపులు పెరిగిన రీతిలో BC లకు బడ్జెట్ కేటాయింపులు పెరగలేదు. పైగా BC లకు ప్రత్యేక అభివృద్ధి నిధి ఏర్పాటుపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. మరో వైపు మైనార్టీల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. గత బడ్జెట్ కన్నా రూ. 800 కోట్లు అదనంగా కొత్త బడ్జెట్‌లో రూ. 2,000 కోట్లు కేటాయించారు. దాదాపు 9 వేల మంది ఇమామ్‌లు, మౌజన్‌లు ప్రభుత్వం నుండి ప్రతి నెలా గౌరవ వేతనం అందుకుంటున్నారు. ఏటా రూ. 5,300 కోట్లు మేర వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఫించన్లు ఇస్తున్న ప్రభుత్వం వచ్చే నెల నుండి బోదకాలు వ్యాధిగ్రస్తులకు కూడా ఆసరా ఫించన్లు ప్రకటించింది. పేదింటి ఆడపడుచు లకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఆర్థిక చేయూత నిస్తున్న ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి గత ఏడాది తో పోలిస్తే దాదాపు 40 శాతం అదనం గా నిధులు కేటాయించింది. ఈ పథకం వల్ల బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం పేర్కొంది.




ఆరోగ్య తెలంగాణా సాధన లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణా ప్రభుత్వం అమ్మ ఒడి, ఆరోగ్య లక్ష్మీ, కేసీఆర్ కిట్లు వంటి పథకాల ద్వారా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తోంది. గత బడ్జెట్ కంటే 2018–19 బడ్జెట్‌లో దాదాపు రూ. 1186.42 కోట్లు అధికంగా కేటాయించారు. అయితే గత రెండేళ్ళుగా ఆరోగ్య, వైద్య రంగానికి కేటాయించిన నిధులు కనీసం 70 శాతమైనా విడుదల కాలేదు.

**విద్యుత్ : లోటు నుండి మిగులు వైపు**

దాదాపు 2,700 మెగావాట్ల విద్యుత్ లోటుతో ప్రస్థానం ప్రారంభించిన తెలంగాణా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక చర్యల వల్ల ప్రస్తుతం విద్యుత్ మిగులు రాష్ట్రంగా రికార్డు కెక్కింది. తీవ్ర విద్యుత్ సంక్షోభం నుంచి 24 గంటల పాటు వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా చేయగల స్థితికి చేరుకుంది. రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుత్ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం 5295 మెగావాట్లు వుండగా ప్రస్తుతం ఇది 11,689 మెగావాట్లకు చేరుకుంది. అయితే రోజురోజుకు పెరుగుతున్న డిమాండుతో పాటు ఇటీవల వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా మొదలవడంవల్ల డిస్కాంలు భారీ ఎత్తున విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. డిస్కాంల ఆర్థిక లోటు వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ. 9,700 కోట్లకు చేరుకుం టుందని అంచనా. 2017–18లో డిస్కాంలకు రూ. 4,484.30 కోట్లు సబ్సిడీ ఇచ్చిన ప్రభుత్వం ఈ మొత్తాన్ని ఈ బడ్జెట్‌లో రూ. 5,650 కు పెంచింది. ఇందులో ఎక్కువ భాగం నిధులు ఉచిత విద్యుత్తుకే కేటాయించ వలసివస్తోంది.

అభివృద్ధి అంటే కేవలం పట్టణ

ప్రాంతాలకే పరిమితం కాకూడదు. గ్రామ స్థాయిలో సమాజ వికాసం అవసరమని అంటూ రాష్ట్ర ప్రభుత్వం సాగు నీటి రంగం తర్వాత బడ్జెట్‌లో అత్యధికంగా రూ. 15,562 కోట్లను పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించింది. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం కొత్త పంచాయత్ రాజ్ బిల్లును తీసుకువస్తోంది. తండాలు, ఆదివాసీ గూడెంలను గ్రామా పంచాయితీలుగా మారుస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. గొర్రెలు, చేపలు, కోళ్ళ పెంపకం పై ఆధారపడిన వారికి చేయూతనిచ్చేందుకు బడ్జెట్‌లో సముచితంగా నిధులు కేటాయించింది. చేతి వృత్తుల వారికి కూడా బడ్జెట్ లో భరోసా కల్పించింది.

2017-18తో పోలిస్తే 2018-19లో బడ్జెట్‌లో విద్యా రంగానికి స్వల్పం గా నిధులు పెరిగాయి. పాఠశాల విద్యకు నిధుల కేటాయింపు సముచితంగావున్నా ఉన్నత విద్యకు నిరాశ ఎదురయింది. విశ్వవిద్యాలయాలకు కేటాయింపులు నామమాత్రమే. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య హామీ చేసే దిశలో వెనుకబడిన వర్గాలకు రెసిడెన్షియల్ విద్యను బలోపేతం చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. ఇక పోతే పారిశ్రామికాభివృద్ధి, IT, రహదారులు వంటి రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు సముచితంగానే వున్నాయి.

ప్రతి ఏడాది గడిచే కొద్ది తెలంగాణా బడ్జెట్ పరిమాణం పెరుగుతోంది. కేటాయింపులు పెంచేందుకు వనరులు ఉండటమే ఇందుకు కారణమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆర్థిక నిపుణులు బడ్జెట్ లో అంచనా వ్యయానికి, వాస్తవంగా ఖర్చు అయిన వ్యయానికి మధ్య పెరుగుతున్న వ్యత్యాసం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2017-18లో రూ.1.39 లక్షల కోట్లు అంచనా వ్యయం కాగా ఈ ఏడాది జనవరి వరకు 62.8 శాతం, అంటే రూ. 87,566 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి.

మొత్తం బడ్జెట్ వ్యయంలో రెవెన్యూ వ్యయం రూ. 1,25,454.70 కోట్లు. క్యాపిటల్ వ్యయం రూ. 33,369.10 కోట్లు. క్యాపిటల్ వ్యయం శాశ్వత ప్రగతిని, రెవెన్యూ వ్యయం తాత్కాలిక సంక్షేమాన్ని నిర్దేశిస్తాయి. ఈ నేపథ్యం లో తెలంగాణా ప్రభుత్వం ప్రతి ఏటా కాపిటల్ వ్యయాన్ని పెంచుకుంటూ రావడం అభినంద నీయం. 2017-18లో సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ కేటాయింపులలో క్యాపిటల్ వ్యయం 17.5 శాతం వుండగా, కొత్త బడ్జెట్ లో ఇది 19 శాతానికి చేరుకోనుంది. ఇది ప్రగతి కి సంకేతం.

రాష్ట్ర అవతరణ సమయంలో రూ. 70 వేల కోట్లు వరకు వున్న అప్పులు 2018-19 నాటికి రూ. 1,18,000 కోట్లు కు చేరవచ్చునని భావిస్తున్నారు. అంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర అప్పులు రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 21.38 శాతానికి పెరిగే అవకాశ వుంది. ఈ సరళి ఇలాగే సాగి 25 శాతానికి పెరిగితే ఆర్థిక క్రమశిక్షణ పాటించని రాష్ట్రాల జాబితాలో తెలంగాణా చేరే అవకాశం వుంది. బంగారు తెలంగాణా లక్ష్య సాధన దిశలో ముందుకు వెళు తున్న రాష్ట్ర ప్రభుత్వం రుణ భారాన్ని కట్టడి చేసుకోవలసిన అవసరం వుంది. రాష్ట్ర ఆదాయ వ్యయాలమధ్య వ్యత్యాసం పెరగకుండా చూసుకుంటూ మరిన్ని చర్యలు చేపట్టాలి. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు “అను” 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. ఏ నెలకైనా సంబంధించిన అంశం (Topic of the month) పైనే వ్యాసాలు పంపాలి గమనించగలరు. వ్యాసాలను పంపేవారు ఏ నెలకానెల ఇచ్చే ప్రత్యేక అంశంపైననే 5వ తారీఖులోపు నాలుగు వాక్యాల అవరణం పంపాలి.

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# ఈశాన్య రాష్ట్రాల గిరిజన, గిరిజనేతర నృత్యాలు

- డా॥ సురభి లక్ష్మీశారద



ఈశాన్య రాష్ట్రాల గిరిజన, గిరిజనేతర నృత్యాలు ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబింపచేస్తాయి. చాలావరకు ఈ నృత్యాలు వ్యవసాయానికి, బౌద్ధ మతానికి, సంవత్సరాదికి అనుసంధానించబడి ఉంటాయి. సాధారణంగా కళలు ఏవైన కళాకారులలో ఉన్న భావోద్వేగాలను వ్యక్త పరుస్తాయి. ఈ నృత్యాలను గిరిజన సంప్రదాయ నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలని రెండు విభాగాలుగా పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఈశాన్య రాష్ట్రాల గిరిజన, గిరిజనేతర నృత్యాలు ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబింపచేస్తాయి. చాలావరకు ఈ నృత్యాలు వ్యవసాయానికి, బౌద్ధ మతానికి, సంవత్సరాదికి అనుసంధానించబడి ఉంటాయి. సాధారణంగా కళలు ఏవైన కళాకారులలో ఉన్న భావోద్వేగాలను వ్యక్త పరుస్తాయి. ఈ నృత్యాలను మనం రెండు విభాగాలుగా పరిగణనలోకి తీసుకోవచ్చు.

### 1. గిరిజన నృత్యాలు

ఇవి కొన్ని ప్రత్యేక తెగలు, ప్రత్యేక సందర్భాలలో మరింత ప్రత్యేకంగా కనిపిస్తూ నర్తిస్తారు.

### 2. గిరిజనేతర నృత్యాలు

ఇవి శాస్త్రీయమైన, లేదా జానపదమైనవి కావచ్చు. చక్కని రంగురంగుల వస్త్రాలను ధరించి వివిధ తరహాల నృత్యాలతో సమ్మిళతమై ఉంటాయి. ఈ ఏడూ రాష్ట్రాలు దీనికి ప్రత్యేక సంస్కృతి-సంప్రదాయాలతో విలసిల్లుతున్నాయి.

**మరి ఆ గిరిజన నృత్యాలను ఇప్పుడు చూద్దాం**

### 1. లోహానృత్యం

మేఘాలయకు చెందిన 'పినార్' తెగ ఈ నృత్యాన్ని సాధన చేస్తుంది. స్త్రీ మధ్యలో, ఇరు వైపులా పురుషులు నిలబడి ఒకరి చేతిని మరొకరు పట్టుకుని అడుగులు వేస్తారు. హాస్యగాడు మధ్యమధ్యలో ప్రేక్షకులను అలరిస్తూ ఉంటారు.

### 2. ఛాంగ్‌లా నృత్యం

ఈ నృత్యం నాగాలాండ్‌లోని 'ఛాంగ్' తెగ చెందినది దీన్ని 'శూల' (Sula) అని కూడా పిలుస్తారు. 3 రోజులు ప్రదర్శించే ఈ నృత్యాన్ని 'పోంగ్‌లమ్' పండుగకు ప్రదర్శిస్తారు. పురుషులు యుద్ధానికి వెళ్ళే దుస్తులను, ఆడవారు రంగురంగుల వస్త్రాలను ధరిస్తారు.

### 3. నాంగ్ క్రిమ్ (Nong Krem) నృత్యం

మేఘాలయకు చెందిన నాంగ్ క్రిమ్ నృత్యం విలక్షణమైనది. 'ఖాసీ గిరిజనులు' వరి పండినపుడు ధాన్యం సేకరించే సమయంలో ఆడతారు, పాడతారు

### 4. వంగల నృత్యం (Wangala)

మేఘాలయకు చెందిన 'గారో' తెగ చేసే నృత్యం పంట చేతికి వచ్చినపుడు చేసే ఈ నృత్యం రెండవ అతిపెద్ద తెగకు చెందినది.

### 5. లోథానాగ (Lothanaga)

నాగాలాండ్‌కు చెందిన లోథానాగ వీరి

ప్రముఖ నర్తకి, హైదరాబాద్.
E-mail: saradasurabhi@yahoo.com

ఆటపాటలతో ప్రసిద్ధికెక్కిన అతిపెద్ద తెగ.

**6. ఖైమ్‌నుంగన్ (Khiamiungan)**

నాగాలాండ్‌కు చెందిన 'యన్‌సంగ్' జిల్లాకు చెందిన చిన్నతెగ వారు ఈ నృత్యాన్ని వైభవంగా ప్రదర్శిస్తారు.

**7. జామ్ హంగ్ నౌథోంగ్ నృత్యం**

దీనిని నాగాలాండ్‌కు చెందిన అతిపెద్ద ఖైమ్ నుంగన్ తెగ వారు ప్రదర్శిస్తారు.

**8. వాంఛో నృత్యం**

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన పండుగ నృత్యం వాంఛో.

**9. అజిలమ్ నృత్యం**

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన 'మెన్‌ప' తెగకు చెందిన నృత్యం ఇది. ఈ నృత్యం ప్రాంతీయింగా, జాతీయంగా, అంతర్జాతీయంగా పేర్గాంచింది.

**10. ఛలో నృత్యం**

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన 'నాక్టె' తెగకు చెందిన మంచి ప్రశంసలందుకున్న నృత్యం.

**11. హిరిఖనింగ్ నృత్యం**

అరుణాచల్‌ప్రదేశ్‌కి చెందిన 'అపాతని' తెగకు చెందినది.

**12. పోనుంగ్ నృత్యం**

అరుణాచల్‌ప్రదేశ్ 'అవి' తెగకు చెందిన సంపన్న నృత్యం ఇది.

**13. ఛావమ్‌గ్లైజాన్ నృత్యం**

మిజోరాంకు చెందిన 'వని' తెగకు చెందిన ప్రత్యేక నృత్యం. భార్య చనిపోతే భర్త ఈ నృత్యాన్ని చేస్తాడు.

**14. జంగ్‌తాలమ్ నృత్యం**

మిజోరాంకు చెందిన 'పైటీ' తెగకు చెందిన నృత్యం. స్త్రీ, పురుషులు ఈ నృత్యాన్ని మంచి సంగీత, సంప్రదాయ దుస్తులతో చాలా చక్కగా ప్రదర్శిస్తారు.

**15. హజగిరి నృత్యం**

త్రిపురకు చెందిన 'రియాంగ్' సంఘానికి చెందిన నృత్యం మట్టి పాత్రపైన నిలబడి తలపైన సీసాను పెట్టుకుని దానిపై దీపాన్ని పెడతారు. శరీరం అధోభాగంతో నృత్యం చేస్తుంటే ప్రేక్షకులు చప్పట్లు కొడతారు.

**16. హాయ్ – హాక్ నృత్యం**

తరతరాల నుండి లయనుగుణ నృత్య సంప్రదాయలతో చేసే 'హలయ్' తెగకు చెందిన త్రిపుర రాష్ట్ర నృత్యం.



**17. కబూయ్ నృత్యం**

నాగయువత చేసే రంగుల నృత్యం యువకులు నాగ'డయోస్' అంటే కత్తులు పట్టుకుంటే యువతులు వారిని అనుసరిస్తారు. స్త్రీలు నగలను ధరిస్తారు.

ఇక గిరిజనేత నృత్యాలలో జానపద, శాస్త్రీయ వృత్యాలున్నాయి. శాస్త్రీయ నృత్యాలను పరికిస్తే;

**1. సత్రియ నృత్యం**

అస్సాంకు చెందిన సత్రియ నృత్యం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. ఇది చలికాలంలో ఈశాన్య రాష్ట్రంలో కృష్ణ–వైష్ణవ తత్వాన్ని ప్రదర్శించే నృత్య–నాటిక పద్ధతిలో కొనసాగే శాస్త్రీయ నృత్యం ఇది.

**2. మణిపురి నృత్యం**

దీనిని జగోయ్ అని కూడా అంటారు. ఈ నృత్యాన్ని అన్ని మతపరమైన కార్యక్రమాలలో, దేవాలయాల్లో ప్రదర్శిస్తారు. చక్కటి మణిపురి సాంప్రదాయ దుస్తులతో ఆకర్షణీయమైన, లయబద్ధమైన, అందమైన, లాస్య భంగిమలతో సాగే శాస్త్రీయ నృత్యం. కృష్ణ, వైష్ణవ తత్వాలు ఈ నృత్యాలలో ప్రతిబింబిస్తాయి. వీరు కర్తాళ్, పుంగ్, వంటి వాయిద్యాలతో పాటు సంకీర్తనలు ప్రదర్శించడం పరిపాటి.

**3. లయహరోబ (కర్మ నృత్యాలు)**

వీటిలో మణిపురికి చెందిన లయహరోబ దేవతను స్తుతిస్తారు. 'మైబి', 'మైబా' పూజారులు ఈ తెల్ల వస్త్రాలతో 9 మంది దేవతలను భూమిపైకి స్వర్గం నుండి రప్పిస్తారని నమ్మకం.

**4. సోలకియ నృత్యం**

మిజోరాంకు చెందిన ఈ నృత్యం శత్రువులపైన విజయం సాధించినపుడు, స్త్రీ, పురుషులిద్దరు అన్ని వర్గాల మిజో ప్రజలు ప్రదర్శిస్తారు.

**5. బిహు నృత్యం**

పంటలు పండినపుడు చేసే అద్భుత అస్సాంకు చెందిన నృత్యం బిహు 'బహన్‌బిహు' 'వైశాఖ్‌బిహు' గోసైన్ బిహు అని వివిధ రకాలు వున్నాయి.

**6. లెబాంగ్ బౌమాని**

త్రిపురకు చెందిన కోతల నృత్యం ఇది మిడతలను పట్టి ఒక సంచిలో వేసేటపుడు వెదురుతో ఒక ధ్వనిని చేస్తారు. తద్వారా పంటపైకి మిడతలు దాడి చేయకుండా కాపాడుగలుగుతారు. అమ్మాయిలు మాత్రమే చేస్తారు.

**7. ధన్‌నాబ్**

సిక్కింకి చెందిన వరి నృత్యం సంప్రదాయ దుస్తులతో చోక్కా, పైజామా వేసుకుని, దానిపైన మరో కోటును వేసుకుంటారు.

ఈ విధంగా ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నో రకాల గిరిజన, గిరిజనేతల నృత్యాలున్నాయి. ఇవి మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను సుసంపన్నం చేస్తున్నాయి. ■








విశాఖ నగరంలో స్వచ్ఛతకు ప్రేరణ

## కొత్త పుస్తకం:

ఈశాన్య ప్రాంతంలోని జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, దుస్తులు, వినోద కార్యక్రమాలవంటి అనేక అంశాలపై సమగ్ర సమాచారాన్ని ఈ పుస్తకం అందచేస్తుంది. 20వ శతాబ్దపు ప్రముఖ పురాతత్వవేత్త లలిత్ ప్రసాద్ విద్యార్థి ఈ పుస్తకాన్ని రాశారు. ఆయన రాంచీ విశ్వవిద్యాలయంలో పురాతత్వవిభాగ అధ్యక్షుడు.




పుస్తకం వెల: రూ. 50.00 ప్రచురణ : 1993. ఐఎస్‌బిఎన్ నెంబరు: 81-230-0049-9

**ప్రచురణల విభాగం విక్రయ కేంద్రం చిరునామా : పబ్లికేషన్స్ డివిజన్ సెల్స్ ఎంపోరియం**

రూం.నం. 204, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.

ఫోన్ 040-27535383, 27544146 - E-mail: bmsehyd@gmail.com

# అంతర్జాతీయ సౌర సమ్మేళనం

సౌరశక్తి అపారంగా లభించే దేశాలలో, జన సామాన్యము, పరిశ్రమలు, వర్తక, వాణిజ్య సంస్థలు మొదలైనవన్నీ, పరస్పర సహకారంతో ప్రత్యామ్నాయ ఇంధనవనరును అభివృద్ధిచేయడానికి తగిన సాంకేతిక, ఆర్థిక సహకారాన్ని అందచేయడానికి ఈ అంతర్జాతీయ సమాజాన్ని ప్రారంభించారు. గతంలో ఇటువంటి ఉమ్మడి సమాఖ్య ఉనికిలో లేదు. భౌగోళికంగా సౌర వేడిమి అధికంగా లభించే దేశాలలో, చౌకగా, లభించే పర్యావరణ హితమైన వనరు ఇది కనుక, ఎంతో ఉపయోగకరం. ఈ సమ్మేళనంలోని ధనిక సభ్యులు, అధిక సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న దేశాలు, పేద, వెనుకబడిన దేశాలకు సాంకేతిక, ఆర్థిక సహకారమందిస్తాయి.

మన ప్రధానమంత్రి, ఫ్రాన్సు అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హాలండ్‌లు సంయుక్తంగా నవంబర్ 30, 2015న పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సౌరవిద్యుత్ సమావేశంలో ఈ సంఘాన్ని ఆవిష్కరించారు. 2030 నాటికి, ఒక ట్రిలియన్ వాట్ సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయాలని ఈ అంతర్జాతీయ సమాఖ్య నిర్ణయిం



చింది. అయితే దీనికి ఒక ట్రిలియన్ డాలర్లు అవసరమవుతాయని, ఫ్రాన్సు అధ్యక్షుడు అన్నారు. ఈ సంఘంలో మొత్తం 121 దేశాలు సభ్యులుగా చేరాయి. ఇప్పటివరకు, 56 దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ బృందంలోని సభ్యదేశాలన్నీ పరస్పర సహకారంతో స్వచ్ఛందంగా ఉమ్మడి అవసరాలను తీర్చుకోడానికి పాటుపడతాయి. ఇందుకోసం ఉమ్మడిగా వనరుల సమీకరణ, సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు ప్రాజక్టుల అభివృద్ధి వంటి చర్యలను చేపడ తాయి. అవసరమైన సందర్భాలలో ప్రైవేటురంగ సహకారాన్ని కూడ అందిపుచ్చుకుని, లక్ష్య సాధనకు కృషిచేస్తాయి. జూన్ 30, 2016న ఈ బృందం ప్రపంచ బ్యాంకుతో వనరుల సమీకరణకు ఒక ఒప్పందాన్ని చేసుకున్నది. ఈ బ్యాంకు, వెయ్యి బిలియన్ల అమెరికన్ డాలర్లకు పైగా వనరులను 2030 నాటికి సమకూరుస్తుంది. జనవరి 2018 లో అబుదాభిలో జరిగిన ప్రపంచ భవిష్యత్ ఇంధనవనరుల సమావేశంలో మన దేశం, తనవంతు వాటాగా 350 మిలియన్ డాలర్ల సౌర నిధి ఏర్పాటును ప్రకటించింది. ■

Publishing date 1 April 2018
Posting on 2- 3 April 2018
Yojana (Telugu) April 2018

RNI Regd. No 37729/80
Regd. No. H/SD-512/2018-20

# నూతన ప్రచురణలు




**పుస్తకాలు లభించు చోటు :** ప్రచురణల విభాగం - విక్రయకేంద్రం

రూం. నెం. 204, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.

ఫోన్ 040-27535383, 27544146

**E-mail: bmsehyd@gmail.com**

Printed & Published by Mrs. Sadhana Rout,Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314